


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

కరీంనగర్ | 01-05-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :141 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on




## ప్రభుత్వ సలహాదారుగా హనుమంతరావు



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (వుదయం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. క్యాబినెట్ హోదా కల్పించి, వీహెచ్‌ను సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డీజీపీగా ఈ రోజు పదవీ విరమణ చేయనున్న బత్తుల శివధర్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా తనకు నెలకు రూ.1 లక్ష వేతనం వస్తుందని, తన రెండేళ్ల పదవీ కాలంలో వచ్చే మొత్తాన్ని ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్న విద్యార్థుల కోసం ఇస్తానని వి. హనుమంతరావు ప్రకటించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (బీసీ సంక్షేమం, అభివృద్ధి) నియమించిన విషయం తెలిసిందే. ఆయనకు కేబినెట్ హోదా ఉంటుంది.

ఈరోజు ఆయన మాట్లాడుతూ, తన పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుందని, ప్రతి నెల రూ.1 లక్ష వేతనం వస్తుందని తెలిపారు. ఈ మొత్తాన్ని పేద విద్యార్థులకు అందించేలా ట్రస్టులకు ఇస్తానని హామీ ఇచ్చారు. తనకు కీలక పదవిని అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏది అడిగినా కాంగ్రెస్ పార్టీ కాదనలేదని పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ అడిగితే, రాజీవ్ గాంధీ తనపై మిగతా 2లో..

# యుద్ధాల నడుమ పుతిన్, ట్రంప్ చర్చ

## గంటన్నర సాగిన సంభాషణ

- ఇరాన్, ఉక్రెయిన్ ఘర్షణలపై చర్చ
- ఇరాన్‌పై భూతల దాడి అత్యంత ప్రమాదకరం : పుతిన్
- చాలా మంచి సంభాషణ : ట్రంప్ అభివర్ణన





ఒకవైపు కాల్పుల విరమణ కొనసాగిస్తూనే, మాటలతో తూటాలు వదులుతూ అమెరికా, ఇరాన్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నాయి. జలసంధి ఇక్కట్ల కారణంగా చమురు రవాణాకు అంతరాయాలు ఏర్పడి, ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతున్న తరుణంలో ఈ ఘర్షణకు శాశ్వత ముగింపు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న దేశాలకూ ఇరు దేశాల అధ్యక్షులూ షాక్ ఇస్తున్నారు. పర్షియన్ గల్ఫ్, హోర్ముజ్ జలసంధి కి కొత్త అధ్యాయం ఆవిష్కృతమవుతోంది అంటూ ఇరాన్ సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీ తాజాగా ఎక్స్ పై పోస్టు పెట్టారు. అయితే, తెహ్రాన్‌తో అణుఒప్పందం కుదిరేవరకు హోర్ముజ్‌లో తమ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్తున్నారు. ఈ క్రమంలో ఇరాన్ కు మిత్ర దేశమైన రష్యా అధ్యక్షుడు పుతిన్ తో సంభాషణపై ప్రపంచ దృష్టి కేంద్రీకృతమైంది.

**వుదయం డెస్క్, ఏప్రిల్ 30:** యుద్ధాలతో ప్రపంచ పరిస్థితులు ఉద్రిక్తతంగా మారిన నేపథ్యంలో బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంటన్నరకు పైగా ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా, ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణతో పాటు, ఉక్రెయిన్‌లో సున్నితంగా ఉన్న కాల్పుల విరమణపై వారు చర్చించినట్టు తెలుస్తోంది. దాదాపు 90 నిమిషాలకు పైగా సాగిన ఈ సంభాషణలో, అమెరికా గనుక ఇరాన్‌పై భూతల దండయాత్రకు దిగితే అది అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తుందని రష్యా అధ్యక్షుడు హెచ్చరించారని, అదే సమయంలో, ఉక్రెయిన్‌లో తాత్కాలిక కాల్పుల విరమణను పొడిగించాలన్న ట్రంప్ నిర్ణయాన్ని పుతిన్ స్వాగతించారని, క్రెమ్లిన్ అధినేత విదేశాంగ విధాన సలహాదారు యూరి ఉషాకోవ్ తెలిపినట్లు ది గార్డియన్ పత్రిక పేర్కొంది.

**చాలా మంచి సంభాషణ అని అభివర్ణించిన ట్రంప్**

ట్రంప్ ఆ తర్వాత ఈ సంభాషణను సానుకూల పద జాలంతో అభివర్ణిస్తూ, "చాలా మంచి సంభాషణ" అని పేర్కొన్నారు. అలాగే రష్యా నాయకుడితో తనకు చాలాకాలంగా పరిచయం ఉందని కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. ఇరాన్ భూగర్భంలో పాతిపెట్టిన యురేనియంను స్వాధీనం చేసుకోవడానికి పుతిన్ ముందుకొచ్చారని కూడా అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. అయినప్పటికీ, ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని మిగతా 2లో..

## తెలంగాణ రక్షణ సేనకు ఈసీ ఆమోదం



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (వుదయం):** తండ్రి, సోదరుడితో విబేధాల కారణంగా వేరు కుంపటి పెట్టుకున్న కల్వకుంట్ల కవిత పార్టీ టీఆర్ఎస్‌కే కేంద్ర ఎన్నికల సంఘం ఆమోద ముద్ర వేసేసింది. ఈ పేరును కల్వకుంట్ల కవితకు అధికారికంగా ప్రకటిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. కాగా, ఈనెల 25న మేడ్చల్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో టీఆర్ఎస్ పార్టీ పేరును కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఎన్నికల సంఘం ఆమోదించింది. ఈ మేరకు ఈరోజు(గురువారం) బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లిన ఎన్నికల అధికారులు.. పార్టీకి అనుమతి ఇస్తూ లేఖను అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

తెలంగాణ రక్షణ సేన పేరు ఆమోదంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్ నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా'' అని కవిత సామాజిక మాధ్యమం ఎక్స్ పై పోస్టు చేశారు.

తన కొత్త పార్టీ పేరు మిగతా 2లో..

## ఐపాక్ డైరెక్టర్ వినేష్ చందేల్‌కు బెయిలు
# వ్యతిరేకించని ఈడీ

- తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి రాజకీయ సలహాదారు
- పోలింగ్ పూర్తయిన మరురోజే బెయిల్
- బెయిల్‌ను వ్యతిరేకించేందుకు అవకాశం ఇచ్చినా ఉపయోగించుకోలేదు : జడ్జి

5 లో..



## తమిళనాట డీఎంకే బెంగాల్‌లో బిజెపి : టుడేస్ చాణక్య

**వుదయం డెస్క్, ఏప్రిల్ 30 :** ఇంటర్నెట్ డెస్క్: తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే కూటమి మరోసారి అధికారంలోకి రానుందని మెజారిటీ సర్వేలు అభిప్రాయపడగా.. నేడు విడుదలైన టుడేస్ చాణక్య సంస్థ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేసింది. 234 స్థానాలకు గానూ మిగతా 2లో..



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన
# నూతన డీజీపీ సీవీ ఆనంద్

- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీ
- శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని సీఎంకు హామీ

2 లో..



## పెట్రోల్, డీజిల్‌పై సర్కార్ కీలక ఆదేశాలు



హైదరాబాద్: ఆయిల్ సంస్థలకు తెలంగాణ సివిల్ సప్లయ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ సరఫరాను తక్షణమే 15 శాతం పెంచాలని ఆదేశించింది. బంకుల్లో నోస్టాక్ బోర్డులు పెట్టకూడదని.. బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. డీజిల్ సరఫరా 190 శాతం పెరిగిందని.. 21,295 కిలో లీటర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పెట్రోల్ సరఫరా 118 పెంచామని తెలిపారు. మొత్తం ప్యూయల్ సరఫరా 158 శాతం పెరిగిందన్న స్టీఫెన్ రవీంద్ర.. బ్లాక్ మార్కెటింగ్‌పై ప్రత్యేక దాడులు చేస్తున్నామన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని.. ఇతర రాష్ట్ర వాహనాలపై నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

- వుదయం డెస్క్, ఏప్రిల్ 30 :

## తెలుగు రాష్ట్రాలకు ఊరట

**వుదయం డెస్క్, ఏప్రిల్ 30 :** తీవ్రమైన ఎండలు, వడగాలులతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ ఒక చల్లటి వార్త చెప్పింది. ఒక మూడు రోజుల పాటు వర్షాలు పడి ప్రజలకు ఊరట కలుగుతుందనే వరం ఇచ్చింది. అల్ప పీడన ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి



గురువారం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా, ఆంధ్రలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు

కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం,

## మే 10న హైదరాబాద్‌కు మోడీ



**వుదయం డెస్క్, ఏప్రిల్ 30 :** తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం



## ..అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవు:
# చైర్‌పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్

### .ఆదర్శనగర్‌లో అండర్ డ్రైనేజ్ పనుల పరిశీలన.. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 30 (వుదయం)** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులన్నింటిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా పనులు జరగాలని, పనుల్లో చిన్న లోపం కనిపించినా వెంటనే సరిచేసేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో చేపడుతున్న పనులు ప్రజల నమ్మకంతో ముడిపడి ఉన్నాయని, అందుకే ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వం సహించేది లేదని చైర్‌పర్సన్ తేల్చిచెప్పారు.గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్ 1వ వార్డులో కొనసాగుతున్న అండర్ డ్రైనేజ్ పనులను చైర్‌పర్సన్ స్వయంగా పరిశీలించారు. డ్రైనేజ్ పైపుల ఏర్పాటు, తవ్వకాలు, సిమెంట్ పనుల నాణ్యత, పనుల పురోగతి తదితర అంశాలను దగ్గరుండి పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలని, అలాగే తవ్వకాల కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన డ్రైనేజ్ వ్యవస్థ అవసరమని అన్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజ్ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితి ఇకపై పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిధులతో జరిగే పనులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, నాణ్యతలో రాజీపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలాగే కాంట్రాక్టర్ తన పేరు చిరస్థాయిగా ఉండేలా నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలని చైర్‌పర్సన్ సూచించారు. ప్రజల సొమ్ముతో జరిగే ప్రతి పనిలో పారదర్శకత ఉండాలని, ప్రతి రూపాయి విలువ ప్రజలకు అందేలా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పనుల్లో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే తక్షణమే సరిదిద్దాలని, లేదంటే బిల్లులు నిలిపివేయడం, కాంట్రాక్ట్ రద్దు వంటి కఠిన చర్యలు.

తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని చైర్‌పర్సన్ వెల్లడించారు. డ్రైనేజ్, రోడ్లు, స్ట్రీట్ లైట్లు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరచడమే లక్ష్యమని అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనంద్, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మే 10న హైదరాబాద్‌కు మోడీ

మొదటి పేజీ తరువాయి..

మే 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నట్లు ఆయన మీడియాకు తెలియజేశారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారిగా తెలంగాణకు రానుండటంతో... ఈ పర్యటనపై అటు రాజకీయంగా, ఇటు పాలనాపరంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో రైల్వే వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.

హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని కిషన్ రెడ్డి తెలిపారు. అలాగే, ములుగులో ఏర్పాటు చేయనున్న సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు కూడా త్వరలోనే పట్టాలెక్కనున్నాయని వెల్లడించారు. వరంగల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రధాన మంత్రి కాకతీయ టెక్స్ టైల్ పార్క్'ను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా మంజూరైన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో ఇది ఒకటని చెప్పారు. ఈ పార్కు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రధాని పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభకు 3 లక్షల మందిని తరలించాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం భావిస్తోంది.

# యుద్ధాల నడుమ పుతిన్, ట్రంప్ చర్చ

మొదటి పేజీ తరువాయి..

ముగించడంలో సహాయపడటంపై మాస్కో తన ప్రయత్నాలను కేంద్రీకరించాలని తాను కోరుకుంటున్నట్లు ట్రంప్ సూచించారు. ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించే ఒప్పందం అందుబాటులోనే ఉందని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ, మాస్కో, కీవ్‌ల మధ్య అంతరం చాలా ఎక్కువగానే ఉంది. వాషింగ్టన్ ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ, శాశ్వత పరిష్కారం దిశగా చెప్పుకోదగ్గ పురోగతి చాలా తక్కువగా ఉంది.

**పరస్పర విరుద్ధ వైఖరుల మధ్య ఉక్రెయిన్ ప్రతిష్టంభన**

ఇతర షరతులతో పాటు, డాన్‌బాస్ ప్రాంతంలో ప్రస్తుతం రష్యా నియంత్రణలో ఉన్న భూభాగాలను వదులుకోవడానికి ఉక్రెయిన్ అంగీకరించే వరకు రష్యా తన సైనిక చర్యను కొనసాగించడానికి సిద్ధంగా ఉందని పుతిన్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ దానిని తిరస్కరిస్తూ, నిలిచిపోయిన శాంతి చర్చలకు ఈ వివాదాన్నే ప్రధాన కారణంగా చేశారు. యుద్ధరంగంలో రష్యా బలగాలు ఇప్పటికీ పైచేయి సాధిస్తూనే ఉన్నాయని, ఉక్రెయిన్ దళాలను వెనక్కి నెడుతూనే ఉన్నాయని ట్రంప్‌కు పుతిన్ చెప్పారు.

ఇదిలా ఉండగా, టెహ్రాన్‌తో పొత్తు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో రష్యా పాత్ర దౌత్యపరంగా చాలా పరిమితంగానే ఉంది. ఈ ప్రాంతంలోని అమెరికా లక్ష్యాలపై దాడులకు ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తున్న నిఘా సమాచారం, డ్రోన్‌లతో సహా, మాస్కో ఇరాన్ కు తోడ్పడటాన్ని కొనసాగిస్తోందని పాశ్చాత్య నిఘా సంస్థలు తెలిపాయి.

**ఒప్పందానికి ముందుకు రావాలని ఇరాన్‌ను కోరిన ట్రంప్**

అదే రోజు, ఇరాన్ త్వరగా తెలివిగా వ్యవహరించి,"ఒక ఒప్పందానికి అంగీకరించాలని ట్రంప్ బహిరంగంగా కోరారు. వైట్‌హౌస్ అధికారి ప్రకారం, ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా విధించనున్న దిగ్బంధనం నెలల తరబడి కొనసాగవచ్చు. దీని ప్రభావాన్ని ఎలా తగ్గించాలనే విషయంపై ఆయన చమురు సంస్థలతో చర్చలు కూడా జరిపారు. బహిరంగ ప్రకటనల ద్వారా వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నప్పటికీ, తెరవెనుక దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్తాన్, ఇరుపక్షాల మధ్య పరోక్ష సంభాషణకు వీలు కల్పిస్తూనే, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా నివారించడానికి కృషి చేస్తోందని ఒక పాకిస్తానీ అధికారి రాయిటర్స్‌కు తెలిపారు. అంతకుముందు, ఇరాన్ చర్చలు కోరుకుంటే సంప్రదించడానికి స్వేచ్ఛ ఉందని ట్రంప్ అన్నారు. ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో టెహ్రాన్ తనను తాను చక్కదిద్దుకోలేకపోతోందని కూడా ఆయన పేర్కొన్నారు.

# వడగళ్ల వాన.. నేలకొరిగిన వరిపంట

నారాయణపేట పట్టణం : ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు వడగళ్ల వాన తీవ్ర నిరాశకు గురిచేసింది. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం గడిమున్కన్‌పల్లి గ్రామంలో రాత్రి కురిసిన వడగళ్ల వానకు చేతికి వచ్చిన పంట నేలపాలైంది. బుధవారం రాత్రి కురిసిన అకాల వానకు వరి పైరు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గడంతో రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడి పంటను కాపాడుకుంటే ఈ వర్షం పంట నాశనం చేసిందని రైతులు వాపోయారు. అధికారులు నష్టపోయిన పంటను పరిశీలించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన నగర మేయర్

ఖమ్మం కార్పొరేషన్: ఖానాపురం స్థానికుల సహకారం, దాతలు అందించిన నిధులతో ఖమ్మం నగరంలోని 6వ డివిజన్‌లో బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. భవన నిర్మాణానికి సహకరించిన దాతలకు మేయర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ప్రాంతంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. చిన్నారులకు కేంద్రం అందుబాటులోకి రావడంతో వారి తల్లిదండ్రులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు గుడ్లు, బాలామృతం తదితర పోషకాహార పదార్థాలను మేయర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, డీఈ ధరణి కుమార్, ఏఈ యాకుబ్ వలి, అంగన్‌వాడీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు ఊరట

మొదటి పేజీ తరువాయి..

శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం, బుధవారం ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన
# నూతన డీజీపీ సీవీ ఆనంద్

మొదటి పేజీ తరువాయి..

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను కలిశారు. తనపై నమ్మకం ఉంచి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చించారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో, శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని ఆయన సీఎంకు హామీ ఇచ్చారు. మరోవైపు, ఈరోజు డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. చీఫ్ సెక్రటరీకి సమాన హోదాలో ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. ప్రతి నెల ఆయన రూ. 2.25 లక్షల వేతనం అందుకుంటారు. ప్రత్యేక కార్యాలయంతో పాటు ఎన్నో సదుపాయాలు ఆయనకు ఉంటాయి.

## అత్యాచార బాధితుల గర్భవిచ్ఛేదానికి
# చట్టాన్ని సవరించండి : సుప్రీం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (వుదయం)::** మైనర్ బాలిక గర్భం తొలగింపు విషయంలో గురువారం సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇటీవలే 30 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం ఒక బాలికకు అనుమతిచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ దశలో గర్భాన్ని తొలగిస్తే, బాలిక ఆరోగ్యం దెబ్బతింటుందంటూ, దీనిపై ఎయిమ్స్ ఆసుపత్రి క్యురేటివ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసు నేపథ్యంలో, అత్యాచార బాధితుల కోసం చట్టాలని సవరించాలని కేంద్రానికి కోర్టు సూచనలు చేసింది. ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని ఒక మహిళ మరీ ముఖ్యంగా ఒక బాలికను బలవంతం చేయలేమని ఇటీవల ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో, ఆ బాలిక గర్భాన్ని తొలగించేందుకు అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఎయిమ్స్ సుప్రీంలో పిటిషన్ వేసింది. 'ఎంతో ఆవేదనతో ఈ క్యూరేటివ్ పిటిషన్‌ను తీసుకువస్తున్నాం. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదు. ఆ మైనర్ తల్లి ఆరోగ్యంపై సుదీర్ఘకాలంలో తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇక్కడొక అవకాశం ఉంది. డెలివరీకి ఇంకా నాలుగు వారాలే ఉంది కాబట్టి బిడ్డకు జన్మనిచ్చి, దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించొచ్చు. ఇదంతా ఆ బాలిక క్షేమం కోసమే అని ఎయిమ్స్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు వెల్లడించారు.

ఇది ఒక బాలికపై జరిగిన అత్యాచారానికి సంబంధించిన కేసు. 15 ఏళ్ల బాలికకు సంభవించిన అవాంఛిత గర్భం. ఈ సమయంలో ఆమె చదువుకుంటూ ఉండాల్సింది, కానీ మనం ఆమెను తల్లిగా మారేలా బలవంతం చేస్తున్నాం. ఆమె అనుభవించిన వేదనను, అవమానాన్ని ఒక్కసారి ఊహించండి, అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎవరిపైనా అవాంఛిత గర్భాన్ని బలవంతంగా రుద్దలేమని అది స్పష్టం చేసింది. ఇటువంటి కేసులలో, గర్భాన్ని కొనసాగించాలా లేక తొలగించుకోవాలా అనే నిర్ణయాధికారం పూర్తిగా బాధితురాలిదే అయి ఉండాలని ధర్మాసనం నొక్కిచెప్పింది. కాగా, ఈ విషయమై మైనర్ తల్లి దండ్రులను సంప్రదించమని కోర్టు కోరింది. అలాగే, సమగ్ర వైద్య, మానసిక కౌన్సెలింగ్ తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. చట్టబద్ధమైన పరిమితులను అధిగమించి, మైనరు, ఆమె కుటుంబం విజ్ఞతతో కూడిన నిర్ణయం తీసుకునేలా వారికి తోడ్పాటు లభించేలా చూసేందుకు, ఆర్టికల్ 142 కింద తన అసాధారణ అధికారాలను కోర్టు వినియోగించింది.

అత్యాచార కేసుల్లో బాధితులు గర్భం దాల్చితే ఏ సమయంలోనైనా దాన్ని తొలగించుకునేలా మార్పులు తీసుకురావాలని ఈసందర్భంగా కేంద్రానికి సూచనలు చేసింది. 20 వారాలు దాటిన తర్వాత కూడా ఈ అవాంఛిత గర్భాన్నితొలగించుకునేందుకు అత్యాచార బాధితులకు అనుమతించేలా చట్టాన్నిసవరించాలని సూచించింది.

# తమిళనాట డీఎంకే బెంగాల్‌లో బిజెపి : టుడేస్ చాణక్య

మొదటి పేజీ తరువాయి..

125 స్థానాలు (11+/) రావొచ్చని అంచనా వేసింది. అయితే, తమిళనాట కొత్తగా బరిలోకి దిగిన విజయ్ పార్టీ టీవీకేకు.. అన్నాడీఎంకే కూటమి కంటే ఎక్కువ స్థానాలు వస్తాయంటూ పేర్కొంది. ఆ పార్టీకి 63 స్థానాలు (11+/) రావొచ్చని తెలిపింది. అన్నాడీఎంకే కూటమి 45 (11+/) స్థానాలతో మూడో స్థానంలో నిలవొచ్చంది. ఓట్ల శాతం పరంగా చూస్తే డీఎంకే కూటమికి 39 శాతం, టీవీకేకు 30 శాతం, అన్నాడీఎంకే కూటమికి 27 శాతం ఓట్లు రావొచ్చని (3 శాతం అటూఇటుగా) అంచనా వేసింది.

**పశ్చిమ బెంగాల్‌లో భాజపాకే అవకాశం!**

ఉత్కంఠగా సాగిన పశ్చిమ బెంగాల్ పోరులో భాజపాకు విజయావకాశాలు ఉన్నాయని టుడేస్ చాణక్య సర్వే సంస్థ అభిప్రాయపడింది. 294 స్థానాలకు గానూ 192 స్థానాలు (11+/) ఆ పార్టీకి రావొచ్చని అంచనా వేసింది. తృణమూల్ కాంగ్రెస్ కూటమికి 100 సీట్లు (11+/) రావొచ్చని పేర్కొంది. ఇతరులకు 02 స్థానాలు రావొచ్చని పేర్కొంది. భాజపాకు 48 శాతం ఓటింగ్ (3 శాతం +/), తృణమూల్‌కు 38 శాతం (3 శాతం +/), ఇతరులకు 14 శాతం (3 శాతం +/) ఓటింగ్ రావొచ్చని టుడేస్ చాణక్య అభిప్రాయపడింది. ఇక కేరళలో అధికార ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్య గట్టి పోటీ ఉండబోతోందని టుడేస్ చాణక్య అంచనా వేసింది. అయితే, యూడీఎఫ్‌కే ఎడ్జ్ ఉందని అభిప్రాయపడింది. 140 స్థానాలకు గానూ 69 (9+/) రావొచ్చని పేర్కొంది. అస్సాంలో 50 శాతం ఓట్లు, 102 సీట్లతో భారీ భాజపా భారీ విజయం అందుకోబోతోందని పేర్కొంది.

# త్వరలోనే శాతవాహన వర్సిటీ
## ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు

హుస్నాబాద్ గ్రామీణం: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం హుస్నాబాద్ మండలం పోతారం ఎస్, ఉమ్మాపూర్ గ్రామాల శివారులో ఈ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. భూమి కేటాయింపు పత్రాలను యూనివర్సిటీ బీసీ ఉమేష్ కుమార్‌కు అందించారు. ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, టెండర్ కూడా పూర్తయిందన్నారు. కళాశాలతోపాటు హాస్టల్ భవనాలు కూడా నిర్మిస్తారని మంత్రి చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక్కడి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఈ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. అదేవిధంగా గాంధీనగర్‌లోని పాలిటెక్నిక్ ఆవరణలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన స్థల కేటాయింపు పత్రాలను సంబంధిత అధికారులకు అందించారు. కూచనాపల్లి మాలపల్లి గ్రామాల మధ్య న్యాక్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, దానికి సంబంధించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. మంత్రి వెంట మున్సిపల్ ఛైర్మన్ దండి లక్ష్మి, ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సతీష్ కుమార్, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బంక చందు, సర్పంచులు చొప్పరి ప్రశాంత్, వెన్న స్వర్ణలత, వేల్పుల సంపత్ కుమార్ ఉన్నారు.

# చట్టబద్ధమైన దత్తతే పిల్లలకు రక్షణ: జిల్లా సంక్షేమ అధికారి శారద

**దత్తత తల్లిదండ్రులకు అవగాహన సదస్సు.. ఉత్తరువు పత్రాల అందజేత**
**'మిషన్ వాత్సల్య' సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం**

**సిద్దిపేట, ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి)**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న 'బాలల భద్రత & రక్షణ మరియు మాదకద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారోత్సవాలు' ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో "చట్టబద్ధమైన దత్తత మరియు ఫోస్టర్ కేర్" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద చేతుల మీదుగా తమిళనాడు మరియు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దంపతులకు చట్టబద్ధమైన దత్తత ప్రభుత్వ ఉత్తరువు పత్రాలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన 'వేర్ ఆర్ ఇండియా చిల్డ్రన్' సంస్థ డైరెక్టర్ మీరా మారుతి రిసోర్స్ పర్సన్‌గా హాజరై, దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించారు. అందమైన కుటుంబం ఏర్పాటుకు దత్తత ఒక చక్కని మార్గమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం దత్తతపై అవగాహన కల్పించే గోడ పత్రికలను అధికారులు విడుదల చేశారు.అక్రమ దత్తత శిక్షార్హం అధికారుల హెచ్చరిక: దత్తత తీసుకోవాలనుకునే వారు కేవలం CARA (Central Adoption Resource Authority) ద్వారా లేదా సమీపంలోని ప్రత్యేక దత్తత సంస్థను (SAA) సంప్రదించి చట్టబద్ధంగా మాత్రమే తీసుకోవాలి ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు లేదా వ్యక్తుల నుండి నేరుగా పిల్లలను తీసుకోవడం నేరం. పిల్లలను పోషించలేని స్థితిలో ఉంటే వారిని బహిరంగ ప్రదేశాల్లో వదిలివేయవద్దు. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన 'ఊయల'లో వదిలి వెళ్లవచ్చు.

వారి సంరక్షణ బాధ్యతను బాలల పరిరక్షణ విభాగం తీసుకుంటుంది. దత్తత దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులు ఓపికతో ఉండాలి. పిల్లల సంరక్షణ విషయంలో చట్టపరమైన నిబంధనలు పాటించడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, చైల్డ్ ప్రొటెక్షన్ మరియు చైల్డ్ లైన్ అధికారులు, దత్తత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**హుస్నాబాద్ గ్రామీణం:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్, పందిళ్ల, పందిళ్ల గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉమ్మాపూర్‌లో సర్పంచ్ చొప్పరి ప్రశాంత్, పందిళ్లలో వార్డు సభ్యుడు ఉప్పరపల్లి తిరుపతి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.



## చిన్నారుల అక్రమ రవాణా..
# హైదరాబాద్‌లో గుజరాత్ పోలీసుల తనిఖీలు

హైదరాబాద్: చిన్నారుల అక్రమ రవాణా కేసుకు సంబంధించి గుజరాత్ పోలీసులు హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ కేసులో మురుగన్ గ్యాంగ్‌ను ఇప్పటికే గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో గుజరాత్ పోలీసులు హైదరాబాద్‌కు వచ్చారు. మురుగన్ గ్యాంగ్‌కు ఇక్కడ ఎవరెవరు సహకరించారనే దానిపై సోదాలు నిర్వహించారు. కూకట్‌పల్లి, బంజారాహిల్స్, సికింద్రాబాద్‌లోని కొన్ని ఫెర్టిలిటీ సెంటర్‌లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. కొంత సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది.

గతేడాది ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ఇటుకల బట్టీలో మురుగన్ కార్మికుడిగా పనిచేస్తూ చిన్నారులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు విక్రయించాడు. దీంతో అరెస్టు అయ్యి మూడు నెలల తర్వాత విడుదల అయ్యాడు. గతేడాది వెలుగుచూసిన చైతన్యపురి పీఎస్‌లో నమోదైన కేసులోనూ మురుగన్ పేరు బయటకు వచ్చింది. మురుగన్ భార్య కృష్ణవేణి ఇంకో గ్యాంగ్‌ను నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు మురుగన్ గ్యాంగ్‌ను ఇప్పటికే గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది. మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలో 25 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. అతడు దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాను ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం



**కోల్‌కత, ఏప్రిల్ 30 (వుదయం) :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం ఒక వీడియోను విడుదల చేస్తూ, ఒపీనియన్ పోల్‌స్‌ను తిరస్కరించారు. మే 4న ముగిసే ఓట్ల లెక్కింపు అనంతరం తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, టిఎంసి 226 కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందని కూడా ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ఓట్ల లెక్కింపుకు ముందు విడుదల చేసిన వీడియో సందేశంలో, మేం మా మాటీ మానుష్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నాం. జై బంగ్లా! అని పేర్కొన్నారు.

ఏప్రిల్ 23, 29 తేదీలలో జరిగిన రెండు దశల పోలింగ్‌లోనూ, తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర బలగాలు, స్థానిక బలగాల నుండి ఉమ్మడి అణచివేతను ఎదుర్కొన్నప్పటికీ, ప్రధానమంత్రి, హోంమంత్రి నుండి 19 రాష్ట్రాల మంత్రుల వరకు భారత ప్రభుత్వ యంత్రాంగం మొత్తం, అలాగే ఆర్థిక బలం, దౌర్జన్యం, సాయుధ బలగాలను ఉపయోగించి బెంగాల్ ప్రజలను అణచివేయడానికి ప్రయత్నించినప్పటికీ— బెంగాల్ ప్రజలను లొంగదీసుకోవాలని చూసిన వారే స్వయంగా బ్యాలెట్ పెట్టె వద్ద ఓటమి పాలయ్యారని ఆమె తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.

బుధవారం వెలువడిన ఎగ్జిట్ పోల్ ఫలితాలు భారతీయ జనతా పార్టీ కార్యాలయం నుంచే వచ్చాయని, అందుకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఆరోపించారు. టీఎంసీ 200300 దాటవచ్చు; 2026లో మేము 226సీట్లు దాటుతాం. అదే మా నమ్మకం. నిన్న వాళ్లు గోదీ మీడియా ద్వారా ఇది చేశారు. ఈడీ, సీబీఐలను ఉపయోగించి వాళ్లు అందరినీ బెదిరిస్తారని మీకు తెలుసు. కేంద్ర బలగాలను కూడా దుర్వినియోగం చేశారు. నా అదుపులో లేని కొత్తగా నియమితులైన పోలీసు అధికారులు మహిళలు, పిల్లలపై దారుణంగా దాడి చేశారు, అని ఆమె అన్నారు. టిఎంసి కార్యకర్తలపై దాడి జరిగినప్పుడు తాను అక్కడ ఉన్నానని బెనర్జీ పేర్కొన్నారు.

# ప్రభుత్వ సలహాదారుగా హనుమంతరావు

మొదటి పేజీ తరువాయి..

అభిమానంతో రెండుసార్లు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా రెండుసార్లు ఈ ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు.

రాజీవ్ గాంధీ చనిపోయిన తర్వాత కూడా తనను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించిందని అన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్టుగా కులగణనను గ్రామగ్రామానికి తీసుకువెళతానని అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే రేవంత్ రెడ్డి ఆశయాన్ని ముందుకు తీసుకువెళతానని అన్నారు. ప్రధాని మోదీ ఓబీసీలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. తనకు పార్టీ మారే అవసరం, అలవాటులేదని, ఏ పార్టీలో ఉన్నానో ఆ పార్టీలోనే ఉంటానని అన్నారు.

# తెలంగాణ రక్షణ సేనకు ఈసీ ఆమోదం

మొదటి పేజీ తరువాయి..

టూ కవిత ప్రకటించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా, టీఆర్ఎస్ పేరును కవిత పార్టీకి ఇవ్వొద్దంటూ కొంతమంది బీఆర్ఎస్ నేతలు ఈసీకి లేఖలు రాశారు. అయినప్పటికీ కవిత పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తించింది.

## రూ.10 వేలు లంచం తీసుకుంటూ
## ఏసీబీకి చిక్కిన అటవీశాఖ అధికారి

ఇల్లందు గ్రామీణం: లంచం తీసుకుంటూ ఓ అటవీ శాఖ అధికారి ఏసీబీ వలకు చిక్కారు. ఫారెస్ట్ బీట్ అధికారి నరేశ్.. గుండాల మండలం నడిమిగూడెం పరిధిలో పోడు సాగు చేసుకుంటున్న ఓ రైతును ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ఉండేందుకు రూ.18 వేలు లంచం డిమాండ్ చేశారు. రైతు అంతమొత్తం ఇచ్చుకోలేనని రూ.10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం నరేశ్..రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతికి పాల్పడే అధికారుల సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

## రూ.200 కోట్లతో యంగ్ ఇండియా
## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన



దేవరకొండ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని విభాగాల్లో అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం కోల్ ముంతల్ పహాడ్ రైతు వేదిక వద్ద రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజం బాగుండాలంటే విద్య అవసరమని, పేదవారికి ఉచితంగా చదువు చెప్పాలనే ఉద్దేశంతోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. "దేవరకొండకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 కోట్లు ఇచ్చాం. ఎల్‌వోసీ పెట్టుకుంటే 24 గంటల్లో అప్రూవ్ చేస్తున్నాం. తొందర్లోనే ఎస్ఎల్‌బీసీ సొరంగం నిర్మాణం పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు మండలాలను సస్యశ్యామలం చేస్తాం" అని అన్నారు.




"ఏజెన్సీల ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఇంతకంటే దారుణంగా అపహాస్యం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? ఎన్నికల సంఘం ఏం చేసిందో మీరందరూ చూశారు. ఈడీ ఏం చేసిందో మీరందరూ చూశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర భద్రతా బలగాలను ఎలా రంగంలోకి దించిందో మీరందరూ చూశారు. ఇలాగేనా మీరు ఎన్నికల్లో గెలిచేది? అని భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులను నేను అడుగుతున్నాను. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే, పిఎంఎల్ ఎ కేసులో ఐపాక్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ బెయిల్ పొందారు. స్పష్టమైన కారణాల వల్ల ఈడీ ఈ బెయిల్ ను వ్యతిరేకించలేదు; లేదంటే, కేవలం 15 రోజుల్లోనే దిగువ కోర్టు నుండి బెయిల్ లభించడం అనేది అసంభవం. బిజెపి, ఆర్ ఎస్ ఎస్ మద్దతుదారులు ఆత్మపరిశీలన చేసుకోవాలి."

**- సౌరభ్ భరద్వాజ్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు**

## వే'మన' పద్యం

**చచ్చిపడిన పశువు చర్మంబు కండలు**
**పట్టిపెరకి తినును పరగ గ్రద్ద**
**గ్రద్దవంటివాడు గజపతి కాదొకో**
**విశ్వదాభిరామ వినురవేమ**



## సంపాద కీయం

# అందరి దృష్టి బెంగాల్ మీదనే!

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల ఎగ్జిట్ (పోలింగ్ ముగింపు రోజున వెల్లడయ్యే అంచనా ఫలితాలు వీడ్కోలు ఫలితాలు ) ఫలితాలు ఇంతవరకు ప్రచారంలో ఉన్న మాదిరిగానే వెలువడ్డాయి. ఇంతకు ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల విషయంలో మాదిరిగానే ఇవి కూడా కేంద్రంలోని బిజెపి కూటమి ఎన్ డి ఎ కు అనుకూలంగానే ఉన్నాయి. కేరళ తమిళనాడు లను మినహాయిస్తే మిగతా మూడింటి ఫలితాలు ఎన్ డి ఎ వైపే మొగ్గాయి. అసలు ఫలితాలు ఇలాగే వస్తే ఆశ్చర్యపోనక్కర లేదు. ఆ మేరకు ఎగ్జిట్ మచ్చు ల సేకర్తల ను మెచ్చుకోవలసిందే. ఈ సారి పోలింగ్ జరిగిన అస్సాం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలో హిందుత్వ విజయకేతనంగా మారిపోయిందనే అభిప్రాయమున్నది. అందుచేత అక్కడ అంతిమ ఫలితం కాషాయాన్నే పులుముకుంటే ఆశ్చర్యపోనవసరం లేదు. అలాంటిదే పుదుచ్చేరి. అదీ కాషాయ అంబరధారే అయితే వింత అనిపించదు . కాని ఇప్పుడు ఎన్నికలు జరిగిన మిగతా రాష్ట్రాలకు భిన్నమైన నేపథ్యం గల పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్నీ ఎగ్జిట్ లు కాషాయం ఖాతాలోనే వేసేశాయి.బెంగాల్ ను బెంగాల్ కు చెందిన పార్టీలే పరిపాలించడం సంప్రదాయంగా మారింది. పార్టీలు ఏవైనా బలమైన బెంగాలీ నాయకుల సారధ్యం ముఖ్యంగా మారింది. బిజెపి ఈ విషయంలో వెనుకబడి వుంది. డానికి అక్కడ బలమైన స్థానిక నాయకత్వం లేదు. అందుచేత మమతా బెనర్జీని ఓడించడం బిజెపి కి ఇంతవరకు సాధ్యం కాలేదు. మరి కొత్తగా యిప్పుడేమి జరిగింది? ఇప్పుడు కూడా బెంగాల్ లో బిజెపి కి బలమైన సొంత స్థానిక నాయకత్వం లేదు.ప్రధాని నరేంద్ర మోడీ ని తమ వ్యక్తిగా బెంగాలీ ఓటర్లు భావించలేరు. అయితే అన్నింటికీ తానే తన వాక్కే సమాధానంగా ప్రధాని ఈసారి ముమ్మర ప్రచారం చేశారు.గద్దించారు, గర్జించారు,, గొంతుచించుకున్నారు. మహిళల బిల్లుకు న్యాయం చేయలేకపోయానని ప్రతిపక్షం వైపు వేలెత్తి చూపుతూ వాపోయారు. తమను ఎన్నుకుంటే డబల్ ఇంజిన్ పాలనను జనరంజకంగా అందిస్తామన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ను వీలైనంత వికృతంగా ప్రజలకు చూపించారు. బహుశా అందుకే ఈ సారి బెంగాల్ లో బిజెపి అధికారానికి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ దాదాపు ఒక్క కంఠంతో ప్రకటించాయి.బిజెపి తన బెంగాల్ మేనిఫెస్టో లో మహిళలకు, నిరుద్యోగులకు, యువతకు, మత్స్య కారులకు ఆర్థిక సాయాన్ని వాగ్దానం చేసింది. ఆరు మాసాల్లో ఉమ్మడి పౌర స్మృతి ని తెస్తానని చెప్పడం వంటివి మామూలే. అయితే బెంగాల్ లో ఈసారి బిజెపి అధికారంలోకి రావడానికి మరో ముఖ్య కారణాన్ని పరిశీలకులు చూపిస్తున్నారు. 90 లక్ష ల మంది నిజమైన ఓటర్లకు ఎన్నికల కమిషన్ ఓటు హక్కులేకుండా చేసిందని బిజెపి గెలిస్తే అదే కారణం కావాలని వారు భావిస్తున్నారు. అదే నిజమైతే ఆ గెలుపు ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ దే అవుతుంది అని వారు అభిప్రాయపడుతున్నారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయకుండానే ఎన్నికల తేదీలు ప్రకటించారు. మమతా బెనర్జీ స్వయంగా సుప్రీం కోర్టుకువెళ్లి మొరపెట్టుకున్నా 'సర్' విషయం లో న్యాయం జరిగినట్టు తోచడం లేదు.నామసూద్రులు, ముస్లింల ఓట్లు చాలావరకు తొలగిపోయినట్టు తెలుస్తున్నది. వోట్లు రద్దయినవారిలో ఎక్కువమంది హిందువులే అని ప్రచారం జరుగుతున్నప్పటికీ వారిలో ఉన్నది బిజెపి వ్యతిరేకులే నన్న అభిప్రాయమూ ఉన్నది. అందుచేత బిజెపి గెలిస్తే అది అనుమానానికి అతీతం కాబోదు.అయితే ప్రజలు భారీగా పాల్గొన్నారు గనుక వారు ఎటువంటి తీర్పు ఇచ్చినా శిరోధార్యమే అవుతుంది.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మోదీకి అంతుబట్టని విలక్షణ రాజకీయ నేత కేజ్రీవాల్!

ఏడుగురు ఆప్ రాజ్యసభ సభ్యులను అకస్మాత్తుగా ఫిరాయింపుకు పాల్పడేటట్లు చేయడం ద్వారా వచ్చే ఏడాది జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో అక్కడి అధికార పార్టీని చిన్నాభిన్నం చేయడం ద్వారా ఆ రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ భారీ రాజకీయ ఎత్తుగడకు నాంది పలికింది. అయితే సాంప్రదాయ రాజకీయ నాయకులకు అంతుబట్టని విలక్షణ రాజకీయ నేత అరవింద్ కేజ్రీవాల్ ను లొంగదీసుకోవడం నరేంద్ర మోదీ, అమిత్ షాలకు అంత సులభం కాదని గ్రహించాలి.

అసాధ్యం అనుకున్న బీహార్, పశ్చిమ బెంగాల్ లలో బిజెపి బలీయమైన శక్తిగా ఎదగగలిగినప్పటికీ పంజాబ్ లో ఆ పార్టీ ఎత్తుగడలు ఫలించడం లేదు. ప్రజలలో మద్దతును పెంచుకోవడం ద్వారా, తమ పార్టీ నాయకులను ప్రజలు దగ్గర చేయడం ద్వారా బలం పెంచుకొనే ప్రయత్నాలు చేసే సహనం బిజెపి నాయకత్వానికి లేదు.

కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి ఫిరాయింపులు ప్రోత్సహించడం, ప్రత్యర్థి రాజకీయ పార్టీలను చిన్నాభిన్నం చేయడం, ఎదురు తిరిగిన నేతలను కేసులలో ఇరికించి జైళ్లకు పంపే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.

అటువంటి ప్రయత్నాలు మహారాష్ట్ర వంటి చోట్ల విజయవంతమైన ఫలితాలు ఇచ్చాయి. అయితే, కేజ్రీవాల్ విషయంలో అనుకున్న ఫలితాలు సాధింపలేక పోతున్నారు.

కేజ్రీవాల్, ఆయన సహచరులను జైలుకు పంపడం ద్వారా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించినా బిజెపి నాయకత్వంలో ఆ ఉత్సాహం కనిపించడం లేదు. కోర్టు నిర్దోషిగా ప్రకటించడమే కాకుండా వారిపై నమోదు చేసిన కేసు, దర్యాప్తు జరిపిన తీరుతెన్నులను ఎండగట్టడంతో ఆత్మరక్షణలో పడ్డారు. దానితో ఆప్ ను చిన్నాభిన్నం చేయడం ద్వారా, రాజకీయంగా ఆ పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం కావించడం ద్వారా ఎదురుదెబ్బ తీసే ప్రయత్నంకు నడుం బిగించినట్లు కనిపిస్తున్నది.

ఢిల్లీ మద్యం కేసులో జైలుకు వెళ్లకుండా తప్పించుకునేందుకు దాగుడు మూతలు ఆడుతున్న రాఘవ్ చద్దాను ఆలంబనగా చేసుకొని ఒకొక్క ఎంపీని ఒకొక్క విధంగా బెదిరించి, లొంగదీసుకుని ఆప్ రాజ్యసభ పార్టీలో చీలిక తీసుకొచ్చారు. రాజకీయ పరిశీలకులందరి దృష్టి పశ్చిమ బెంగాల్‌పై కేంద్రీకృతమై ఉన్న సమయంలో, బీజేపీ తనదైన గెరిల్లా యుద్ధ శైలికి అనుగుణంగా, పంజాబ్ లో రాబోయే ఎన్నికల కోసం తన సన్నాహాలను నిశ్శబ్దంగా పూర్తి చేసింది.

ఈ ఏడుగురిలో ఎవ్వరు కూడా తమ రాజ్యసభ సభ్యత్వాన్ని కోల్పోవడానికి సిద్ధపడకపోవడం గమనార్హం. ఆప్ రాజ్యసభ బృందంలో ఏర్పడిన ఈ చీలిక, లోక్‌సభలోని ఆ పార్టీ ఎంపీలను, పంజాబ్,ఢిల్లీలోని ఎమ్మెల్యేలను కూడా ఫిరాయించేలా ప్రోత్సహిస్తుందా? అనే ప్రశ్నపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

అయితే, వీరెవ్వరికి ప్రత్యక్ష ఎన్నికలలో పోటీచేసే ధైర్యం కూడా లేదు. వారెవ్వరూ ప్రజలలో సంబంధాలు ఉన్నవారు కూడా కాదు. కేవలం సందీప్ పాఠక్ మాత్రమే పంజాబ్ లో ఆప్ పాతుకు పోవడానికి విశేషంగా శ్రమించారు.

2022 ఎన్నికలకు ముందు అభ్యర్థుల ఎంపిక నుండి మొదలుకొని, పంజాబ్‌లో రాఘవ్ చాధా, సందీప్ పాఠక్‌లు పోషించిన లోతైన సంస్థాగత పాత్రలు, వారు ఇన్నేళ్లుగా ప్రయోగించిన ప్రభావమే ఆప్ నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఆప్ ఎమ్మెల్యేలలో దాదాపు 50 శాతం మంది తమ అభ్యర్థిత్వాన్ని ఈ ఇద్దరిలో ఒకరి వల్లే పొందారు.

వాస్తవానికి పంజాబ్ లో అధికారంలోకి వచ్చాక అరవింద్ కేజ్రీవాల్ రాఘవ్ చద్దాను ముఖ్యమంత్రిగా నియమించవచ్చని కూడా ఊహాగానాలు వచ్చాయి. అలా జరగనప్పటికీ, ఆయన పరిపాలన, విధానాలను పర్యవేక్షిస్తూ 'సూపర్ సీఎం'గా విస్తృతంగా గుర్తింపు పొందారు. బదిలీలతో సహా పలు నిర్ణయాల కోసం ఎమ్మెల్యేలు ఆయనను సంప్రదించేవారు. అయితే గతంలో రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన, విశేషమైన ప్రజాదరణ గల క్యాప్టిన్ అమరిందర్ సింగ్ వంటి వారు బీజేపీలో చేరినా తెరమరుగయ్యారు.



స్వయంగా ఎన్నికల్లో ఓటమి చెందారు. పంజాబ్ ప్రజలు బిజెపిని ఆదరించేందుకు సిద్ధంగా లేరు. అందుకనే పంజాబ్ ఆప్ శాసనసభా పార్టీలో చీలిక తీసుకురావడం అంత సులభం కాదు.

బీజేపీలో చేరితే వచ్చే ఎన్నికలలో ఆ పార్టీ తెలిపిస్తుందనే నమ్మకం ఏర్పడటం సులభం కాదు. పైగా, బిజెపి కన్నా కాంగ్రెస్ ఆప్ ప్రభుత్వంకు బలమైన పోటీ ఇస్తున్నది. ఆ తర్వాత కొంతమేరకు శిరోమణి అకాలీదళ్ కు క్షేత్రస్థాయిలో కొంత మద్దతు ఉంది. వీరందరిని పక్కకు నెట్టి మహారాష్ట్రలో మాదిరిగా అధికారంలోకి రావడం అంత సులభం కాదని బీజేపీ నాయకత్వంకు తెలియదని భావింపలేదు.

పంజాబ్ అసెంబ్లీలో బిజెపికి కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో, ఆ పార్టీకి కేవలం 6.5 శాతం ఓట్ల వాటా మాత్రమే లభించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆ పార్టీ ఓట్ల శాతం 18.5 శాతానికి పెరిగినప్పటికీ, ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోవడంలో ఆ పార్టీ విఫలమైంది. రాబోయే ఎన్నికల్లో మరోసారి స్వతంత్రంగానే పోటీ చేయాలని బీజేపీ నిర్ణయించుకుంది.

ఆప్ నుండి ఫిరాయించిన ఏడుగురు ఎంపీలలో ఆరుగురు పంజాబ్ వారే. వారితో పంజాబ్ ఆప్ శాసనసభా పక్షంలో చీలిక తీసుకు రావాలనే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. అయితే అందుకు 61 మంది అవసరం. ప్రస్తుతం చద్దా, పాఠక్‌లకు 48 మంది ఆప్ ఎమ్మెల్యేలు అందుబాటులో ఉన్నారని చెబుతున్నారు. అయితే, తిరిగి గెలుపొందే అవకాశాలు బీజేపీలో లేవంటే ఎవరైనా ఎందుకు పార్టీ మారతారో చెప్పలేము.

వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న గుజరాత్ లో కూడా ఆప్ బలం పెంచుకొనే ప్రయత్నం చేయడం బిజెపికి నిజంగా ఆందోళన కలిగిస్తున్నది.

2021లో సూరత్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 27 సీట్లు గెలుచుకుని ఆప్ అందరినీ ఆశ్చర్యపరిచింది. దక్షిణ గుజరాత్, సౌరాష్ట్ర ప్రాంతంలో దాని పెరుగుతున్న ప్రభావం బీజేపీకి ఆందోళన కలిగిస్తోంది. ఆప్ ఎంపిలను ఫిరాయింపులకు పాల్పడేటట్లు చేసిన గందరగోళం కారణంగానే గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికలలో ఆప్ చతికలపడిందని చెప్పవచ్చు. గోవాలో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ రెండు సీట్లు గెలుచుకుని, 6.77 శాతం ఓట్లను సాధించింది. దక్షిణ గోవాలోని క్రైస్తవులు అధికంగా ఉన్న తీరప్రాంతాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పాగా వేసింది.గత లోక్‌సభ ఎన్నికల్లో, అది కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతో, ప్రతిపక్ష ఇండియా కూటమి దక్షిణ గోవా పార్లమెంటరీ సీటును గెలుచుకుంది. ఎటువంటి రాజకీయ అనుభవం లేకుండా ఢిల్లీలో మురికివాడలలో ఓ ఎన్జీఓ ద్వారా కార్యక్రమాలు ప్రారంభించిన కేజ్రీవాల్ అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరి, ఆ ఉద్యమాన్ని జాతీయ స్థాయి ఉద్యమంగా తీర్చిదిద్దారు. నాటి యుపిఎ ప్రభుత్వం వణికిపోయేటట్లు చేశారు. ఒక విధంగా 2014లో నరేంద్ర మోదీ ప్రధాని కావడానికి మార్గం ఏర్పరిచారు.

ఆ వెంటనే ఆప్ అనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి, నరేంద్ర మోదీ దేశంలో తిరుగులేని నాయకుడిగా పేరొందిన సమయంలో దేశ రాజధాని ఢిల్లీలోనే బిజెపిని ఘోరంగా ఓడించి 2015లో ముఖ్యమంత్రి అయ్యారు. 70 స్థానాలలో బిజెపి 3 స్థానాలకు పరిమితం కావాల్సి వచ్చింది. ఢిల్లీ ఓ కేంద్ర పాలిత ప్రాంతం అయినా పదేళ్ళపాటు ఢిల్లీ ముఖ్యమంత్రిగా జాతీయ రాజకీయాలపై తనదైన ముద్ర వేశారు. ఆప్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా మార్చారు. శూన్యం నుండి పంజాబ్ లో అధికార పార్టీగా మార్చారు. నేడు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ఆ రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా ఉన్నారు. ముఖ్యమంత్రినే ఫిరాయింపుకు బిజెపి ప్రోత్సహిస్తోందని కథనాలు వినిపిస్తున్నాయి. అయితే కెప్టెన్ అమరిందర్ సింగ్ వంటి నేత సహితం బీజేపీలో చేరి జీరోగా మారిన అనుభవం ఉంది. ఢిల్లీ ప్రభుత్వం అంతా కేంద్ర ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందే. అయినా, కేంద్రం సహాయ నిరాకరణను ఎదిరించి విద్య, వైద్య రంగాలలో అపూర్వమైన పనితీరును ప్రదర్శించారు. తనదైన ముద్ర వేసుకున్నారు. ఎవ్వరూ ఊహించని విధంగా రాజకీయంగా అడుగులు వేయడంలో కేజ్రీవాల్ సిద్ధహస్తులుగా పేరొందారు. మద్యం కుంభకోణం కేసు హైకోర్టుకు చేరినప్పుడు హైకోర్టు న్యాయమూర్తి నిష్పాక్షికతపైననే ప్రశ్నలు లేవనెత్తారు. సాధారణంగా రాజకీయ నాయకులు ఎవ్వరూ అటువంటి సాహసం చేయలేరు. ఒకవేళ ప్రశ్నలు లేవనెత్తిన, వాటిని న్యాయమూర్తి కొట్టివేసిన సమయంలో ఆ న్యాయమూర్తి ఉన్నంతవరకు కోర్టు విచారణకు హాజరుకాబోనని ప్రకటించడం సాధారణమైన విషయం ఏమీ కాదు. అసాధారణమైన ఎత్తుగడలతో రాజకీయంగా గందరగోళం సృష్టించడం ఆయనకే చెల్లుబాటయింది. 'చొరబాటుదారులు' లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగిస్తే, పశ్చిమ బెంగాల్ వెళ్లి బెంగాలీ ప్రజలను 'ఉగ్రవాదులు'గా పరిగణిస్తున్నారని అంటూ మండిపడటం కూడా ఆయనకే చెల్లింది. ఆప్ ను, కేజ్రీవాల్ ను 'బీజేపీ బి టీం' అంటూ కాంగ్రెస్, 'కాంగ్రెస్ ఏజెంట్' అంటూ బిజెపి నేతలు విమర్శలు గుప్పిస్తున్న నిర్దుష్టమైన రాజకీయ లక్ష్యంతో అటు బిజెపి, ఇటు కాంగ్రెస్ లకు కొరకరాని కొయ్యిగా ఉంటూ వస్తున్నారు. బిజెపి వ్యతిరేక రాజకీయ పక్షాలతో మైత్రి జరుపుతున్నారు. ఆప్ బైటకు రావడంతో ఇండియా కూటమి దాదాపు నిష్క్రియంగా తయారైంది. రాహుల్ గాంధీ నాయకత్వం పట్ల మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, ఎంకే స్టాలిన్ వంటి వారంతా అసహనంగా వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజులలో బిజెపిని జాతీయ స్థాయిలో సవాల్ చేసే నూతన రాజకీయ కూటమిలో కేజ్రీవాల్ కీలకంగా మారే అవకాశం లేకపోలేదు.



చలసాని నరేంద్ర
9849569050

# నాలుగు కోడ్ ల రద్దుకై ఉద్యమిద్దాం!

ప్రతి సంవత్సరం మే 1న మే డే దినంగా తమ హక్కుల సాధన కోసం ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు ప్రదర్శనలు, సభలు జరుపుతూ కార్మిక ఐక్యతను చాటుతారు. పాలకుల, పెట్టుబడిదారుల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని శపథం చేస్తారు. సామ్రాజ్యవాదుల యుద్ధాలను వ్యతిరేకిస్తారు. 19వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభమైన పారిశ్రామిక విధానం వలన కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. నిర్ణీత పని గంటలు , ఎటువంటి హక్కులూ లేక పోవటంతో పాటు, రోజులో 14నుండి 15 గంటల నిర్బంధ పని అమలు జరిగింది. పనికి వెళ్లిన వాళ్లు ఎప్పుడు ఇంటికి తిరిగి వస్తారో తెలియదు. ఇలాంటి పరిస్థితుల వల్ల వేలాది మంది కార్మికులను ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు పారిశ్రామిక వేత్తల ధన దాహమే కారణం. దుర్భర పరిస్థితుల నుంచి బయట పడాలనే ఆలోచన కార్మికుల్లో ప్రారంభమైంది. ఆ ఆలోచనలో భాగమే 1884 అక్టోబర్ 7న అమెరికాలోని చికాగో నగరంలో నిర్వహించిన కార్మిక సదస్సు. సంఘటిత వాణిజ్య వ్యాపార సంస్థల కార్మిక సంఘాలు ఇందుకు నడుంబిగించాయి. పీడనకు వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పనికోసం ఉద్యమించాలనే అవగాహన సదస్సు లో ఏర్పడింది. ఇందుకు కార్మిక సంఘాలు సన్నహాలు ప్రారంభించాయి. సమ్మెకు సిద్ధమైనారు. 1886 మే 1 ఉదయం 10 గంటలకు అమెరికా అంతటా సమ్మె సైరన్ మోగింది. 13వేల పారిశ్రామిక సంస్థలు మూత పడ్డాయి. 3లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రారంభమైన 24గంటల తర్వాత కార్మికుల సంఖ్య 4లక్షలకు చేరింది. చికాగో నగరంలో 40వేల మంది కార్మికులు తమ కుటుంబాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. అనేక దేశాల్లో ఎర్ర జండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వాలు బెంబేలు పడ్డాయి. పారిశ్రామిక వేత్తల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. పెట్టుబడిదారుల కనుసైగలతో పోలీసుల జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు నేలకొరిగారు. కాల్పులకు వ్యతిరేకంగా 1886 మే 4న "హే" మార్కెట్ కార్మికులతో నిండిపోయింది. ఖబడ్దార్ మమ్ములను కాల్చి చంపుతారా అంటూ కార్మికుల ఆగ్రహావేశాల మధ్య సభ ప్రారంభమైంది. సభపై పోలీసులు దాడి చేయటంతో కార్మికులు తిరగబడ్డారు. చాలా మంది తలలు పగిలాయి, చేతులు, కాళ్లు తెగి పడ్డాయి. మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిచిపోయింది. ఏడుగురు పోలీసులు, ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

కార్మిక నాయకులపై కేసులు బనాయించి 7గురికి మరణశిక్ష, 8 మందికి 15సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. చికాగో కార్మికులపై పోలీసుల హింసాకాండను ఖండిస్తూ అనేక దేశాల్లో పెద్దఎత్తున ప్రదర్శనలు జరిగాయి. చికాగో నగర కార్మికుల ప్రాణ త్యాగం ఫలితంగా అమెరికాలో 8గంటల పని దినం అమలు కోసం చట్టం చేయబడింది. కార్మికులు విజయం సాధించారు. భారతదేశంలోనూ అనేక కార్మిక పోరాటాలు జరిగాయి. పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతూనే ఉన్నాయి. రాజీవ్ గాంధితో ప్రారంభమై నూతన ఆర్థిక విధాలు మన్మోహన్ సింగ్ పాలనలో తీవ్రమై ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయటంతో పరిపూర్ణత సాధించింది . ఎటువంటి మినహాయింపు లేకుండా మోడీ ప్రభుత్వం నూటికి నూరు శాతం పెట్టుబడిదారీ విధానాలను అమలు జరుపుతున్నది. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోకి విదేశీ పెట్టుబడులు చొరబడ్డాయి. పి వి నరసింహరావు, మన్మోహన్ సంగ్ పాలనలో ప్రారంభమైన ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ మోడీ పాలనలో పరాకాష్టకు చేరి మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారు. బిజెపి పార్టీ మొదటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు కలిగి ఉంది. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తానని పేర్కొంది. 2015 మోడీనే స్వయంగా ప్రకటించాడు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్, పారిశ్రామిక సంబందాలు, భద్రతఆరోగ్యం పని పరిస్థితుల అని నాలుగు కోడ్లలకు చట్టబద్ధత కల్పించి వాటిని అమలు చేస్తూ కార్మిక హక్కుల మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నది. పారిశ్రామిక సంబందాల కోడ్ కార్మిక హక్కులను కాల రాస్తుంది. ఇంతకు ముందు కార్మికుల డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వటానికి 14 రోజుల వ్యవధి సరిపోయేది. ఇప్పుడు దాన్ని 60 రోజులకు పెంచారు. సమ్మెకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్ కు వెళ్లే అవకాశం యజమానులకు కల్పించారు. గతంలో 10 కంటే ఎక్కువ మంది పని చేసే సంస్థలను పరిశ్రమల గా గుర్తించే వారు. ఇప్పుడు ఆ సంఖ్య 20 మందికి పెంచారు. విద్యుత్ సంస్థల్లో 40 మందికి పెరిగింది. ఏ సంఘానికైనా కార్మికుల డిమాండ్లపై చర్చించే అవకాశం ఇంతకు ముందు ఉంటే, ఇప్పుడు 51% సభ్యత్వం ఉన్న సంఘాన్ని గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. నాలుగు కోడ్ లు రాక ముందు పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు యజమానులే బాధ్యత ఉండేది. ఇప్పుడు కార్మికులే ప్రమాదాలకు బాధ్యత వహించాలి.



ప్రమాదాలకు కారణమని కార్మికునికి 10వేల జరిమానా, జైలు శిక్ష విధించ వచ్చు. ఎనిమిది గంటల పనికి స్వస్తి చెప్పి . యజమానులు కోరితే 10నుంచి 12 గంటలు పని చేయాలి. ప్రభుత్వ ఆధ్వర్యం లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లో రోజుకి 12 గంటలు, నెలకి 28 రోజుల పనిని అమలు చేస్తూ 8 గంటల శ్రమకు మాత్రమే కూలి ఇస్తున్నారు. మిగతా శ్రమను పారిశ్రామిక వేత్తలు దోచుకుంటున్నారు. దీనికి వ్యతిరేకం హర్యానా లోని పానిపట్ లో ఫిబ్రవరి 14న వేలాది మంది కార్మికులు తిరగబడ్డారు. ఈ విధంగా నాలుగు కోడ్ పేరుతో కార్మిక హక్కులు హరించి వారిని వెట్టి చాకిరి బానిసలుగా మోడీ ప్రభుత్వం మారుస్తున్నది. ఈ కోడ్ ల రద్దు కోసం కార్మిక వర్గం వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాల రాయడమే కాకుండా ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకర చేయడం, లేదా మూసివేయడం వల్ల లక్షలాది మంది కార్మికులు నిరుద్యోగులుగా మారుతున్నారు. వవారి కుటుంబాలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ పరం చేసే విధానాలు అమలు జరుపుతున్నది. ఆంధ్రప్రదేశ్ లో కూడా చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం పని గంటలను 12 గంటలకు పెంచి కార్మికులపై పని భారం మోపి పరిశ్రమాధిపతులకు ప్రయోజనం చేకూర్చింది. పోర్టులను, ఓడరేవులను, విమానాశ్రయాలను, మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసే బాటలో పయనిస్తున్నది. పంచదార మిల్లులు, జిన్నింగ్ మిల్లులు అనేకం మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయారు. నష్టాల పేరుతో ఈ మిల్లులను అమ్మేందుకు సిద్ధంగా ఉంది. కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరుపుతున్న మోడీ ప్రభుత్వం, అమెరికా సామ్రాజ్యవాదుల యుద్ధోన్మాద దురాక్రమణ విధానాలకు వత్తాసు పలుకుతున్నది. స్వతంత్ర సార్వభౌమాధికార కలిగిన వెనిజులా దేశంపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు మదురో ను, ఆయన భార్యను అరెస్టు చేసి అమెరికా తరలించి జైల్లో ట్రంప్ నిర్బంధించారు. పశ్చిమాసియా లో తన ఆధిపత్యాన్ని అంగీకరించని ఇరాన్ పై తన పెంపుడు బిడ్డ ఇజ్రాయిల్ తో కలిసి అమెరికా దాడి చేసింది. ఖమేనీతో సహా 40 మంది కీలక నేతలను హత్య చేసింది. అమెరికా దాడులను ఇరాన్ సమర్ధవంతంగా ఎదుర్కొంది. ఈ యుద్ధంలో అనేక నష్టాలను పొందింది. ప్రపంచ దేశాలన్నీ ఈ దాడిని ఖండించినా, భారతదేశం ఖండించలేదు. మోడీకి ట్రంప్ ని ఎదిరించే ధైర్యం లేక పోవడమే అందుకు కారణం. అమెరికా మద్దతుతో పాలస్తీనా పైనా, ముఖ్యంగా గాజా పైన సాగిస్తున్న మారణకాండును, ఆ ప్రాంతంలో పసిపిల్లలతో సహా 70 వేల మందిని చంపిన ఇజ్రాయిల్ దాడులను ఖండించకపోగా, ఇజ్రాయిల్ లో మోడి పర్యటించి నెతన్యాహు కౌగిలించుకుని తనకు ప్రియమైన మిత్రుడని పేర్కొన్నాడు. ట్రంప్ టారిఫ్ బెదిరింపులకు భయపడి రష్యా నుంచి చౌకగా లభించే ఆయిల్ దిగుమతిని మానుకున్నాడు. ఇరాన్ పై అమెరికా యుద్ధం వల్ల మన దేశంలో ధరలు పెరిగి ప్రజలకు భారం పడుతుంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి సిద్ధపడటం ద్వారా రైతుల ప్రయోజనాల దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. కార్మిక చట్టాలను హరించే నాలుగు కోడ్ లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టినా వాటిని లెక్క చేయకుండా అమలు చేస్తున్నది. అందుకు కారణం కార్మిక వర్గం రాజకీయ హక్కులను పక్కన పెట్టి ఆర్థిక పోరాటాలకు పరిమితం కావడం, వివిధ సంఘాలగా కార్మికులు విభజనకు గురికావడం, కార్మిక వర్గ చైతన్యాన్ని విస్మరించి కుల సంఘాలగా ఏర్పడటం, కార్మిక సంఘాల నాయకులు దీర్ఘకాలిక పోరాటాలకు కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయకపోవడం. దీన్ని తనకు అనుకూలంగా మోడీ ప్రభుత్వ మార్చుకుని, బడా పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల కోసం కార్మిక హక్కులను హరిస్తున్నది. గత కార్మిక వర్గ ఉద్యమాలను అవగహన చేసుకుని, వర్గ దృక్పదంతో, ఆర్థిక , రాజకీయ హక్కుల కోసం దీర్ఘకాలిక మిలిటెంట్ పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలి. అప్పుడు మాత్రమే మోడీ ప్రభుత్వ వెనక్కి తగ్గుతుంది. అందుకు మే1 ,2026 సంవత్సరం నాంది. పలకాలి.



బొల్లిముంత సాంబశివరావు
9885983526

# కార్మికుల హక్కుల సంరక్షణే దేశానికి రక్షణ

01 మే 1886 నాడు అమెరికా చికాగో నగరం నడిబొడ్డున "హేమార్కెట్ స్క్వైర్ ప్రాంతం" లో రోజుకు 8గంటల పని దినాలు మాత్రమే ఉండాలని కార్మికులు చేసిన నిరసనలు హింసాత్మకంగా మారడమే కాకుండా ఏడుగురు పోలీసులు, నలుగురు పౌరులు ప్రాణాలు సహితం కోల్పోవడం జరిగింది. ఈ నిరసన తర్వాత తాము కోరిన రోజుకు 8 గంటల పని విధానం అమలులోకి రావడంతో అలనాటి కార్మికుల నిరసనకు గుర్తుగా ప్రతి ఏట 01 మే రోజున "అంతర్జాతీయ కార్మిక దినోత్సవం" లేదా "కార్మిక దినోత్సవం" లేదా "మే డే" రూపంలో జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. దాదాపు 80 దేశాల్లో కార్మికుల దినోత్సవం రోజున సెలవు దినంగా ప్రకటించడం, ఆ రోజున శ్రామిక వర్గాలు ర్యాలీలు, సెమినార్లు, కవాతులు లాంటి పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది. కార్మిక హక్కుల హననం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం, వారి ఆరోగ్య భద్రతే దేశ అభివృద్ధికి దోహదపడుతుందని తెలుసుకోవడం మన కనీస బాధ్యత అవుతుంది.

**కార్మికుల హక్కుల పరిరక్షణే అసలైన దేశాభివృద్ధి**

శ్రామికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి దారపోస్తూ దేశాభివృద్ధికి గొడుగులు పడుతున్నారు. శ్రామికుల ప్రాధాన్యాన్ని వివరించడం, దేశ సమగ్రాభివృద్ధిలో వారి పాత్రను గుర్తించడం, ఉత్తమ సేవలు అందించిన కార్మికులకు అభినందనలు తెలుపడం, కార్మిక ఉద్యమాలను గుర్తు చేసుకోవడం, కార్మికులకు తగు గౌరవం ఇవ్వడం, వారి కుటుంబాలకు అండగా నిలువడం, అన్ని వర్గాల శ్రామికులను ఒకే విధంగా చూసుకోవడం లాంటివి 01 మే రోజున చేయదగిన కనీస కార్యక్రమాలుగా ఉండాలి. 01 మే 1889 నుంచి కార్మిక దినోత్సవాలు పవిత్రంగా పాటించడం జరుగుతోంది. 2026 అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం ఇతివృత్తంగా "పని ప్రదేశంలో ఆరోగ్యకరమైన మానసికసామాజిక వాతావరణం నిర్మించడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

భారత్‌లో కార్మిక దినోత్సవం:కామ్రేడ్ సింగవేలు చెట్టియార్ చొరవతో 1923 నుంచి భారత్‌లో మే డే వేడుకలు జరుగుతున్నాయి. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య సంరక్షణకు ఊతన ఇవ్వగల వాతావరణం కల్పించడం యాజమాన్యాల కనీస బాధ్యత అంటూ కార్మిక చట్టాలు కూడా చేయడం జరిగినప్పటికీ అమలు ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. కార్మికుల హక్కుల పరిరక్షణలో భాగంగా వారి గౌరవం, సమానత్వం, ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, పని ప్రదేశంలో వివక్షరహిత వాతావరణ కల్పన, అందరి భద్రతకు పెద్దపీట వేయడం జరుగుతుంది. భారత శ్రామిక వర్గంలో దాదాపు 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండగా వారికి కనీస హక్కులు కల్పించడంలో విఫలం కావడం కొంత కలవరానికి దారి తీస్తున్నది. భారత రాజ్యాంగం ప్రకారం ఆర్టికిల్స్ 23 & 24, 39, 41 & 42 కార్మికుల హక్కుల పరిరక్షణకు చట్టబద్దత ఇవ్వడం జరిగింది. కార్మిక చట్టాల సంస్కరణతో 29 చట్టాలు చేయగా అందులో నాలుగు రకాల కోడ్‌లు కార్మికుల వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం పని ప్రదేశ పరిస్థితులుగా విభజించారు. ఈ నాలుగు కోడ్‌ల ద్వారా వేతనాల సవరణలు, పని గంటల నిర్ణయాలు, పారిశ్రామిక విధానాలు, పిఎఫ్/ఈఎస్ఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేదిక ఒక చారిత్రక వేడుక మాత్రమే కాకుండా అది ఒక సమకాలీన సందర్భంగా కూడా గుర్తించడం జరుగుతోంది. నేడు డిజిటల్ వేదికలు అందుబాటులోకి రావడంతో ఆర్థిక గమనం వేగం పుంజుకోవడం, కార్మికుల హక్కులను కాపాడుకుంటూ సాంకేతికతకు అనుగుణంగా శ్రమజీవి కూడా తన మార్గాన్ని సవరింతుకుంటూ ముందడు వేస్తేనే దేశం బహుముఖంగా ఎదుగుతుందని నమ్మాలి.



మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



### ఐపాక్ డైరెక్టర్ వినేష్ చందేల్‌కు బెయిలు

## వ్యతిరేకించని ఈడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఉదయం) :**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన ఒక రోజు తర్వాత, ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు గురువారం ఐప్యాక్ డైరెక్టర్ వినేష్ చందేల్‌కు సాధారణ బెయిల్ మంజూరు చేసింది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ లేదా ఐప్యాక్ అధినేతలలో ఒకరైన చందేల్‌ను ఏప్రిల్ 13న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. ఐప్యాక్ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి రాజకీయ సలహాదారుగా ఉంది. కాగా, చందేల్‌కు బెయిల్ మంజూరు చేయాలన్న కోర్టు ఉత్తర్వును ఈడీ వ్యతిరేకించకపోవడం గమనార్హం.

**బెయిల్ ఉత్తర్వును వ్యతిరేకించకూడదని ఈడీ నిర్ణయం**

కోర్టు అదనపు సెషన్స్ జడ్జి (ఏఎస్‌జే) అమిత్ బన్సల్ ఈ ఉత్తర్వును జారీ చేస్తూ, బెయిల్‌ను వ్యతిరేకించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, ఆయన ఆ పని చేయలేదు, అని పేర్కొన్నారు. పీఏసీ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులలో ఒకరిగా, 33శాతం వాటాదారుగా ఉన్నాడనే ఆరోపణలపై ఈడీ చందేల్‌ను అరెస్టు చేసింది. ఢిల్లీ పోలీసుల ఎఫ్‌ఐఆర్ ఆధారంగా, మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద నమోదైన మనీలాండరింగ్ కేసులో ఈడీ అతనిపై దర్యాప్తు చేస్తోంది. ఏప్రిల్ 23న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం కావడానికి ముందు, కోల్‌కతాలోని సాల్ట్ లేక్‌లో ఉన్న ఐప్యాక్ కార్యాలయంపై ఈడీ దాడి చేసింది. ఐప్యాక్ మరో చీఫ్ అయిన ప్రతీక్ జైన్ ఇంటిలో కూడా వారు సోదా చేశారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడికి చేరుకుని, ఒక గ్రీన్ ఫైల్‌తో బయటకు వచ్చేశారు. లెక్కల్లో లేని నిధులు స్వీకరించడం, చట్టబద్ధమైన వ్యాపార సాయం లేని అసురక్షిత రుణాలు తీసుకోవడం, మూడవ పక్షాల ద్వారా నిధులను మళ్లించడం వంటి ఐప్యాక్ ఆర్థిక అవకతవకలకు సంబంధించిన అనేక ఉదంతాలను తాము వెలికితీసినట్లు ఈడీ పేర్కొంది. ఐప్యాక్ సుమారు రూ. 50 కోట్ల ఆదాయాన్ని మనీలాండరింగ్ చేసిందని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఇలా ఉండగా, బెంగాల్ ఎన్నికల అనంతరం వెలువడిన చాలా వరకు ఎగ్జిట్ పోల్ అంచనాలు, హోరాహోరీగా సాగిన ఈ పోరులో బీజేపీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పాయి. పి మార్క్ అంచనాల ప్రకారం, బీజేపీ 150 నుండి 175 స్థానాలను గెలుచుకునే అవకాశం ఉండగా, టిఎంసి సుమారు 118 నుండి 138 స్థానాలను దక్కించుకోవచ్చు. మరోవైపు, పీపుల్స్ పల్స్ అంచనాల ప్రకారం, టిఎంసి 177 నుండి 187 స్థానాలతో తిరిగి అధికారంలోకి రానుండగా, బీజేపీ 95 నుండి 110 స్థానాలను పొందవచ్చని పేర్కొంది.

### కర్నాటక సీఎం మార్పు

## ప్రస్తుతానికి లేదు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఉదయం) :**



కర్నాటకలో ప్రస్తుతానికి ముఖ్యమంత్రి మార్పు ఉండదని, నాయకత్వ పోరు వీలైనంత త్వరగా పరిష్కారమవుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు కర్నాటకలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల ఫలితాలు మే 4న వెలువడిన తర్వాత, నాయకత్వ మార్పు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించినప్పుడు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కుదిరినట్లుగా ప్రచారంలో ఉన్న అధికార భాగస్వామ్య ఒప్పందానికి అనుగుణంగా, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు ఉన్నత పదవి కల్పించాలని ఆయన మద్దతుదారులు పట్టుబడుతున్నారు.

మీరు (మీడియా), ఆయన (పరమేశ్వర), అలాగే అగ్ర నాయకత్వంలోని వారు, నేను (ముఖ్యమంత్రి) అయితేనే బాగుంటుందని అంటున్నారు. కానీ, విధి నిర్ణయం కంటే కూడా, నా సిద్ధాంతాలకు అనుగుణంగానూ, ఇప్పటివరకు నేను పార్టీకి చేసిన సేవను పరిగణనలోకి తీసుకుంటూనూ, నాకు సంబంధించిన నిర్ణయాలను సోనియా గాంధీయే తీసుకుంటారు" అని ఖర్గే ముఖ్యమంత్రి కావాలంటూ హోం మంత్రి జి. పరమేశ్వర చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన అన్నారు.

అయితే, ఇప్పుడు ఆ ప్రశ్న తలెత్తదు. ఇక్కడ ఇప్పటికే ఒక ముఖ్యమంత్రి ఉన్నారు. ఒకవేళ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, నేను కలిసి, ఏదైనా మార్పు దిశగా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, దానికి కొంత సమయం పడుతుంది. వేచి చూద్దాం అని ఖర్గే విలేకరులతో అన్నారు.

కర్నాటకలో నాయకత్వ మార్పుపై ఊహాగానాల నడుమ, ఎంతో అనుభవం కలిగిన సీనియర్ రాజకీయ నాయకుడు ఖర్గే ముఖ్యమంత్రి అయితే, అధికార కాంగ్రెస్ పార్టీలోని ప్రతి ఒక్కరూ దానిని స్వాగతిస్తారని పరమేశ్వర బుధవారం పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో సగం కాలాన్ని నవంబర్ 20, 2025 నాటికి పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి మార్పు ఉండవచ్చనే ఊహాగానాల నడుమ అధికార పార్టీలో నాయకత్వ పోరు తీవ్రమైంది. 2023లో ప్రభుత్వం ఏర్పాటు సమయంలో సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య కుదిరినట్లుగా చెప్పిన అధికార పంపిణీ ఒప్పందమే ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది.

కాంగ్రెస్‌లో నాయకత్వ పోరు కొనసాగుతున్న వేళ, వచ్చే నెలలో సుమారు 40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నారని జేడీ(ఎస్) నేత, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ, నాకు తెలియదు, వివరాలు ఆయన్నే అడగండి, అని అన్నారు.

## ఖేరా ముందస్తు బెయిల్ పై తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఉదయం):**



ముందస్తు బెయిల్ కోరుతూ కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా దాఖలు చేసిన పిటిషన్‌పై భారత సుప్రీం కోర్టు గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. కాగా, బహుళ పాస్‌పోర్ట్‌లకు సంబంధించి ఖేరా చేసిన ఆరోపణలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సతీమణి రినికి భూయాన్ శర్మ, ఆయనపై పరువు నష్టం దావా దాఖలు చేయడం గమనార్హం.

ఖేరా ఒక పత్రికా సమావేశంలో, హిమంత భార్య వద్ద పలు దేశాలకు చెందిన పాస్‌పోర్ట్‌లు ఉన్నాయని ఆరోపిస్తూ, నకిలీ పాస్‌పోర్ట్‌ల చిత్రాలను ప్రదర్శించారు. అయితే, ఆ పత్రాలు నకిలీవి, ఫోర్జరీ చేసినవి అని, ఏ అధికార సంస్థ కూడా అటువంటి పాస్‌పోర్ట్‌లను జారీ చేయలేదని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అరెస్టు భయంతో ఖేరా మొదట తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అతనికి వారం రోజుల ట్రాన్సిట్ ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ ఏప్రిల్ 15న సుప్రీంకోర్టు ఆ ఉపశమనంపై స్టే విధించి, గౌహతి హైకోర్టును ఆశ్రయించమని అతనికి సూచించింది. అయితే, పత్రాలు ఎక్కడి నుంచి వచ్చాయో గుర్తించడానికి కస్టడీ విచారణ అవసరమని పేర్కొంటూ గౌహతి హైకోర్టు అతని ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

సుప్రీంలో ఖేరా తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదన తిరస్కరణను సవాలు చేస్తూ ఖేరా సుప్రీంకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ అతుల్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఆయన పిటిషన్‌ను విచారించింది. కోర్టులో ఖేరా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ, ఈ కేసు గతంలో ఎన్నడూ జరుగనటువంటిదని పేర్కొన్నారు. అరెస్టు అవుతామనే భయం ఖేరాకు ఉండటానికి కారణాలు ఉన్నాయని, ముఖ్యంగా అస్సాం ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల కారణంగా ఆ భయం మరింత ఎక్కువయిందని, వాటిలో కొన్ని వ్యాఖ్యలు తిరిగి ఉచ్చరించలేనివని ఆయన అభివర్ణించారు. ఒక ముఖ్యమంత్రి రాజ్యాంగ కౌబాయ్ లేదా రాజ్యాంగ రాంబోలాగా మాట్లాడటం చూస్తే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమాధిలో కూడా కలత చెందుతారని ఆయన అన్నారు.

ఈ కేసులో అరెస్టు లేదా కస్టడీ విచారణ అవసరం లేదని సింఘ్వీ వాదించారు. ఖేరా విచారణకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కస్టడీ విచారణ ద్వారా ఖేరాను అవమానించాలనుకోవడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అస్సాం ప్రభుత్వం తరపున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఈ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ, పత్రికా సమావేశంలో ఖేరా చేసింది పరువు నష్టం కంటే ఎక్కువ అని వాదించారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుండి ఖేరా పరారీలో ఉన్నారని, పత్రాలను ఎవరు ఫోర్జరీ చేశారనేది నిర్ధారించడానికి కస్టడీ విచారణ అవసరమని ఆయన అన్నారు.

## అగ్ని-6 కి డిఆర్‌డిఓ సిద్ధం

### కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూపులు

**ఉదయం డెస్క్, ఏప్రిల్ 30 :**



అగ్నిVI బాలిస్టిక్ క్షిపణి అభివృద్ధికి సంబంధించి, నిర్ణయం ప్రభుత్వంపై ఆధారపడి ఉందని డిఆర్‌డిఓ ఛైర్మన్ సమీర్ వి. కామత్ గురువారం తెలిపారు; అనుమతి లభించిన వెంటనే ముందుకు సాగడానికి తమ సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఏఎన్ఐ జాతీయ భద్రతా సదస్సు 2.0లో మాట్లాడుతూ, ఇది ప్రభుత్వ నిర్ణయం. ప్రభుత్వం మాకు అనుమతి ఇచ్చిన వెంటనే, మేం సిద్ధంగా ఉంటాం, అని కామత్ అన్నారు.

భారతదేశపు 'అగ్ని' శ్రేణిలోని ప్రస్తుత వ్యవస్థలతో పోలిస్తే, అగ్నిVI మరింత సుదూర పరిధిని, మెరుగైన సామర్థ్యాలను కలిగిన ఒక అధునాతన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిగా ఉంటుందని భావిస్తున్నారు. భారతదేశం హైపర్‌సోనిక్ గ్లైడ్, హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థలు రెండింటిపై పనిచేస్తోందని, ప్రస్తుతం అభివృద్ధి పరంగా గ్లైడ్ వేరియంట్ ముందంజలో ఉందని కామత్ అన్నారు. హైపర్‌సోనిక్ విషయానికొస్తే, మేము హైపర్‌సోనిక్ గ్లైడ్ క్షిపణి, హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి అనే రెండు కార్యక్రమాలపై పనిచేస్తున్నాం, అని ఆయన చెప్పారు. ఆ రెండు వ్యవస్థల మధ్య తేడాను వివరిస్తూ, హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణికి స్క్రామ్‌జెట్ ఇంజిన్ ఉంటుంది. అది ప్రయాణ సమయంలో శక్తిని పొందుతుంది. హైపర్‌సోనిక్ గ్లైడ్ క్షిపణి... ప్రారంభ వేగాన్ని ఇవ్వడానికి ఒక బూస్టర్‌ను ఉపయోగిస్తుంది, ఆ తర్వాత అది ఎలాంటి శక్తి సహాయం లేకుండా గ్లైడ్ చేస్తుంది అని ఆయన అన్నారు. గ్లైడ్ క్షిపణిని త్వరలో పరీక్షించవచ్చని కామత్ సూచించారు.

గ్లైడ్ క్షిపణి ముందుగా అందుబాటులోకి వస్తుందని, తాము త్వరలోనే దీనికి సంబంధించిన తొలి పరీక్షలను నిర్వహించనున్నామని, క్రూయిజ్ క్షిపణి కంటే ఇది మరింత ముందస్తు దశలో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత సంప్రదాయ క్షిపణి దళం స్వరూపాన్ని కూడా ఆయన వివరించారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ఇంకా పరిశీలనలో ఉంది.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ దళానికి వివిధ శ్రేణులు, వ్యూహాత్మక పాత్రలకు అనుగుణంగా ఉండే విభిన్న వ్యవస్థల సమ్మేళనం అవసరమవుతుంది.

కాబట్టి, సంప్రదాయ క్షిపణి దళానికి సంబంధించి, రక్షణ కార్యదర్శి పేర్కొన్నట్లుగా, దాని నిర్మాణం ఇంకా రూపుదిద్దుకోలేదు. అయితే, ఒక సంప్రదాయ క్షిపణి దళంలో స్వల్ప శ్రేణి, మధ్యమ శ్రేణి, బహుశా 2000 కిలోమీటర్ల వరకు గల శ్రేణుల కోసం ఉద్దేశించిన బాలిస్టిక్ క్షిపణులు అవసరమవుతాయని నేను భావిస్తున్నాను అని ఆయన అన్నారు.

కనుక, బాలిస్టిక్ క్షిపణులలో ఈ మూడు రకాలు అవసరం, అలాగే క్రూయిజ్ క్షిపణులు, హైపర్ సోనిక్ క్షిపణులు వంటి మూడు రకాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. ఇది వివిధ రకాల క్షిపణులను కలిగి ఉంటుంది. ఇవి వ్యూహాత్మక వినియోగం కోసం, వేర్వేరు దూరాల నుండి దెబ్బతీసే సామర్థ్యాన్ని కల్పిస్తాయి, అని ఆయన వివరించారు.

ప్రస్తుత సన్నద్ధతపై మాట్లాడుతూ, స్వల్ప శ్రేణి వ్యవస్థలు ప్రవేశానికి దగ్గరలో ఉన్నాయని చెప్పారు. స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణుల విషయానికి వస్తే, ప్రస్తుతం తుది పరీక్షల దశలో ఉన్న ప్రళయ్ సిద్ధంగా ఉండాలి, అని ఆయన అన్నారు. ఇప్పటికే ఉన్న కొన్ని వ్యవస్థలను అనుకూలంగా మార్చుకోవచ్చని ఆయన తెలిపారు.

అంతేకాక, మన వద్ద కొన్ని వ్యూహాత్మక క్షిపణులు ఉన్నాయి, వాటిని మధ్యశ్రేణి, ఉన్నతశ్రేణుల కోసం వ్యూహాత్మక వినియోగానికి మార్చవచ్చు, అని ఆయన అన్నారు. అంతకుముందు, ఏఎన్ఐ జాతీయ భద్రతా సదస్సు సందర్భంగా, రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, స్వల్ప, మధ్య, దీర్ఘశ్రేణులను కలిగి ఉండే బహుళఅంచెల సాంప్రదాయ క్షిపణి దళాన్ని అభివృద్ధి చేయడానికి భారతదేశం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## అమెరికాకు గుండెపోటు తెప్పిస్తాం ఇరాన్

**ఉదయం డెస్క్, ఏప్రిల్ 30 :**



కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో తాము త్వరలోనే ఒక కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తామంటూ ఇరాన్ హెచ్చరించింది. ఆ ఆయుధం మామూలుది కాదని, అది శత్రువులకు గుండెపోటు తెప్పించగలదని ఆ దేశం పేర్కొంది.

అమెరికా నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే బదులుగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరుస్తామన్న తెహ్రాన్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించిన తర్వాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ ప్రణాళిక ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలను కూడా ఆలస్యం చేసేది. దానికి బదులుగా, వాషింగ్టన్ ఈ కీలక జలమార్గం సమీపంలో తన దిగ్బంధనాన్ని కొనసాగించాలని నిర్ణయించుకుంది.

**ఉద్రిక్తతను పెంచుతామని ఇరాన్ సంకేతాలు, కొత్త ఆయుధం గురించి హెచ్చరిక**

ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రెస్ టీవీ ప్రకారం, ఇరాన్ నావికాదళ కమాండర్ రియర్ అడ్మిరల్ షహ్రామ్ ఇరానీ, తమ దేశం అతి త్వరలో ప్రత్యర్థి బలగాలను వారు భయపడే ఆయుధంతో ఎదుర్కొంటుందని అన్నారు. "అది సరిగ్గా వారి పక్కనే ఉంది. వారికి గుండెపోటు రాదని ఆశిస్తున్నాను, అని ఆయన ఇతర వివరాలు ఇవ్వకుండా అన్నారు.

తెహ్రాన్‌ను చర్చలకు బలవంతం చేయడానికి, ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి ద్వారా ఇరాన్ చమురు వాణిజ్యాన్ని పరిమితం చేయడం ద్వారా ఆర్థిక ఒత్తిడిని ఉపయోగించాలనే అమెరికా వ్యూహాన్ని కూడా ఇరానీ తోసిపుచ్చారు. అటువంటి అంచనాలు ఇప్పుడు సైనిక అకాడమీలలో ఒక జోక్‌గా మారాయని ఆయన అన్నారు.

**తీవ్రమవుతున్న దాడుల ఆరోపణలు, హోర్ముజ్‌పై ఉద్రిక్తతలు**

అమెరికా విమాన వాహక నౌక అబ్రహం లింకన్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దళాలు కనీసం ఏడు క్షిపణి దాడులు చేశాయని, ఈ దాడుల వల్ల ఆ నౌక నుంచి అమెరికా వైమానిక కార్యకలాపాలకు తాత్కాలికంగా అంతరాయం కలిగిందని కమాండర్ పేర్కొన్నారు. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి మధ్యప్రాచ్యం అంతటా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై 100కు పైగా ప్రతీకార దాడులు జరిపినట్లు ఇరాన్ ప్రకటించింది. తెహ్రాన్ ప్రతిస్పందనలో ఒక కీలక అంశం హోర్ముజ్ జలసంధిలో దాని చర్యలు. ఇది శాంతికాలంలో ప్రపంచ ముడి చమురు రవాణాలో సుమారు 20శాతం నిర్వహించే ఒక వ్యూహాత్మక మార్గం. ఇరాన్ తన శత్రువులకు సంబంధించిన నౌకల రాకపోకలను పరిమితం చేసింది. జలసంధి గుండా ప్రయాణించడానికి తన అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది.

అరేబియా సముద్రం నుంచి జలసంధికి ప్రవేశాన్ని ఇరాన్ సమర్థవంతంగా మూసివేసిందని, ఒకవేళ ప్రత్యర్థి దళాలు మరింత సమీపానికి వస్తే తక్షణమే కార్యాచరణ చర్యలు తీసుకుంటామని ఇరానీ హెచ్చరించారు. దిగ్బంధనం ఉన్నప్పటికీ, కొన్ని నౌకలు ఇరాన్ ఓడరేవుల నుంచి బయలుదేరి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ నౌకలను అమెరికా దళాలు చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకున్నాయని ఆయన ఆరోపించారు, ఈ చర్యలను సముద్రపు దొంగతనం, బందీలుగా పట్టుకోవడంగా అభివర్ణించారు. వారు నౌకలలోని సిబ్బందిని, వారి కుటుంబాలను బందీలుగా పట్టుకున్నారు, అని ఆయన పేర్కొంటూ, ఇటువంటి చర్యలు సోమాలియా సముద్రపు దొంగల చర్యల కంటే దారుణమైనవని అన్నారు.

## మా జలాలలోకి విదేశీయులను అనుమతించం

**ఉదయం డెస్క్, ఏప్రిల్ 30 :**



ఒకవైపు కాల్పుల విరమణ కొనసాగిస్తూనే, మాటలతో తూటాలు వదులుతూ అమెరికా, ఇరాన్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నాయి. జలసంధి ఇక్కట్ల కారణంగా చమురు రవాణాకు అంతరాయాలు ఏర్పడి, ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతున్న తరుణంలో ఈ ఘర్షణకు శాశ్వత ముగింపు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న దేశాలకూ ఇరు దేశాల అధ్యక్షులూ షాక్ ఇస్తున్నారు. పర్షియన్ గల్ఫ్, హొర్మూజ్ జలసంధి కి కొత్త అధ్యాయం ఆవిష్కృతమవుతోంది అంటూ ఇరాన్ సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీ తాజాగా ఎక్స్ పై పోస్టు పెట్టారు. అయితే, తెహ్రాన్‌తో అణుఒప్పందం కుదిరేవరకు హొర్మూజ్‌లో తమ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్తున్నారు. కాగా, అణు, క్షిపణి సామర్థ్యాలను జాతీయ సంపదగా కాపాడుకుంటామని తాజా ప్రకటనలో మొజ్తాబా తేల్చిచెప్పారు. భగవంతుడి దయవల్ల పర్షియన్ గల్ఫ్ ఉజ్వల భవిష్యత్తులో అమెరికా ఉండదు. హొర్మూజ్ కోసం కొత్త నిబంధనలు తీసుకువస్తాం. అవి గల్ఫ్ దేశాలకు ఆర్థిక లబ్ధి చేకూర్చడంతో పాటు ప్రశాంతత, పురోగతిని తీసుకుస్తాయి. దురాశతో మా జలాల వద్దకు వచ్చే విదేశీయులకు (అమెరికా, ఇజ్రాయెల్) సముద్రం అడుగన మినహా ఇంకెక్కడా స్థానం ఉండదు అని సుప్రీం నాయకుడు తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందేశాన్ని టీవీలో బిగ్గరగా చదివి వినిపించడం గమనార్హం. 'ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా స్థావరాలనే కాపాడుకోలేకపోతున్నారు. అలాంటప్పుడు తమపై ఆధారపడిన దేశాల భద్రతకు ఎలాంటి హామీ ఇవ్వగలవు అని ఖమేనీ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను అమెరికా బలగాలు అడ్డుకుంటోన్న సంగతి తెలిసిందే. హొర్మూజ్‌లో తమ దిగ్బంధనాన్ని దాటుకొని వెళ్లాలని ప్రయత్నించిన 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సైన్యం వెల్లడించింది. ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి హబ్ అయిన ఖర్గ్ ద్వీపాన్నిచమురుతో ముంచేసి, ఒప్పందం చేసుకునేలా ఒత్తిడి తేవాలన్న ఎత్తుగడతోనే అగ్రరాజ్యం ఈ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇప్పుడు తెహ్రాన్ ఉత్పత్తి చేస్తోన్న చమురును ఖర్గ్‌లో నిల్వ చేసే సామర్థ్యం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఎగుమతులు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇలాంటి సమయంలో కొత్త ఆయుధంతో అమెరికాకు హార్ట్ ఎటాక్ తెస్తామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది.






### విపత్తులపై తక్షణ హెచ్చరికలకు

## స్వదేశీ సెల్ బ్రాడ్‌కాస్ట్ వ్యవస్థ పరీక్షలు

**ఉదయం డెస్క్, ఏప్రిల్ 30 :**



పౌరులకు కీలక సమాచారం సకాలంలో అందేలా చూసేందుకు దేశవ్యాప్తంగా మొబైల్ ఆధారిత విపత్తు సమాచార వ్యవస్థలను భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని టెలీకమ్యూనికేషన్ల విభాగం (డాట్) జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ)తో కలిసి చురుగ్గా బలోపేతం చేస్తోంది.

టెలీకమ్యూనికేషన్ల విభాగానికి చెందిన ప్రధాన పరిశోధన అభివృద్ధి కేంద్రం టెలిమాటిక్స్ అభివృద్ధి కేంద్రం రూపొందించిన సమగ్ర హెచ్చరిక వ్యవస్థ (సాచెట్)ను ఎన్డీఎంఏ విజయవంతంగా అమలులోకి తెచ్చింది. అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ యూనియన్ సిఫార్సు చేసిన సాధారణ హెచ్చరిక నియమావళి (కామన్ అలర్టింగ్ ప్రోటోకాల్ సీఏపీ) ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఇది ప్రస్తుతం భారతదేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అమల్లో ఉంది. భౌగోళికంగా లక్షిత ప్రాంతాలలో ఉన్న మొబైల్ వినియోగదారులకు విపత్తు, అత్యవసర సంబంధిత హెచ్చరికలను సంక్షిప్త సందేశాల ద్వారా అందజేస్తుంది.

విపత్తు నిర్వహణ అధికారులు ఈ వ్యవస్థను విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ హెచ్చరికలు, తుపాను సమయాలలో 19 పైగా భారతీయ భాషలలో నేటి వరకు 13,400 కోట్లకు పైగా లఘు సందేశాలను పంపడానికి ఇది వీలు కల్పించింది.

సునామీలు, భూకంపాలు, పిడుగులు వంటి అత్యవసర సమయాల్లోనూ, గ్యాస్ లీకేజీలు, రసాయన ప్రమాదాల వంటి మానవ తప్పిద అత్యవసర పరిస్థితుల్లోనూ హెచ్చరికల చేరవేతను మరింత పటిష్టం చేయడానికి, లఘు సందేశాలతో పాటు సెల్ ప్రసార సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. సెల్ ప్రసార వ్యవస్థలో, నిర్ణీత భౌగోళిక ప్రాంతంలో ఉన్న అన్ని మొబైల్ ఫోన్లకు ఏకకాలంలో హెచ్చరికలను పంపుతారు, తద్వారా హెచ్చరికలు తక్షణమే అందేలా చూస్తారు.

ఈ సెల్ ప్రసార ఆధారిత ప్రజా అత్యవసర హెచ్చరిక వ్యవస్థ స్వదేశీ అభివృద్ధి, అమలు బాధ్యతలను సీ డాట్ కు అప్పగించారు.

దేశవ్యాప్త అమలు, సెల్ ప్రసార సదుపాయం ప్రారంభంలో భాగంగా, వ్యవస్థ పనితీరు, విశ్వసనీయతను అంచనా వేయడానికి, అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయడానికి ముందుగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా పరీక్షలు, పరిశీలనలు చేపట్టారు. ఈ సమయంలో, ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో ఇంగ్లీష్, హిందీ, ప్రాంతీయ భాషలలో పరీక్షా సందేశాలను పొందవచ్చు. అయితే ఈ టెస్ట్ సందేశాలు సెల్ బ్రాడ్‌కాస్ట్ టెస్ట్ ఛానెళ్లను ఎంచుకున్న మొబైల్ ఫోన్లకు మాత్రమే అందుతాయి (వినియోగదారులు తమ సెల్ ఫోన్లలో హెచ్చరికల కోసం ఆమోదం తెలపవచ్చు, లేదా తిరస్కరించవచ్చు: సెట్టింగ్స్ సేఫ్టీ అండ్ ఎమర్జెన్సీ వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్స్ టెస్ట్ అలర్ట్స్). టెస్టింగ్ ప్రక్రియలో భాగంగా, మొత్తం మొబైల్ నెట్‌వర్క్ మౌలిక వసతుల్లో సరైన పనితీరును ధ్రువీకరించడంలో గ్రహీతలు అనేక సందేశాలను అందుకోవచ్చు.

ఈ సందేశాలు ప్రణాళికాబద్ధమైన దేశవ్యాప్త పరీక్షా ప్రక్రియలో భాగం మాత్రమే. ఈ సందేశాలకు గ్రహీతలు ఏ రకంగానూ స్పందించాల్సిన అవసరం లేదు. ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉండే పరీక్షా సందేశంలోని సమాచారం తెలుగు అనువాదం ఈ క్రింది విధంగా ఉంటుంది:

ఇది హెచ్చరికల ప్రసారం కోసం సెల్ ప్రసార వ్యవస్థ పరీక్షలో భాగంగా, భారత ప్రభుత్వ టెలీకమ్యూనికేషన్ల విభాగంతో కలిసి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ పంపిన మొబైల్ ప్రసార పరీక్షా సందేశం. సెల్ ప్రసార వ్యవస్థ పరీక్ష సమయంలో, ఈ సందేశం మీ మొబైల్ కు పలుమార్లు రావచ్చు. దయచేసి ఈ సందేశాలను పట్టించుకోవద్దు. మీ వైపు నుంచి ఎటువంటి చర్యా అవసరం లేదు.

విజయవంతంగా పరీక్షించి అమల్లోకి తెచ్చిన తర్వాత, సెల్ బ్రాడ్‌కాస్ట్ (సీబీ) వ్యవస్థను అన్ని మొబైల్ హ్యాండ్‌సెట్లలో టెస్ట్ ఛానెల్ సెట్టింగ్స్‌కు సంబంధం లేకుండా అనేక భారతీయ భాషల్లో హెచ్చరికలను పంపడానికి ఉపయోగిస్తారు. తద్వారా అత్యవసర పరిస్థితుల్లో విస్తృతంగా, సమగ్రంగా ప్రజలకు సమాచారం చేరుస్తారు.

ముఖ్యమైన ఈ పరీక్షా దశలో ప్రజల సహకారాన్ని డాట్ కోరుతోంది. ఈ కాలంలో అందే పరీక్షా సందేశాలు కేవలం వ్యవస్థ పనితీరు ధ్రువీకరణ కోసం మాత్రమేనని, స్వీకర్తలు ఎటువంటి చర్యలు తీసుకోనవసరం లేదని మరోసారి స్పష్టం చేస్తోంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన



**దేవరకొండ /నల్లగొండ, ఏప్రిల్30(వుదయం):**

దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని కొండమల్లేపల్లి శివారులో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లుభవనాలుసినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధే సమాజ పురోగతికి పునాది అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఆధునిక వసతులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తోందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కుల, మత భేదాలు లేకుండా 2563 మంది విద్యార్థులు ఒకే క్యాంపస్‌లో విద్యనభ్యసించేలా ఈ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. కొండమల్లేపల్లి పాఠశాల నిర్మాణాన్ని ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లాలో విద్య, రహదారులు, తాగునీరు, సాగునీటి రంగాల్లో విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతాన్ని విద్య, మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల పూర్తయితే మారుమూల ప్రాంతాల విద్యార్థులకు విశేష ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పాఠశాల ద్వారా ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన రెసిడెన్షియల్ విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ఈ సంస్థ దోహదపడుతుందన్నారు.కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో చలివేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**– డిఆర్డిఏ, టీజీవో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ, ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టరేట్ కు వచ్చే ప్రజలకు, ఉద్యోగుల కోసం వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ( డిఆర్డిఏ ), తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా కలెక్టరేట్ లో ప్రజలు, ఉద్యోగుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. చలివేంద్రంలో చల్లని నీటితో పాటు ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఆర్డీవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస స్వామి, టీజీవో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## దత్తతపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్ జిల్లా నర్సంపేట, ఏప్రిల్ 30:**

చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా నర్సంపేట మండల పరిషత్ కార్యాలయంలో దత్తత (అడప్షన్) మరియు ఫాస్టర్ కేర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై మాట్లాడారు. చట్ట విరుద్ధ దత్తతలు, బాలల అమ్మకం వంటి అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఇటువంటి ఘటనలు ఎవరైనా గమనించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. దత్తతను తప్పనిసరిగా చట్టబద్ధ మార్గంలోనే చేపట్టాలని, పిల్లల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎం&హెచ్ఓ సాంబాశివరావు, డీడబ్ల్యూఓ రాజమణి, ఆర్డీఓ ఉమారాణి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీసీపీఓ ఉమా, ఏహెచ్‌టీయూ ఇన్స్పెక్టర్ శ్యామసుందర్ పాల్గొన్నారు.

## డిజిటల్ జనగణనకు ములుగు జిల్లా ముస్తాబు!

### జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు

**స్వీయ నమోదుకు మే 10 వరకు అవకాశం.**
**జిల్లాలో 807 బ్లాకులు.. 545 మంది ఎన్యుమరేటర్ల నియామకం.**
**డేటా గోప్యతపై ఆందోళన వద్దు**
**- ప్రజలు సహకరించాలి.**



**ములుగు, ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి):**

ములుగు జిల్లాలో డిజిటల్ జనగణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. గురువారం రోజున జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన జనగణన పోస్టర్లను విడుదల చేసి, వివరాలను వెల్లడించారు.స్వీయ నమోదు విధానం ద్వారా ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా se.census.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చు. కుటుంబంలో ఒకరు లాగిన్ అయ్యి వివరాలు సమర్పించవచ్చు. మొదటి దశ హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో భాగంగా స్వీయ నమోదుకు ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు సమయం ఉంది. యంత్రాంగం సిద్ధం, జిల్లాను 807 హౌస్ లిస్టింగ్ బ్లాకులుగా విభజించామని, ఇందుకోసం 545 మంది ఎన్యుమరేటర్లు, 97 మంది సూపర్వైజర్లను నియమించినట్లు కలెక్టర్ వివరించారు.గుర్తింపు సంఖ్య, ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేసిన తర్వాత వచ్చే 11 అంకెల సంఖ్యను భద్రపరుచుకుని, ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్‌కు అందజేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వివరాలు నమోదు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని, ఒకసారి సబ్మిట్ చేస్తే సవరణకు అవకాశం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా పొరపాట్లు దొర్లితే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సరిదిద్దుకోవచ్చని తెలిపారు. డేటా అంతా ఎన్‌క్రిప్ట్ చేయబడి ఉంటుందని, గోప్యత విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ పథకాల రూపకల్పనకు జనగణన ప్రాతిపదిక అని, కావున ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతంలోనే ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జి, డి.పి.ఆర్.ఓ రఫిక్లు పాల్గొన్నారు.

## ప్రాజెక్ట్ ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలి



**మహాదేవపూర్ ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి)**

కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగమైన మేడిగడ్డ,అన్నారం ప్రాజెక్ట్ ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ అన్నారు కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగమైన మేడిగడ్డ లక్ష్మీబ్యారేజి, అన్నారం సరస్వతి బ్యారేజీలను గురువారం ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మేడిగడ్డ లో కొనసాగుతున్న బోర్ హోల్స్ పనుల పురోగతిని అధికారులను అడిగితెలుసుకున్నారు మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్ట్ ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు సిబ్బంది కోసం గతంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ఉపయోగించిన షెడ్లను పరిశీలించి సిబ్బంది ఉండేందుకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం అన్నారంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద అదనపు సిబ్బంది వసతి కొరకు గదులను పరిశీలించారు. అన్నారం ప్రాజెక్ట్ అప్ స్ట్రీమ్ ను పరిశీలించి బోర్ హోల్స్ పనులను ప్రారంభించాలని ఆదేశించారు.ప్రాజెక్టులో సాంకేతిక పరిశీలన పనులను శుక్రవారం నుంచి ప్రారంభించాలని ఆదేశించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక పరీక్షలను దశల వారీగా చేపట్టాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పరిశీలన పనుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. డ్రిల్లింగ్ పనులు చేపట్టేటప్పుడు గట్టి శిలా పొర వచ్చేంతవరకు కొనసాగించాలని సూచించారు. ప్రాజెక్టులో వివిధ దశల్లో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తూ పనుల నాణ్యతను నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సరఫరాను నిరంతరం అందుబాటులో ఉంచాలని,రోజు ఇరిగేషన్ అధికారులు పనులను సమగ్రంగా పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఈఎన్సి రమేష్‌కుమార్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈలు తిరుపతిరావు, యాదగిరి, డిపిఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జిల్లాలో పుష్కలంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు



**జనగామ, ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. గురువారం రోజున జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, అధికారులతో కలిసి ఇంధన సరఫరాపై ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.నిల్వలు సమృద్ధి, ఆయిల్ కంపెనీల నుండి సరఫరా నిరంతరం కొనసాగుతోందని, కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆదేశించారు.క్యాన్లలో విక్రయం నిషేధం, భద్రతా కారణ దృష్ట్యా బంకుల్లో విడిగా క్యాన్లలో పెట్రోల్, డీజిల్ పోయడంపై నిషేధం విధించారు. ఈ నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రైతులకు వెసులుబాటు, సాగు పనుల దృష్ట్యా రైతులకు (కల్టివేటర్లు, హార్వెస్టర్లు) 25 లీటర్ల వరకు ఇంధన పరిమితిని పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు.పారదర్శకతతో స్టాక్ రికార్డులను పక్కాగా నిర్వహించాలని, కూపన్ల విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు తమ అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసి అనవసర ఆందోళనకు గురికావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు, వ్యవసాయ, రవాణా, పౌరసరఫరా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సత్కారాల నడుమ టెక్నికల్ అసిస్టెంట్ ముత్తయ్యకు ఘన వీడ్కోలు



**భద్రాచలం 30/4/26 వుదయం /ప్రతినిధి**

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పనిసరి అయినప్పటికీ, అది జీవితానికి ముగింపు కాదని, కొత్త జీవితానికి ఆరంభమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. ఉద్యోగంలో చేరిన తొలి రోజు నుంచే రిటైర్మెంట్ అనేది సహజమైన ప్రక్రియ అని గుర్తుంచుకొని, ఉద్యోగ కాలంలో విధులను నిబద్ధతతో నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందితేనే ఆ సేవలకు నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన కార్యాలయంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న ముత్తయ్యకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మధుకర్‌తో కలిసి ముత్తయ్యను శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కుటుంబ సభ్యులు, సహచర సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా బి. రాహుల్ మాట్లాడుతూ, ముత్తయ్య 1986లో ఇంజనీరింగ్ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, నాలుగు దశాబ్దాల పాటు నిబద్ధతతో సేవలందించారని కొనియాడారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, కృషి ద్వారా మంచి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలు అతనికి గొప్ప సంపదగా నిలిచాయని తెలిపారు.

40సంవత్సరాల సుదీర్ఘ సేవ అనంతరం ఉద్యోగ విరమణ పొందడం ఒకవైపు బాధాకరం అయినప్పటికీ, ఇది ప్రతి ఉద్యోగికి సహజమని, శాశ్వతం కాని ఉద్యోగం ముగిసిన తరువాత కుటుంబంతో సంతోషంగా జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే తన అనుభవాన్ని భవిష్యత్తులో కార్యాలయ సిబ్బందితో పంచుకుంటూ అవసరమైనప్పుడు మార్గదర్శనం చేయాలని సూచించారు. పదవీ విరమణ పొందిన ముత్తయ్య మాట్లాడుతూ, తనకు సహకరించిన ఉన్నతాధికారులు, సహచర ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ కాలంలో అందించిన మద్దతు వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, అందరి ప్రేమాభిమానాలు జీవితాంతం గుర్తుంచుకుంటానని అన్నారు. అనంతరం సిబ్బంది ముత్తయ్యను ఘనంగా సన్మానించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డి.ఈ హరీష్, డి.ఎ.ఓ శంకరాచార్యులు,

పర్యవేక్షకుడు వెంకటస్వామి, ఖమ్మం సూపరింటెండెంట్ మహేష్ కుమార్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం డీఈలు, ఏఈలు, సిబ్బంది భవాని, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పౌరుడికి వజ్రాయుధం

### ప్రధాన కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి




**నల్లగొండ, ఏఫ్రిల్30(వుదయం):**

ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత పెంపుకు సమాచార హక్కు చట్టం పౌరుల చేతిలో వజ్రాయుధంలా పనిచేస్తుందని రాష్ట్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి డా. జి. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో సమాచారం కీలకమని, ఆ సమాచారాన్ని అందించడం పబ్లిక్ అథారిటీల బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాసేవకులమనే భావనతో పనిచేయాలని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని వివిధ చాప్టర్లు, సెక్షన్లపై విపులంగా వివరించిన ఆయన, పౌరులకు సమాచారం కోరే హక్కుతో పాటు రికార్డులను పరిశీలించే హక్కు కూడా ఉందన్నారు. సెక్షన్ 4(1)(బి) ప్రకారం అధికారులు స్వచ్ఛందంగా సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వివరాలను నిరంతరం నవీకరించి వెబ్‌సైట్లలో పొందుపరచాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 1.20 లక్షల దరఖాస్తులు వస్తుండగా, అందులో లక్ష మందికి సమాచారం అందించినట్లు తెలిపారు. గత పది నెలల్లో 15 వేల కేసులను పరిష్కరించినట్లు, సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన 15 మంది అధికారులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం సుమారు 10 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, మే 15 నాటికి ఎక్కువ భాగం కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, ప్రపంచంలో సమాచార హక్కు అమల్లో భారత్ నాలుగో స్థానంలో ఉందన్నారు. 2005లో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు గుర్తు చేశారు.కమిషనర్లు భోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావు, మోషిన్ పర్వీన్ కూడా చట్ట అమలు, బాధ్యతలు, అప్పీలు ప్రక్రియపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో RTI దరఖాస్తులను సమయానుకూలంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, డిఎఫ్ఓ రాజశేఖర్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు మరియు పౌర సమాచార అధికారులు పాల్గొన్నారు.

## వేంసూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 92 శాతం ఉత్తీర్ణత

**సత్తుపల్లి ఏప్రిల్ 30 (వుదయం ప్రతి నిధి )**



ఎంఈఓ వేంసూరు, 10వ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలు 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ చలంచర్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 218 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 201 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని, 17 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని, పాఠశాలల వారీగా ఉత్తీర్ణత వివరాలు అరసర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 40 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 36 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు.మర్లపాడు పాఠశాల నుంచి 33 మందికి 30 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కందుకూరు పాఠశాల నుంచి 33 మంది విద్యార్థులకు గాను 29 మంది విద్యార్థులు, కుంచపర్తి పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులకు గాను 18 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 49 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కాగా 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. చౌడవరం పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు పరీక్షల హాజరుకాగా 27 మంది ఉత్తీర్ణత, వెంకటాపురం పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులకు గాను 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

## కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**చర్ల ఏప్రిల్ 30.04.2026 (వుదయం ప్రతినిధి ):**

చర్ల మండల కేంద్రంలో రైతు వేదిక లో 51 మంది లబ్ధిదారులకు లక్ష నూట పదహారు రూపాయల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని. ఈ పథకాలకు సంబంధించిన ముఖ్య ఉద్దేశం అని తెలిపారు

పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం భారం కాకూడదనే ఉద్దేశంతో, బాల్య వివాహాలను అరికట్టడానికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సాయం చేయడానికి ఈ పథకాలను ప్రారంభించారని.

దరఖాస్తుదారులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలని. వివాహ సమయానికి వధువు వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలని. కుటుంబ ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్, మార్కెట్ కమిటీ చైర్మన్, ఆత్మ కమిటీ చైర్మన్, తహసీల్దార్, యంపిడిఓ, పార్టీ నాయకులు పాల్గొన్నారు

## స్టేట్ సెకండ్ ర్యాంక్ విద్యార్థిని అభినందించిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి



**వుదయం సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్: 30**

తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే రెండో ర్యాంకు సాధించిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్తె, సూర్యాపేట జయ స్కూల్ విద్యార్థిని రిత్విక ను అభినందించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులు బాగా చదివితేనే భవిష్యత్తు ంటుందని స్టేట్ ర్యాంక్ వచ్చిన ఈమె ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకుడు సైదులు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది: అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి

**నల్లగొండ, ఏఫ్రిల్30(వుదయం):**

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నల్గొండ జిల్లా కనగల్ మండలం బచ్చన్నగూడెం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకుడు కొప్పుల సైదులు ప్రస్తుతం కోలుకుంటూ ఆరోగ్యంగా ఉన్నట్లు స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశాల మేరకు గురువారం అదనపు కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి నల్గొండలో చికిత్స పొందుతున్న సైదులును ఆసుపత్రిలో పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులను సంప్రదించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కనగల్ మండలం జి. యడవల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో బచ్చన్నగూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దింపుకోవడంలో జాప్యం చేయడం వల్ల ఎదురైన ఇబ్బందుల నేపథ్యంలో కేంద్ర నిర్వాహకుడు కొప్పుల సైదులు బుధవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.విషయం తెలిసిన వెంటనే సైదులును 108 అంబులెన్స్ ద్వారా నల్గొండ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సైదులు త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించినట్లు వెల్లడించారు.వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది ఆసుపత్రి వద్దనే ఉండి సైదులు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

## విద్యాశాఖ వారోత్సవాలను ఉత్సవంలా నిర్వహించాలి




**విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగిత రానా**

**వుదయం సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్: 30**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 18 వరకు జరగనున్న విద్యాశాఖ వారోత్సవాలను పెద్ద ఉత్సవంలా నిర్వహించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగిత రానా అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా జిల్లా కలెక్టర్లు అడిషనల్ కలెక్టర్లు డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యోగితా రానా మాట్లాడుతూ విద్యాశాఖ వారోత్సవాలను గ్రామ గ్రామానా పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. 11 నుంచి 18 వరకు డే వైస్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విద్యాశాఖ వారోత్సవాలను అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలి

### -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల / (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల సాయికుంట ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలకు.. కాంగ్రెస్ నాయకుల స్ట్రాంగ్ కౌంటర్

- అవగాహన లేని మాటలు..
- ఆధారాలు లేని ఆరోపణలు
- మంత్రి అడ్లూరిపై విమర్శలు చేస్తే సహించం
- అధికారం పోయిన అసహనం తోనే తప్పుడు కూతలు
- సంగనభట్ల దినేష్,వేముల రాజు ధ్వజం



**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):**

అధికారం కోల్పోయిన అసహనం తో బీఆర్ఎస్ నాయకులు మతిభ్ర మించి మాట్లాడుతున్నారని, ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరిం చారు. గురువారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వ హించిన మీడియా సమావే శంలో జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజు బీఆర్ ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ధర్మపురి క్షేత్రం టెంపుల్ సిటీ గా రూపుదిద్దు కుంటుంటే చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విషం చిమ్ము తున్నారని సంగనభట్ల దినేష్ మండిపడ్డారు.గత ప్రభుత్వం హయాం లో లబ్ధిదారులకు తెలియకుండానే భూములను బ్లాక్ లిస్టులో పెట్టి ఇబ్బం దులకు గురిచేశారని,కానీ నేడు మంత్రి అడ్లూరి బాధితులతో స్వయంగా చర్చ లు జరిపి,చట్టబద్ధంగా, శాంతియుతం గా భూసేకరణ జరుపుతున్నారని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిని అడ్డుకోవాల ని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హితవు పలికారు. మున్సిపాలిటీకి లక్షలాది రూపాయలు బాకీ ఉన్న వ్యక్తులను పక్కన పెట్టుకుని బీ ఆర్ఎస్ నేతలు నీతులు చెప్పడం హాస్యాస్పదమని వేముల రాజు ఎద్దేవా చేశారు. శనివారం సంత వేలం పాటలో రూ. 2.50 లక్షల బకాయిలు ఉన్న విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో ఎవరో ఏదో అన్నారంటూ బాధ్యతా యు తమైన పదవుల్లో ఉన్నవారు ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడితే ప్రజల ముందు దోషులుగా నిలబడక తప్పదని హెచ్చరించారు.ధాన్యం కొనుగో ళ్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న శ్రీకాంత్ రెడ్డికి మాజీ పీఏసీఎస్ చైర్మన్ నరేష్ బహిరంగ సవాల్ విసిరారు.అక్రమాలు జరిగి నట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని,లేదం టే శ్రీకాంత్ రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని నిలదీశారు. గతంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యం ముందు రైతులు ధాన్యం పోసి నిరసన తెలిపిన చరిత్ర శ్రీకాంత్ రెడ్డిది కాదా అని గుర్తు చేశారు. సొంత పార్టీ హయాంలో భూ కబ్జాలకు,అక్ర మాలకు పాల్పడిన వారు నేడు సుద్ధ పూసల్లా మాట్లాడటం ధర్మపురి ప్రజ లందరూ గమనిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్ర మంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందా రపు. రామన్న, ఎఎంసి వైస్ చైర్మన్ సంగ.నరసింహులు,పట్టణ అధ్యక్షుడు చిపిరిశెట్టి.రాజేష్,సర్పంచ్ లు చిలు ముల.లక్ష్మణ్, బాలగౌడ్,గంగమల్లు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అప్పం.తిరుపతి, వర్క్స్ బోర్డ్ ప్రొటెక్షన్ మెంబెర్ షబ్బీర్, మున్సిపల్ కౌన్సిలర్లు ప వ న్ , ఒ జ్జ ల . ల క్ష్మ ణ్ , నా య కు లు జె.సుముఖ్,అసెట్టి శ్రీనివాస్,గాజు. సాగర్, శ్రీధర్,గరిగే.రమేష్, రాపర్తి. సాయి పాల్గొన్నారు.

## ధర్మపురిలో వైభవంగా నృసింహ జయంతి

**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):**



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో గురువారం నృసింహ జయంతి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. నృసింహ నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి పురుషసూక్త, శ్రీసూక్త సహిత షోడశోపచార పూజలు, పంచోపనిషత్ అభిషేకాలు, సహ స్రనామార్చనలు వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ కుమార్ స్వామివారిని దర్శించు కుని, పట్టువస్త్రాలు సమర్పిం చారు. ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్తంభోద్భవ కాలంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి, వేదమంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్య నిర్వ హణాధికారి సంకటాల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.



## నగర అభివృద్ధి పనుల్లో విద్యుత్ శాఖ పాత్ర కీలకం

### - మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)**

నగర అభివృద్ధి పనుల్లో విద్యుత్ శాఖ పాత్ర కీలకమని, పెండింగ్‌లో ఉన్న పనుల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సమావేశంలో పెండింగ్ లో ఉన్నపోల్స్ షిఫ్టింగ్ పనులు, అవసరమైన చోట కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు. పలు చోట్ల ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ల పవర్ లోడ్ తగ్గించుట, నగరపాలక సంస్థ విద్యుత్ వినియోగంలో తలెత్తుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో తనిఖీలు చేపట్టి విద్యుత్ వినియోగంలో సమస్యలను పరిష్కరించాలన్నారు.నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లకు అధికంగా ఉన్న పవర్ లోడ్ ను నియంత్రింత్రొ చార్జీల భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వినియోగంలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ద్వారా నూతనంగా నిర్మాణం చేస్తున్న లైబ్రరీ బిల్డింగ్, ఐసీసీసీ బిల్డింగ్, కాశ్మీర్ గడ్డ రైతుబజారు తదితర ప్రాంతాల్లో నూతన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లు త్వరగా ఇచ్చేలా నగరపాలక సంస్థ, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగర వ్యాప్తంగా ఇతర అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంబాలను తరలించాలన్నారు. చాలా రోజులుగా పోల్స్ తరలింపు పనులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నగరంలోచెట్లకొమ్మలు నరికేసే సమయంలో నగరపాలక సంస్థ కు సమాచారం తప్పక అందించాలన్నారు. చెట్లను నరికి రోడ్ల పై వదిలేస్తే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, డీఈ అరుణ్, ఏఈ గఫూర్, విద్యుత్ శాఖ ఎస్ఈ రవీంధర్, ఈఈ రాజం, ఏఈ లావణ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఆదిలాబాద్ రీజియన్‌లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజినల్ మేనేజర్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన యువత ఈ అవకాశాన్ని వి ని యో గిం చు కో వా ల ని సూచించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు వివిధ డిపోలలో మూడు నెలలపాటు అప్రెంటిస్ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.

బి.కాం, బి.ఎస్‌సి, బి.ఎస్‌సి (కంప్యూటర్స్), బీబీఏ, బీసీఏ, బీఏ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులు. 2020 సంవత్సరం తరువాత ఉత్తీర్ణులైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (NATS 2.0) పోర్టల్‌లో నమోదు చేసుకుని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సమర్పించాలి. ఏప్రిల్ 29, 2026 నుంచి మే 15, 2026 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని అధికారులు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు టీజీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని డిపోలలో శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత డిపో మేనేజర్ లేదా రీజినల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



## జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

### - జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (మే 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తం గా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర గురువారం తెలిపారు. జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలాగే ప్రజాధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు.

## జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

### కలెక్టర్ హరిత



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి):**

ఆసిఫాబాద్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హరిత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అవసరమైతే మరిన్ని కేంద్రాలను కూడా పెంచుతామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లాలో ఉన్న 13 రైస్ మిల్లుల్లో ప్రస్తుతం 11 మిల్లులకు ధాన్యం తరలిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర

- ప్యాడీ క్లీనర్లు వినియోగించాలి
- సన్నరకాలు, ఆయిల్ పామ్ సాగు చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో పరిశీలన



**తంగళ్లపల్లి, ఏప్రిల్ 30**

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల పంటలకు మద్దతు ధర లభిస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు. టార్పాలిన్లు, గన్ని సంచులు, నీటి వసతి, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని ఆరా తీసి.. పరిశీలించారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది? సన్న రకం వడ్లు వచ్చాయా? అని అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల కేటాయింపుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులు ప్యాడీ క్లీనర్లు వినియోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని రేషన్ షాప్ లు, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు సైతం సన్న బియ్యంతో సిద్ధం చేసిన భోజనం పెడుతున్నారని, సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఆయిల్ పామ్ పంట దిగుబడి విక్రయానికి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ఎన్నో లాభాలు ఉన్న సన్న రకం వడ్లు, ఆయిల్ పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం




**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి):**

కాగజ్‌నగర్: కుమురం భీం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ఆధ్వర్యంలో సమ్మర్ బాక్సింగ్ శిక్షణ శిబిరం గురువారం కాగజ్‌నగర్‌లోని ఎఫ్ కాలనీ, సిర్‌సిల్క్ ప్రాంతంలో ప్రారంభమైంది. ఈ శిబిరం ఏప్రిల్ 30 నుండి మే 31 వరకు కొనసాగనుంది. శిబిరాన్ని మాజీ ఎంసీకే చైర్మన్ దస్తగీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వేముర్ల మధు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యక్షుడు జయేందర్, బాక్సింగ్ చైర్మన్ శివ నాయర్, కార్యదర్శి మధురై శేఖర్, సభ్యులు అల్లాడి రాజు, అబ్బాస్ ఖాన్, వాసీమ్, రాకేష్ హాజరయ్యారు. కోచ్‌లు సాయి కుమార్, శివ, వంశీ, రాజశేఖర్ క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నారు.

## ఆదర్శంగా మంథని మున్సిపాలిటీ

### - మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్

**మంథని, ఏప్రిల్ 30:**

మంథని మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం మంథని మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి మరియు కౌన్సిల్ సభ్యులు పాల్గొని మున్సిపాలిటీకి అవసరమైన పలు కీలక అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు.

మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో అగ్రగామిగా.. ఈ సందర్భంగా చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి ప్రత్యేక సహకారం, మార్గదర్శకత్వంలో మంథని పురపాలక సంఘాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజల సహకారం కోరుతూ.. పట్టణ సుందరీకరణ మరియు అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, పురపాలక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కౌన్సిల్ సభ్యులు సూచించిన పలు అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని హామీ ఇచ్చారు. పాల్గొన్న ముఖ్యులు: వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి, పోతరబోయిన శ్రీలత, జంబోజు శ్రీమతి, మారుపాక నిహారిక, పెంటరి రాజు, వేముల లక్ష్మి, యేల్లంకి వంశీధర్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## నీట్ ఎగ్జామ్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్, ఏప్రిల్ 30:**

మే 3వతేదీనజరగనున్ననీట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ను పురస్కరించుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరీక్షా కేంద్రాలను సందర్శించారు. డిచ్పల్లి లోని తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాలతో పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని యూజీ బ్లాక్, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ బ్లాక్ లను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. కట్టుదిట్టమైన బందోబస్తు మధ్యన పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నీట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నేపథ్యంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ నిజామాబాద్ నగరంలోని కంటేశ్వర్ లో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన నూనె కుమార్



**ఉదయం న్యూస్ కొండపాక ప్రతినిధి ఏప్రిల్ 30**
సిఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని నిరుపేద మధ్యతరగతి వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ అన్నారు.గురువారం రోజూ దుద్దెడకు చెందిన ఎండి సనా 36000,బుచ్చి గారి మల్లయ్య 24000,గడ్డమీది నరసింహులు 33000,గురుకు రాములు 5000, జేసెట్టి రేణుక 10,500 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందించారు నూనె కుమార్.అనంతరం అయనమాట్లాడుతూనిరుపేదమధ్యతరగతివారు అనారోగ్యానికి గురై ఆస్పత్రులలో డబ్బులు ఖర్చులు పెట్టి ఆర్థికపరమైన ఇబ్బందులకు గురైన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి పొందే సరైన అవకాశం కలదని అన్నారు.చికిత్స కు ముందు అయితే ఎల్ఓసి ద్వారా తెలంగాణ రాష్ట్రంలో నిమ్స్ హాస్పిటల్ కి మాత్రమే అవకాశం ఉన్నదని,చికిత్స తర్వాత అయితే ఏ ఆసుపత్రి అయినా బిల్లులు క్లైమ్ చేయించి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి పొందవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు చిక్కుడు బాను, ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లె బాబు, నాయకులు జక్కుల శ్రీశైలం, మెరుగు శివకుమార్, కెమ్మసారం సంతోష్, చిక్కుడు సాయికిరణ్, జేశెట్టి బాబు, గాదగోని నాగరాజు, ఎండి అస్లాం, గుర్రాల రాజు, గుర్రాల కనకయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఘన స్వాగతం

**మున్సిపల్ చైర్మన్ నాగేష్ షెట్కార్.**
**నారాయణఖేడ్ ఏప్రిల్ 30 (ఉదయం)**
నారాయణఖేడ్ పట్టణానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ను ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ షెట్కార్ ఘన స్వాగతం పలికారు.తమ బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు నారాయణఖేడ్‌కు విచ్చేసిన రామకృష్ణారావు పట్టణంలోని మహా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, ప్రస్తుత పరిస్థితులపై కొద్దిసేపు పరస్పరం చర్చించారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారి మన ప్రాంతానికి రావడం పట్ల చైర్మన్ గారు హర్షం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద మహేందర్, లక్ష్మణ్, చంద్రశేఖర్ (అడ్వకేట్), అప్పారావు, కొండల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# పిఎండిడికేవై లో జోగులాంబ గద్వాల జిల్లా ముందుండాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల ఏప్రిల్ 30**
**(ఉదయం ప్రతినిధి)**
కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎండీడీకేవై లో జోగులాంబ గద్వాల జిల్లా ముందుండేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పిఎండిడికేవై (ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన) అమలుపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. డేటా ఆధారిత పాలన ద్వారా జిల్లాలో అభివృద్ధిని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి శాఖ తమ పనితీరును ఖచ్చితమైన సంఖ్యలతో ప్రతిబింబిస్తూ,



లక్ష్యాలు మరియు సాధించిన ఫలితాలను సరిగ్గా నిర్దేశిత పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. “సున్నా” నమోదు చేయకుండా, చేసిన ప్రతి పనిని డేటాలో చూపించాలని, చిన్న పురోగతినైనా నమోదు చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గత సంవత్సరంతో పోల్చి ప్రస్తుత పురోగతిని చూపించడం ద్వారా పనితీరు మెరుగవుతుందని, ప్రతి నెల సమీక్ష ద్వారా డేటాను సరిచేసుకుంటే నివేదికలు మరింత నాణ్యతగా ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, పథకం సూచికలను సక్రమంగా అమలు చేస్తే, ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, డిఆర్డిఓ ముషాహిదా బేగం, పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, జిల్లా ఉపాధి కల్పనాధికారి చరణ్ దీప్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఏర్దనూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.. రైతులకు ఆధునిక సాగుపై అవగాహన

**కంది ఉదయం**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం కంది మండలం ఏర్దనూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించబడింది. గ్రామ సర్పంచ్ పంబల జ్యోతి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ డి.ఆర్. హుస్సేన్, డాక్టర్ పరుశురాం, వ్యవసాయ అధికారి ఆసియా బేగం, ఏఈఓ సంగీత, పీఏసీఎస్ సుల్తానా తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల దిగుబడి పెంపు, గిట్టుబాటు ధరలు సాధించే మార్గాలపై శాస్త్రవేత్తలు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అలాగే, యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. సేంద్రియ సాగు ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతో పాటు, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, వ్యవసాయానికి సంబంధించిన పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతుల అభ్యున్నతి, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.



# నేడు మహబూబ్ నగర్ లో జాబ్ మేళా
## నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**నారాయణపేట టౌన్ ఏప్రిల్ 30**
**( ఉదయం ప్రతినిధి )**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిరుద్యోగ యువత కు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నారాయణపేట జిల్లా కలెక్టర్ సి . హెచ్. ప్రియాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వ తేదీన ఉదయం 9:00 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో జాబ్ మేళా నిర్వహిం చడం జరుగుతుందని తెలిపారు. ఈ మేళాలో నారా యణపేట జిల్లా యువతతో పాటు మహబూబ్ నగర్, గద్వాల నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు కూడా పాల్గొన వచ్చని తెలిపారు. ప్రభుత్వం 6 మార్చి 2026 నుండి 12 జూన్ 2026 వరకు నిర్వహి స్తున్న 99 రోజుల కార్యాచ రణ ద్వారా గ్రామీణ స్థాయి లో అవగాహన పెంపొందించడం, యువజన, క్రీడా అంశాల అమలును బలోపే తం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మే 18 నుండి 23 వరకు యువజన, క్రీడలపై అవగాహన కల్పిస్తూ వారోత్సవాలు నిర్వహించబడతాయన్నారు.
ఈ జాబ్ మేళా ద్వారా ఆయా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థు లకు మే 23వ తేదీన నియా మక పత్రాలు అంద జేయబ డతాయన్నారు.
అర్హత కలిగి న జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొ ని పెద్ద సంఖ్యలో పాల్గొనాల ని కలెక్టర్ పేర్కొన్నారు.



# నిజాంపేట మండల బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



**మెదక్ జిల్లా ఉదయం ప్రతినిధి**
నిజాంపేట్ మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం రోజున మండల ప్రత్యేక అధికారి దేవ్ కుమార్ అధ్యక్షతన మండల బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి అనంతరం కమిటీ ఆధ్వర్యంలో.
సమావేశాన్ని ఏర్పాటు చేసి ముఖ్యంగా మండలంలో బాల్య వివాహాలు మరియు బాల కార్మికులు లేని మండలంగా ఈ కమిటీ పని చేస్తుందని మండల ప్రత్యేక అధికారి
దేవ్ కుమార్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల ఎంపిడిఓ రాజిరెడ్డి, ఎస్ఐ రాజేష్, ఏంఈఓ శ్రీనివాస్ రెడ్డి , ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ, సిహెచ్ఓ కొండయ్య, గ్రామ సర్పంచ్ మడవత్ సునీత , విజన్ ఎన్ జీ ఓ సంస్థ సభ్యులు యాదగిరి, ఎంసిపిసి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

**నారాయణపేట టౌన్ ఏప్రిల్ 30(**
**ఉదయం ప్రతినిధి**
)ప్రభుత్వం మీది ప్రజల అభివృద్ధి కొరకు ప్రభుత్వం పని చేస్తున్నదని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేష న్ చైర్మన్ ఉబైదుల్లా కొత్వాల్ అన్నారు. గురువారం ఆయన నారాయణపేటలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 550 కుట్టు మిషన్లు అర్హులైన మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా ఉబైదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. గత రెండేళ్లకు పైగా కాలంలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని, రాబోయే మూడు సంవ త్సరాల్లో మరిన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపా రు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి , మైనారిటీ అధికారి రషీద్ మైనార్టీ డిస్టిక్ ప్రెసిడెంట్ మైముద్ ఖురేషి,మహమ్మద్ గౌస్, సీనియర్ లీడర్ ఖజా సాబ్, దామరగిద్ద మండల సెక్రెటరీ మమ్మద్ ఖాజా, మరికల్ మండల్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ, నారాయణ పేట మండల ప్రెసిడెంట్ కుతుబుద్దీన్, దామరగిద్ద మండల్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖదీర్, ధన్వాడ మండల్ ప్రెసిడెంట్ సర్ఫ రాజ్ అన్సారి, సీనియర్ నాయకులు ,మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హిందూ జాతీయ పునర్నిర్మాణం కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కృషి

**దుబ్బాక, ఉదయం (ఏప్రిల్ 30):**
హిందూ జాతీయ పునర్నిర్మాణం కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శాఖల ద్వారా కృషి కొనసాగుతోందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహ కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున తెలిపారు. సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మిరుదొడ్డిలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. వేల ఏళ్ల బానిసత్వం కారణంగా ఆత్మవిశ్వృతి చెందిన సమాజాన్ని చూసి డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ 1925లో సంఘాన్ని స్థాపించారని పేర్కొన్నారు. శాఖలు వ్యక్తినిర్మాణానికి కేంద్రాలుగా పనిచేస్తూ సమాజాన్ని సంఘటితం చేస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం 140 దేశాల్లో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు విస్తరించాయని తెలిపారు. ప్రతి స్వయంసేవకుడు సమాజ కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతాడని తెలిపారు. పంచ పరివర్తన అంశాలైన సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ భావన, పౌర విధులు, కుటుంబ ప్రబోధన్ పాటించాలని సూచించారు. అఖిల భారతీయ సాధుసంతుల మఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ సనాతన ధర్మ పరిరక్షణ కోసం పూర్వీకు ల మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. వృత్తుల ఆధారంగా ఏర్పడిన కులాలను పరిమితం చేసి సామాజిక ఐక్యతకు కృషి చేయాలని సూచించారు.స్థానిక పురోహితులు రాజపున్నయ్య ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి మహాయజ్ఞం నిర్వహించగా, ఉదయం నుంచి భజన మండలాల ఆధ్వర్యంలో అఖండ భజన కొనసాగింది. బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుంట లహరిరాజు, లింగాల అంజిరెడ్డి తో పాటు గ్రామస్తులు, భక్తులు, హిందూ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ఐదు రాష్ట్రాలలో బీజేపీ కి అనుకూల ఫలితాలు

## ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్.




కరీంనగర్ ఏప్రిల్ 30(ఉదయం ప్రతినిధి)ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బీజేపీ కి ఉన్న రిపోర్ట్లు , అంచనాలకు అనుగుణంగా గణనీయ విజయాలు సాధిస్తుందని, అంచనాలకు మించిన ఫలితాలు వస్తాయని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.గురువారం కరీంనగర్లోని గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో గల అదితి హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికేలా ఈ నెల 10న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్నారని,. ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈనెల భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేలా ఈనెల 10న, “జనాగ్రహ సభ”ను నిర్వహించడానికి బిజెపి తెలంగాణ పార్టీ సన్నాహాలు చేస్తుందని, ప్రధాని మోదీ హాజరయ్యే ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతారని, ఇది తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే సభగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని ఏ లా నడపాలో అర్థం కాని స్థితిలో పాలన కొనసాగిస్తుందన్నారు. ఇక బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారని , ఆ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రప్రదమంగా కరీంనగర్‌లో తొలి మేయర్‌గా బీజేపీ అభ్యర్థి గెలవడం ప్రజల్లో మార్పు సంకేతమని ఆయన అన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించము
## జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 30**
**(ఉదయం ప్రతినిధి)**
మొక్కజొన్న కొనుగోలుపై మార్క్ ఫెడ్, పౌరసరఫరాల అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పరిపాలన చర్యలు ముమ్మరం చేసింది ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,....... జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన మొక్కజొన్నను వేగంగా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు తేమ శాతం పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా టోకెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న 18 జిన్నింగ్ మిల్లుల్లో మొక్కజొన్నను కొనుగోలు చేసి నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నిల్వ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గిడ్డంగులు సరిపోకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సమయానికి తరలించకపోతే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందుకు రవాణా ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా అవకతవకలు లేదా నిర్లక్ష్యం చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న చర్యలను వివరించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచి కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పెంచాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.



# రైతుల సమస్యలపై స్పందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి

**సిద్ధిపేట బ్యూరో,ఏప్రిల్ 30**
**(ఉదయం )**
సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను వంగ రాజేశ్వర్ రెడ్డి సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.రైతులు తాగునీటి కొరతను ప్రస్తావించగా, వెంటనే స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో రైతుల్లో కొంత ఊరట కనిపిస్తోందని ఆయన అన్నారు. రైతుల పక్షాన నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని వంగ రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.



# మండల టాపర్‌గా మేనం ప్రణవి: సర్పంచ్ బండి స్వామి ఘన సన్మానం



పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. తాడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మేనం ప్రణవి 600 మార్కులకు గాను 564 మార్కులు సాధించి, అద్భుత ప్రతిభతో మండల టాపర్‌గా నిలిచింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో మండలంలోనే అత్యధిక మార్కులు సాధించిన ప్రణవిని, స్థానిక సర్పంచ్ బండి స్వామి శాలువాతో ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా రాణించడం గర్వకారణం. ప్రణవి సాధించిన ఈ విజయం గ్రామానికి, పాఠశాలకు ఎంతో కీర్తిని తెచ్చిపెట్టింది. పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపించింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు, మేనం రాకేష్, లింగారావు, కొత్తగొల్ల రాజయ్య మరియు గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉత్సాహంగా మహనీయుల జయంతి వేడుకలు.. దళిత రత్న అవార్డుల ప్రదానం



**హైదరాబాద్/జహీరాబాద్ ఏప్రిల్ 30**
**(ఉదయం ప్రతినిధి)**
గురువారం రోజున రవీంద్రభారతిలో మహనీయుల జయంతి ఉత్సవాలు దళిత రత్న అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం మహాత్మ జ్యోతి రావ్ పూలే మరియు, డా॥బాబు జగ్జీవన్ రామ్, మరియు డా॥బాబా.సాహెబ్ అంబెడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ మాదిగ హక్కుల దండోరా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.డా॥బాబు జగజీవన్ రామ్, డా॥బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ మేతరీ రోజరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో పాల్గొన్న సందర్భంగా నాయకులు మాట్లాడుతూమహనీయులు డా॥బాబు జగ్జీవన్ రామ్ డా॥బి. ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతుల మాసమైన ఏప్రిల్ మాసంలో ఈ ఉత్సవాలు జరగడం సంతోషకరమని వక్తలు అన్నారు దళితులందరూ ఐక్యంగా ఉండాలని విద్య ద్వారా ముందుకెళ్లాలని ఆర్థికంగా ఎదిగిన ఎదిగి సమాజానికి దిక్సూచిగా ఉండాలని వారు అన్నారు డా॥బి.ఆర్. అంబేద్కర్ జగ్జీవన్ రామ్, మహాత్మ పూలే దయ వల్లనే అణగారిన వర్గాలు అభివృద్ధి చెందాయని వారు అన్నారు..
ఈ కార్యక్రమంలో గౌరవ ఆహ్వానితులు రేగుంట సునీల్ మాదిగ , డా॥పెరుమాండ్ల రామకృష్ణ , ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్లు బైండ్ల వెంకటేశం ,నాయకులు కవ్వంపెల్లి రవి బుగ్గ మైసన్న.భవాని రెడ్డి ,ఎలుక పెల్లి రాజేందర్. తప్పేట్ల ప్రవీణ్ ,సప్పి పోచన్న. మేరీ మాదిగ , బంగారు దుర్గాభవాని నందిని , ఉప కులాల నాయకులు రాజలింగం , గంగ నరసయ్య .పశుపతి , తదితరులు పాల్గొన్నారు..



# చక్కని ఆరోగ్యం

## వేసవిలో పిల్లలు హెల్దీగా ఉండాలంటే..!



అప్పటివరకూ ఆరుబయట హాయిగా ఒళ్లెరగకుండా ఆడుతున్న చిన్నారి ఒళ్లు వెచ్చబడుతుంది. అకస్మాత్తుగా అమ్మాయి మేను నిప్పులు చెరుగుతోందేమో అనిపిస్తుంది. తల్లీదండ్రీ నుదురు తాకి చూసి, తటాలుమని చేయి వెనక్కు లాగేసుకుంటారు ఆ ఒంటి వేడి తట్టుకోలేక. ఇది దాదాపు ప్రతి చిన్నారి బాల్యంలో ఒక్కసారైనా ఎదుర్కొనే సంఘటన. ఇది ప్రతి తల్లిదండ్రుల జీవితంలో ఒక్కసారైనా చవిచూసే కాళరాత్రి. ఇలాంటి వేసవి తీవ్రత బారి నుంచి చిన్నపిల్లలను కాపాడుకోడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం.

ఎండవేడిమి తీవ్రతకు పెద్దలూ, పిల్లలూ, వృద్ధులనే తేడా లేక ◌ోయినప్పటికీ పెద్దలతో పోలిస్తే పిల్లల మీదే వేసవి ప్రతాపం ఎక్కువగా చూపిస్తుంటుంది. దీనికి కారణం ఉంది. పిల్లలంతా ఎండల్లో విపరీతంగా ఆటలాడుతూ ఉంటారు కాబట్టి పెద్దల కంటే వాళ్లకు చెమటలు పట్టడమూ, దాంతో వాళ్లు లవణాలు ఎక్కువగా కోల్పోతుండటం వల్ల ఎండ తీవ్రతకు గురవుతుంటారనేది కొందరి అపోహ. కానీ అది వాస్తవం కాదు. విషయం ఏమిటంటే... పెద్దలతో పోలిస్తే పిల్లల్లో చెమట గ్రంథులు తక్కువ. అందుకే చెమటలు పట్టడం పెద్దవారిలోనే ఎక్కువ. అయితే పిల్లల చర్మంపైన వేసవి తీవ్రతను చల్లబరిచేందుకు అవసరమైన ప్రక్రియ... చెమట పట్టడమనేది తక్కువ. దాంతో ఎండ వేడిమి పిల్లలపై ఎక్కువ దుష్ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలెప్పుడూ చల్లగా ఉండే నీడపట్టునే ఉండేలా చూడాలి. ఎండా, వడగాడ్పులు తగ్గాకే వాళ్లను ఆరుబయటకు వెళ్లనివ్వాలి. మజిల్ క్రాంప్స్ : పిల్లలెప్పుడూ ఎండను లెక్క చేయక ఆడుతూ ఉంటారు. ఇక సెలవుల్లో అయితే ఆటలే ఆటలు. దాంతో వారి దేహంలోని నీరు డీ–హైడ్రేషన్ కారణంగా బయటకు వెళ్లడమూ, ఆ నీటితో పాటు లవణాలూ తగ్గడం వల్ల... ఆ లవణాల అయాన్ల రూపంలో మెదడునుంచి కండరాలకు వచ్చే ఆదేశాలకు బ్రేక్ పడుతుంది. అందుకే ఒళ్లు డీ–హైడ్రేషన్‌కు గురి కాగానే... కండరాలు బిగుసుకు ◌ోతుంటాయి. వీటినే మజిల్‌క్రాంప్స్ అంటారు. ఈ మజిల్‌క్రాంప్స్ పిల్లలతో పాటు పెద్దలకూ వస్తుంటాయి. ఇలా జరిగిన వెంటనే... వారికి చిటికెడు ఉప్పు, కాస్తంత చక్కెర వేసిన నీటిని వెంటనే తాగించాలి. కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేయడం వల్ల ఈ సమస్యను తేలిగ్గానే ఎదుర్కోవచ్చు.

వడదెబ్బ : మనలో జీవక్రియలన్నీ సరిగా జరగడానికి దేహ ఉష్ణోగ్రత ఎప్పుడూ 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్‌గా ఉంటుంది. అయితే వడదెబ్బకు గురైనవారి దేహ ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా పెరుగుతుంది. దాంతో దేహంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వడదెబ్బ కారణంగా దేహ ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతూ ప్రమాదకరస్థాయి అయిన 104 డిగ్రీ ఫారెన్‌హీట్‌కు చేరినప్పుడు ఆ వేడి దగ్గర మెదడు, గుండె, మూత్రపిండాలు, కాలేయం వంటి కీలకమైన అవయవాల పనితీరు తీవ్రంగా దెబ్బతినే అవకాశాలెక్కువ. అందుకే శరీర ఉష్ణోగ్రతను మళ్లీ నార్మల్‌కు తీసుకురావడం అవసరం.

ఒంటి ఉష్ణోగ్రత 100 డిగ్రీల ఫారెన్‌హీట్ దాటుతోందని తెలియగానే పిల్లలను చల్లటి గాలి సోకేలా ఫ్యాన్ కింద ఉంచాలి. (ఒకవేళ ఫ్యాన్ కింద వేడిగాలి వస్తుంటే అలాంటి చోటకు తీసుకెళ్లినా లాభం ఉండదు. చిన్నారుల దుస్తులు వదులు చేసి, ఒంటికి చల్లగా లిని బాగా తగలనివ్వాలి. ఈ జాగ్రత్తల తర్వాత కూడా శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే పిల్లల చంకల కింద / గజ్జల వద్ద ఐస్ గడ్డలను ఉంచాలి. దాంతో ఒళ్లు చల్లబడుతుంది. అప్పటికీ శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే, దాన్ని మెడికల్ ఎమర్జెన్సీగా గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించాలి. గుడ్డు : గుడ్లు తినడం వల్ల అవి వేడి చేస్తాయనే అపోహ చాలామందిలో ఉంటుంది.

## వృద్ధాప్యంలో ఆరోగ్యంగా ఉండాలంటే...



అరవై దాటినవాళ్ల ఆరోగ్యం గురించి శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేస్తున్నారు. వాళ్లు ఆ వయసులో స్వతంత్రంగా, చురుగ్గా ఉండేందుకు 30 ఏళ్లనుంచే అడుగులు పడాలంటున్నారు. మెడిటరేనియన్ ఆహారం... గ్రీకులు, రోమన్లు వందల ఏళ్లుగా ఈ ఆహారాన్ని తీసుకుంటున్నారు. దీనిలో శాకాహారం, ఆలివ్ నూనె, సముద్ర ఆహారం ముఖ్యం. అలాగే పాల ఉత్పత్తులూ, చేప, కోడి ఉంటాయి. మాంసం పరిమితంగా తీసుకుంటారు. దీన్ని అనుసరిస్తే మేలు. కర్క్యుమిన్(పసుపులో ఉంటుంది), క్వెర్సిటిన్(ఎరుపు క్యాబేజీ, డార్క్ చాకొలేట్, కొన్ని రకాల బెర్రీల్లో), ఫిసెటిన్(స్ట్రాబెర్రీలో)... వీటికి వయసును నిరోధించే లక్షణాలు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని ఆపడమే కాదు, వయసును పెంచే కారకాలను నియంత్రిస్తాయి. పులియబెట్టిన పెరుగులాంటి పదార్థాలు తీసుకోవడం ముఖ్యం. దీనివల్ల పొట్ట ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉపవాసం, మితంగా తినడం కూడా మేలు చేస్తాయి. దీనివల్ల లిథోకాలిక్ యాసిడ్ విడుదలవుతుంది. పొట్టలో ఉండే బ్యాక్టీరియా దీన్ని విడుదల చేస్తుంది. ఇది కెలొరీల వినియోగాన్ని తగ్గించేందుకు సాయపడుతుంది. యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హాగెన్ యూనివర్సిటీ ఆఫ్ మాంట్రియల్‌కు చెందిన పరిశోధకులు 30 ఏళ్లపాటు మధ్య వయస్కుల ఆహారపుటలవాట్లను గమనించారు. పండ్లు, కూరగాయలు, ధాన్యం, పప్పులు, నట్స్... లాంటివి రోజువారీ ఆహారంలో తీసుకున్నవాళ్లు వయసు పెరిగినా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని దీన్లో తేలింది. నడి వయసులో ఏం తింటున్నామన్నదీ ముఖ్యమన్నమాట. నాణ్యమైన ఆహారం తీసుకోవడంవల్ల గుండె జబ్బులు, మధుమేహం, ముందస్తు మరణాల్ని తగ్గిస్తుందని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. ఆహారంతోపాటు వ్యాయామమూ ముఖ్య పాత్ర పోషిస్తుంది. దీనివల్ల శరీరభాగాల సామర్థ్యం తగ్గిపోకుండా చురుగ్గా పనిచేస్తాయి.

## జేబులో ఉల్లిపాయ పెట్టుకుంటే వడదెబ్బ తగలదా?



నిపుణుల అభిప్రాయం ప్రకారం, జేబులో ఉల్లిపాయ పెట్టుకోవడం వల్ల వడదెబ్బ నుంచి రక్షణ లభిస్తుందనే విషయానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. పూర్వం కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో ఉల్లిపాయను ఎక్కువగా తినేవారు. ఈ అనుభవం ఆధారంగా 'ఉల్లిపాయ వడదెబ్బను తగ్గిస్తుంది' అనే నమ్మకం ఏర్పడింది. అది తర్వాత 'జేబులో పెట్టుకుంటే కూడా ప్రయోజనం ఉంటుంది' అనే అపోహగా మారింది. అయితే, ఉల్లిపాయలో కొన్ని సహజ గుణాలు ఉన్నాయనేది నిజం. ముఖ్యంగా ఉల్లిపాయను ఆహారంగా తీసుకుంటే శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. దాంతో కొంతవరకు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడవచ్చు. కానీ, ఉల్లిపాయను జేబులో పెట్టుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత ఏ మాత్రం తగ్గదు. ఉల్లిపాయను జేబులో పెట్టుకోవడం కన్నా, దాన్ని ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది. అయితే వడదెబ్బ నుంచి రక్షణకు సరైన జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.

ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలోకి వెళ్లకపోవడం మంచిది. తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, లేదా ఓఆర్ఎస్ (ORS) తాగాలి. బయటకు వెళ్లేటప్పుడు వదులుగా, లేత రంగులో ఉండే కాటన్ దుస్తులను ధరించాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు సన్ గ్లాసెస్, టోపీ, స్కార్ఫ్ ఉపయోగించడం మంచిది. అలాగే, తప్పకుండా ఫేస్‌కు సన్‌స్క్రీన్‌ను రాయాలి. దోసకాయ, పుచ్చకాయ, నారింజ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను, కూరగాయలను తినాలి. ఆల్కహాల్, కెఫిన్ (కాఫీ, టీ), చక్కెర పానీయాలు డీహైడ్రేషన్‌కు దారితీస్తాయి, కాబట్టి వాటిని తగ్గించాలి.

## కళ్లు ఉబ్బినట్లుగా ఉంటే..!

కొంతమందికి ఉదయం నిద్ర లేవగానే కళ్లు ఉబ్బినట్లుగా కనిపిస్తాయి. అయితే చల్లటి నీటితో ముఖం శుభ్రం చేసుకోగానే ఉబ్బిన కళ్లు మళ్లీ మామూలుగా అయిపోతాయి. అయితే ఇలా చేసిన తర్వాత కూడా కళ్లు ఉబ్బినట్లుగానే ఉంటే ఏదో సమస్య ఉందని భావించాలంటున్నారు నిపుణులు. ఈక్రమంలో కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని వారు సూచిస్తున్నారు.



ఈ చిట్కాలతో.. శరీరం డీహైడ్రేషన్‌కు గురైనా కళ్లు ఉబ్బినట్లుగా కనిపిస్తాయట! అందుకే తగినన్ని నీళ్లు తాగమంటున్నారు నిపుణులు. నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి. టీ, కాఫీ, కార్బొనేటెడ్ ఎనర్జీ డ్రింకులు, ఆల్కహాల్... తదితర పానీయాలను తరచుగా తీసుకోవడం వల్ల కళ్లు ఉబ్బిపోయి అందవిహీనంగా తయారవుతాయి. కాబట్టి వాటికి సాధ్యమైనంత దూరంగా ఉండడం మంచిదంటున్నారు. కొత్తిమీరను డైట్‌లో చేర్చుకోవడం వల్ల ఈ సమస్య నుంచి బయటపడొచ్చు అంటున్నారు నిపుణులు. సూప్స్, సలాడ్లలో కొత్తిమీరను కలిపి తీసుకుంటే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సొంతమవుతాయట. ఈ చిట్కాలు పాటించినా సమస్య తగ్గకపోగా.. కళ్లలో దురద, మంట, ఎరుపెక్కడం.. లాంటి సమస్యలు ఎదురవుతుంటే మాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి అని సూచిస్తున్నారు.

## ప్రకృతి ప్రసాదించిన ఎనర్జీ డ్రింక్: "రాగి అంబలి మజ్జిగ"

వేసవి కాలంలో శరీరానికి అమృతంలా పని చేసే వంటకం 'రాగి అంబలి మజ్జిగ'. ఇది కేవలం దాహం తీర్చే పానీయం మాత్రమే కాదు, అపారమైన పోషకాలున్న సంపూర్ణ ఆహారం. దీనిని పూర్వకాలం నుంచి బలమైన ఆహారంగా పరిగణిస్తారు. రాగులలో క్యాల్షియం, ఐరన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఒంట్లోని వేడిని తగ్గించి, చలువ చేయడంలో రాగి అంబలికి సాటి లేదు. దీనిని మజ్జిగతో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ప్రోబయోటిక్స్, ఎలక్ట్రోలైట్స్ అందుతాయి, దీనివల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. కాగా డయాబెటిస్ ఉన్నవారికి, బరువు తగ్గాలనుకునే వారికి రాగి అంబలి ఒక వరం. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా, కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది, తద్వారా అనవసరమైన ఆకలిని తగ్గిస్తుంది. ఎముకల పుష్టికి, రక్తహీనతను పోగొట్టడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. అందుకే జిమ్‌కు వెళ్లేవారు, క్రీడాకారులు ఎనర్జీ డ్రింక్స్‌కు బదులుగా దీనిని తీసుకోవడం ఉత్తమం.



రాగి అంబలి తయారీ విధానం..

ముందుగా రాగి పిండిని నీళ్లలో కలిపి, మరిగే నీటిలో పోసి దగ్గరకు పడే వరకు ఉడికించాలి. ఈ మిశ్రమం పూర్తిగా చల్లారిన తర్వాత, అందులో పుల్లటి మజ్జిగ, తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, కొత్తిమీర మరియు తగినంత ఉప్పు కలపాలి. కొందరు దీనిని రాత్రే ఉడికించి పెట్టి, మరుసటి రోజు ఉదయం మజ్జిగ కలుపుకుని తాగుతారు (దీనిని పులియబెట్టిన అంబలి అంటారు). ఇది కూడా ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుంది. ప్రస్తుతం మారుతున్న జీవనశైలిలో ప్రజలు మళ్లీ మన పాతకాలపు ఆహారపు అలవాట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకే ఇప్పుడు రాగి అంబలి స్టార్ హోటళ్ల నుండి రోడ్డు పక్కన బండ్ల వరకు ఎక్కడ చూసినా కనిపిస్తోంది. కూల్ డ్రింక్స్‌లో ఉండే రసాయనాలకు దూరంగా ఉండి, ఇలాంటి సహజసిద్ధమైన పానీయాలను అలవాటు చేసుకోవడం వల్ల వేసవి తాపాన్ని జయించడమే కాకుండా దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని పొందవచ్చు.

## కురుల అందానికి కుంకుళ్లు!

కురుల సంరక్షణలో రసాయనాలతో కూడిన షాంపూల కంటే ప్రకృతి సిద్ధంగా లభించే కుంకుడుకాయల వినియోగం ఎంతో మేలైనది. మన పూర్వీకుల కాలం నుంచీ వస్తున్న ఈ పద్ధతి జుట్టును ఆరోగ్యంగా, దృఢంగా ఉంచడమే కాకుండా పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది.

సహజంగా ఈ షాంపూ తయారు చేసుకోవడానికి ఇరవై కుంకుడు కాయలు, ఓ పది శీకాకాయలు, గుప్పెడు ఎండిన ఉసిరి ముక్కలు, ఓ లీటరు నీళ్లు అవసరం. ముందుగా కుంకుడుకాయల్లోని గింజలను తీసేసి, శీకాకాయ, ఉసిరి ముక్కలతో కలిపి నీటిలో రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీటితో సహా వాటిని సన్నని మంటపై మరిగించాలి. నీరు సగం అయ్యే వరకు మరిగిస్తే పోషకాలు బాగా దిగుతాయి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత, చేతులతో బాగా పిసికితే నురగ వస్తుంది. ఆ తర్వాత పల్చని వస్త్రం లేదా జల్లెడతో వడకట్టుకోవాలి. ఈ ద్రవాన్ని ఒక గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ప్రకృతి సిద్ధమైన షాంపూలో ప్రిజర్వేటివ్స్ ఉండవు కాబట్టి ఇది త్వరగా పాడయ్యే ఆస్కారం ఉంటుంది. ఈ షాంపూను ఫ్రిజ్‌లో ఉంచితే 10 నుండి 15 రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఒకవేళ అంతకంటే ఎక్కువ కాలం నిల్వ ఉండాలనుకుంటే, ఈ ద్రవాన్ని ఐస్ ట్రేలో వేసి క్యూబ్స్‌లా మార్చుకోవచ్చు. తలస్నానానికి ముందు రెండు క్యూబ్స్ తీసి కరిగించి వాడుకోవచ్చు. ఇందులో కొన్ని చుక్కల రోజ్‌మేరీ లేదా లావెండర్ ఆయిల్ కలిపితే మంచి సువాసన రావడంతో పాటు నిల్వ సామర్థ్యం స్వల్పంగా పెరుగుతుంది. కుంకుడుకాయలో ఉండే సపోనిన్ అనే పదార్థం తలపై పేరుకుపోయిన మురికినీ, జిడ్డును సహజంగా తొలగిస్తుంది. వీటికి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉండటం వల్ల చుండ్రునీ అదుపులో ఉంచుతుంది. ఈ రసంలో ఉండే ఉసిరి, శీకాకాయలోని పోషకాలు... జుట్టుకు సహజమైన కండిషనర్‌లా పనిచేసి, పట్టులా మెరిసేలా చేస్తాయి. రసాయనాలు లేకపోవడం వల్ల వెంట్రుకల కుదుళ్లు దృఢంగా మారి, జుట్టు రాలడం క్రమంగా తగ్గుతుంది. తెల్ల జుట్టు రాకుండానూ ఈ షాంపూ కాపాడుతుంది.




## పుచ్చకాయ.. ఎప్పుడు తినాలి?

ఎండలు మండిపోతున్నాయి.. ఎన్ని నీళ్లు తాగినా శరీరంలోని తేమ చెమట రూపంలో ఆవిరైపోతోంది. అయినా డీహైడ్రేషన్ బారిన పడకుండా నీళ్లు తాగుతూ, నీటి శాతం అధికంగా ఉండే పండ్లు, కాయగూరల్ని ఆహారంలో చేర్చుకుంటున్నాం. వీటిలో పుచ్చకాయ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. నీటి శాతం, పోషకాలు అధికంగా ఉండే ఈ పండును ఇష్టపడని వారుండరు. అయితే దీన్ని భోజనం తర్వాత తీసుకోవడం వల్ల కడుపుబ్బరం వేధిస్తుందంటూ పలువురు చెబుతుంటారు. దీనివల్ల ఆయాసంగా అనిపిస్తుందంటుంటారు. మరి, ఇది ఎంత వరకు నిజం? అసలు ఎందుకిలా జరుగుతుంది? పుచ్చకాయ తినడానికి సరైన సమయం ఏది? వీటి గురించి నిపుణులేమంటున్నారో తెలుసుకుందాం రండి..

మనం నీళ్లు ఎక్కువగా తాగినప్పుడు ఎలాగైతే కడుపు నిండుగా అనిపిస్తుందో.. పుచ్చకాయ తిన్న తర్వాత కూడా ఇలాంటి భావనే కలుగుతుంది. ఎందుకంటే ఈ పండులో 90 శాతానికి పైగా నీళ్లు ఉండడమే కారణం. అయితే దీన్ని సాధారణ సమయాల్లో కాకుండా భోజనం తర్వాత తీసుకోవడం వల్ల కడుపుబ్బరంగా అనిపిస్తుందని పలువురు చెబుతుంటారు. ఇందుకు కారణం దీన్ని తీసుకున్న సమయమే అంటున్నారు నిపుణులు. సాధారణంగా మనం తీసుకున్న ఆహారం జీర్ణమవడానికి కొన్ని గంటల సమయం పడుతుంది. అదే పుచ్చకాయ త్వరగా అరిగిపోతుంది. ఆలస్యంగా జీర్ణమయ్యే పదార్థాలతో ఇది కలిసినప్పుడు అరగకుండా పొట్టలో అలాగే ఉండిపోతుందట. అలాగే పుచ్చకాయలోని అధిక నీటి శాతం పొట్టలోని ఆమ్లాలతో కలిసి జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుందట. ఫలితంగా పుచ్చకాయలోని కొన్ని రకాల కార్బోహైడ్రేట్లు పొట్టలో గ్యాస్‌కు కారణమవుతాయని.. దీనివల్ల కడుపునొప్పి, కడుపుబ్బరం.. వంటివి వేధిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా జీర్ణ సంబంధిత, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్న వారిలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందంటున్నారు.



పుచ్చకాయ వల్ల కడుపుబ్బరం సమస్య రాకుండా ఉండాలంటే మోతాదు, తీసుకునే సమయం.. రెండూ ముఖ్యమేనంటున్నారు నిపుణులు. ఎలాగూ ఈ పండు ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎంత పడితే అంత తింటుంటారు కొందరు. దీనివల్ల కూడా గ్యాస్ట్రిక్, కడుపుబ్బరం.. వంటి సమస్యలు రావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి కప్పు పుచ్చకాయ ముక్కలు (సుమారు 150 గ్రాములు) తీసుకోవడం మంచిదంటున్నారు. అలాగే భోజనం, అల్పహారం.. ఇలా ఏదైనా తిన్న వెంటనే కాకుండా.. ఉదయం 10–12 గంటల మధ్యలో, సాయంత్రం 5 గంటల్లోపు.. ఇలా రోజుకు రెండుసార్లు కప్పు చొప్పున తీసుకోవడం మేలంటున్నారు. ఈ పండును పరగడుపున తీసుకోవడం మరీ మంచిదట. దీనివల్ల ఇందులోని పోషకాల్ని శరీరం సులభంగా గ్రహిస్తుందట. ముఖ్యంగా పుచ్చకాయలోని లైకోపీన్, విటమిన్ 'సి' శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచేందుకు, జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచేందుకు తోడ్పడతాయంటున్నారు నిపుణులు.

వ్యాయామం చేయడం వల్ల వచ్చే చెమట ద్వారా శరీరం ఎలక్ట్రోలైట్లను కోల్పోతుంది. వీటిని తిరిగి పొందాలంటే పుచ్చకాయ చక్కటి ఎంపిక అంటున్నారు నిపుణులు. కాబట్టి వ్యాయామం చేశాక ఈ పండు తినడం మంచిదంటున్నారు. అదే వ్యాయామానికి రెండు గంటల ముందు తినడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్లు బ్యాలన్స్ అవుతాయని చెబుతున్నారు. అర్ధరాత్రి కూడా ఈ పండు తినడం శ్రేయస్కరం కాదంటున్నారు నిపుణులు. దీనివల్ల కూడా అరుగుదల నెమ్మదిగా జరిగి గ్యాస్ట్రిక్, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు. అలాగే జీర్ణ సంబంధిత, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడే వారు.. భోజనం తర్వాత కాకుండా పరగడుపున, సాయంత్రం స్నాక్ సమయంలో, అది కూడా మితంగా తీసుకోవడం మేలంటున్నారు. పుచ్చకాయ వల్ల గ్యాస్ట్రిక్, కడుపుబ్బరం.. వంటి సమస్యలు రాకుండా ఉండాలంటే తినేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. పాలు తాగాక, ఫ్రైడ్ ఫుడ్, జంక్ ఫుడ్.. వంటివి తిన్నాక ఈ పండు తీసుకోకూడదట! దీనివల్ల కూడా ఆయా సమస్యలు తీవ్రమవుతాయంటున్నారు నిపుణులు. కొంతమంది పుచ్చకాయ ముక్కలు కట్ చేసి ఫ్రిజ్‌లో పెట్టుకొని చల్లగా అయ్యాక తింటుంటారు. ఇది కూడా ఆరోగ్యకరం కాదంటున్నారు నిపుణులు. దీనివల్ల జీర్ణ సమస్యలొచ్చే ప్రమాదం ఎక్కువంటున్నారు. పుచ్చకాయను బాగా నమిలి తినమంటున్నారు నిపుణులు. తద్వారా సులభంగా జీర్ణమవుతుందని చెబుతున్నారు. కాబట్టి ఇవన్నీ దృష్టిలో ఉంచుకోవడంతో పాటు ఈ పండు తిన్నాక ఏవైనా సమస్యలు ఎదురైనా, ఇతర సందేహాలున్నా డాక్టర్‌ని అడిగి నివృత్తి చేసుకోవడం మేలంటున్నారు నిపుణులు.

## చిన్న ఎన్‌బీఎఫ్‌సీలకు రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపు

రూ.1,000 కోట్ల కంటే తక్కువ ఆస్తుల పరిమాణం కలిగి, ప్రజల నిధులను వినియోగించుకోని, డిపాజిట్లు స్వీకరించని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) జులై 1 నుంచి రిజిస్ట్రేషన్, రిజర్వ్ ఫండ్ అవసరాల నుంచి మినహాయింపునకు అర్హత పొందుతాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఎన్‌బీఎఫ్‌సీలు పాటించాల్సిన నిబంధనలను తగ్గించడానికి కేంద్ర బ్యాంకు ఈ విషయమై ఒక సర్క్యులర్ జారీ చేసింది. ప్రజల నిధులను వినియోగించుకోని, ఎటువంటి కస్టమర్ ఇంటర్‌ఫేస్ లేని, తాజా ఆడిట్ బ్యాలెన్స్ షీట్ ప్రకారం, రూ.1,000 కోట్ల కంటే తక్కువ ఆస్తుల పరిమాణం కలిగిన ఎన్‌బీఎఫ్‌సీలకు 1934 ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఐఏ, 45ఐసీ నిబంధనల నుంచి 2026 జులై 1 నుంచి మినహాయింపు ఇవ్వనున్నట్లు పేర్కొంది.




# నష్టాల్లో ముగిసిన సూచీలు..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఇరాన్ ఓడరేవులపై దీర్ఘకాలం పాటు దిగ్బంధనం కొనసాగించేందుకు అమెరికా అధ్యక్షుడు నిర్ణయించడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఓ దశలో ఏకంగా 120 డాలర్లు దాటింది. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు, రూపాయి విలువ పతనం మన సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో వెయ్యి పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 24 వేల దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లు పతనమై రూ.469 లక్షల కోట్ల నుంచి రూ.464 లక్షల కోట్లకు క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 77,014.21 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,496.36) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,258.86 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 582.86 పాయింట్ల నష్టంతో 76,913.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 180.10 పాయింట్ల నష్టంతో 23,997.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం ఓ దశలో 95 మార్కు దాటి 94.90కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 4,634 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# మళ్లీ భగ్గుమన్న చమురు ధరలు..

ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధించడంతో చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ఇరాన్ అణుఒప్పందం చేసుకునే వరకు హార్మూజ్ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడంతో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దీంతో అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 6 శాతం పెరిగి, 120 డాలర్లు దాటింది. 2022 తర్వాత ఇంతగా పెరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. నేడు ఒక దశలో 125 డాలర్లకు కూడా ఎగబాకింది.



అమెరికా హార్మూజ్‌ను దిగ్బంధించడంతో చమురు ధరలు పెరిగాయని ట్రంప్ యంత్రాంగాన్ని ఉద్దేశించి ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ వ్యంగ్యంగా స్పందించారు. మూడు రోజుల్లో ఇరాన్ చమురు బావులు పేలుతాయని ఏప్రిల్ 26న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేశారు. ''మూడు రోజులు అయింది. అలాంటిది ఏమీ జరగలేదు. దానిని 30 రోజులకు పొడిగించి, ప్రత్యక్ష ప్రసారం చేయండి '' అని ఘాలిబఫ్ పోస్టు పెట్టారు. ''స్కాట్ బెసెంట్ (అమెరికా ఆర్థికమంత్రిని ఉద్దేశించి) వంటివారు దిగ్బంధనం వంటి సలహాలను ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే చమురు ధర ఒక బ్యారెల్‌కు 120 డాలర్లు దాటింది. నెక్ట్స్ స్టాప్ 140 డాలర్లు'' అని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే.. హార్మూజ్‌ను తెరుస్తామంటూ ఇరాన్ (Iran) పట్టుబడుతోంది. అయితే ఆ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. 'అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం. అది వారిని తీవ్రంగా భయపెట్టనుంది. అది వారి పక్కనే ఉంది. దానితో వారికి గుండెపోటు కూడా రావొచ్చు' అని ఇరాన్ హెచ్చరికలు చేసింది. దాంతో రెండు దేశాల ఘర్షణలు ఏ స్థాయికి చేరుకుంటాయోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఇన్ఫోసిస్‌లో లేఆఫ్‌లేవ్: సీఈఓ




కృత్రిమ మేధ ప్రభావంతో దిగ్గజ కంపెనీల్లో కొనసాగుతోన్న లేఆఫ్‌లు ఆందోళనకు గురిచేస్తోన్న వేళ.. ఇన్ఫోసిస్ గుడ్‌న్యూస్ చెప్పింది. తమ సంస్థల్లో ఉద్యోగుల తొలగింపులు చేపట్టబోమని వెల్లడించింది. రానున్న రోజుల్లో కొత్త నియామకాలు, నైపుణ్యాల పెంపుపై తమ కంపెనీ (Infosys) దృష్టిసారించనున్నట్లు తెలిపింది. గతేడాది ఇన్ఫోసిస్‌లో ఎలాంటి లేఆఫ్‌లు చేపట్టలేదని కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్ మనీకంట్రోల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ తొలగింపులు ఉండబోవని వెల్లడించారు. ఏఐ రాకతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో కొన్ని మార్పులు ఉన్నప్పటికీ.. కృత్రిమ మేధతో పని పరిధి మరింత విస్తరిస్తుందన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాల కోతలు ఉండబోవని అభిప్రాయం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధను అందిపుచ్చుకుని తమ ఉద్యోగులకు ఆ నైపుణ్యాల్లో మరింత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో కంపెనీ కనీసం 20,000 మంది ఫ్రెషర్లను నియమించుకునే ప్రణాళికలో ఉందని ఇటీవల ఇన్ఫీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా.. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా టెక్ కంపెనీల్లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఏఐ సేవల కోసం బిగ్ టెక్ కంపెనీలు డేటా సెంటర్లు, ఇతర మౌలిక వసతులకు బిలియన్ల కొద్దీ డాలర్లను కుమ్మరించాల్సి వస్తోంది. దీంతో ఆయా కంపెనీలు ఖర్చు తగ్గింపు పనిలో పడ్డాయి. ఇప్పటికే మెటా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు ఈ ఏడాదికి కోతలను ప్రకటించాయి

# వాహన ఉద్గార నిబంధనలకు సవరణలు



దిల్లీ: పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ వాటాను పెంచడం, ప్రత్యామ్నాయ ఇంధనాల పరిధిని విస్తృతం చేస్తూ, అన్ని వాహన వర్గాల్లో ఫ్లెక్స్-ఫ్యూయల్, స్వచ్ఛమైన బయోఫ్యూయల్‌కు మార్గం సుగమం చేసేందుకు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వాహన ఉద్గార నిబంధనలకు సవరణలు ప్రతిపాదించింది. ఇ85 (పెట్రోల్‌తో 85% ఇథనాల్ మిశ్రమం), ఇ100 (వాహనాలను దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్‌తో నడపడానికి అనుమతించేది), బి100 బయోడీజిల్, హైడ్రోజన్-సీఎన్‌జీ కలయికల వంటి ఇంధనాల వినియోగానికి వీలు కల్పించడమే.. కేంద్ర మోటారు వాహనాల నియమాలు 1989కి చేసిన ముసాయిదా మార్పుల లక్ష్యంగా ఉంది. తేలికపాటి వాణిజ్య వాహన బరువు పరిమితిని 3,000 కిలోల నుంచి 3,500 కిలోలకు పెంచాలనీ ప్రతిపాదించారు. ఇకపై మరిన్ని వ్యాన్‌లు, పికప్‌లు, చిన్న ట్రక్కులు ఒకే రకమైన ఉద్గార పరీక్షా నిబంధనల పరిధిలోకి వస్తాయి. ఈ నెల 27న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. తాజా ప్రతిపాదనలపై 30 రోజులు ప్రజలు, సంబంధితులు అభిప్రాయాలు తెలపొచ్చు.

# పాత పీఎఫ్ ఖాతాలకు మళ్లీ ప్రాణం

## ఇ-ప్రాప్తి పేరుతో కొత్త వెబ్ పోర్టల్




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) చందాదారుల కోసం ఒక శుభవార్త. ఏళ్ల తరబడి మూలనపడిన, మర్చిపోయిన పాత పీఎఫ్ ఖాతాలను ఆధార్ ద్వారా గుర్తించి, వాటికి మళ్లీ ప్రాణం (యాక్టివేట్) పోసేందుకు ఇ-ప్రాప్తి పేరుతో సరికొత్త డిజిటల్ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బుధవారం వెల్లడించారు. ఈ కొత్త పోర్టల్ ద్వారా పత్రాల సమర్పణ, వ్యక్తుల ప్రమేయం తగ్గి.. సేవల్లో పారదర్శకత, సామర్థ్యం పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోర్టల్‌కు ఇ-ప్రాప్తి (ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆధార్-బేస్డ్ యాక్సెస్ పోర్టల్ ఫర్ ట్రాకింగ్ ఇనాపరేటివ్ అకౌంట్స్) అని పేరు పెట్టినట్లు తెలిపారు. చాలామంది ఉద్యోగులు కంపెనీలు మారినప్పుడు పాత పీఎఫ్ ఖాతాల్లోని చిన్న మొత్తాలను బదిలీ చేసుకోకుండా అలాగే వదిలేస్తుంటారు. 2024 ఆర్థిక సంవత్సరం చివరికి ఇలాంటివి 21.55 లక్షల నిష్క్రియ ఖాతాలు ఉన్నట్లు, వాటిలో ఏకంగా రూ.8,505 కోట్లకు పైగా నిధులున్నాయని అంచనా. 2019 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఇది 5 రెట్లు అధికం. ఈ సమస్య పరిష్కారానికి ఇ-ప్రాప్తి పోర్టల్ తోడ్పడనుంది. ఆధార్ ద్వారా సురక్షితంగా లాగిన్ అయ్యి, పాత ఖాతాలను లింక్ చేసుకుని, నిధులను సంబంధిత చందాదార్లు తిరిగి పొందొచ్చు. ఇ-ప్రాప్తి పోర్టల్ ఈపీఎఫ్ఓ పోర్టల్ 3.0 డిజిటల్ పరివర్తనలో ఒక కీలక భాగం. సేవలను మరింత వేగవంతం చేసి, వ్యక్తుల ప్రమేయాన్ని తగ్గించేందుకు, యాంత్రికంగా క్లెయిముల చెల్లింపులు, యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలు, సెంట్రల్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ (సీపీపీఎస్) వంటి పలు నూతన విధానాలను సంస్థ అందుబాటులోకి తీసుకురానుంది. దీనిద్వారా దేశంలో డిజిటల్ ఆర్థిక సేవలు మరింత బలోపేతం అవుతాయని భావిస్తున్నారు.




## 'ఈ-సిగరెట్' వివాదం.. రియాన్ పరాగ్ మ్యాచ్ ఫీజులో 25శాతం కోత



డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ (వేపింగ్) తాగిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌పై బీసీసీఐ చర్యలకు ఉపక్రమించింది. అతడి మ్యాచ్ ఫీజులో జరిమానాతోపాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. ఆటగాళ్లు, జట్టు అధికారుల కోసం ఉద్దేశించిన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1ను ఉల్లంఘించినందుకు పరాగ్‌కు మ్యాచ్‌లో 25 శాతం ఫైన్‌తోపాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. రియాన్ తన తప్పును అంగీకరించినట్లు బీసీసీఐ ప్రకటన విడుదల చేసింది. మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ విధించిన శిక్షను పరాగ్ అంగీకరించాడని బీసీసీఐ పేర్కొంది. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా.. పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ తాగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. 2019లో ఈ-సిగరెట్ల తయారీ, విక్రయాలను భారత ప్రభుత్వం నిషేధించింది. దీనిని ఉల్లంఘించిన వారు ఏడాది జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానాకు గురవుతారు. రియాన్ పరాగ్ వేపింగ్ వ్యవహారంపై రాజస్థాన్ యాజమాన్యం ఇంకా స్పందించలేదు.

## ఇలాంటి ఆటగాడితో ఎప్పుడూ ఆడి ఉండను..

# అభిషేక్‌పై హెడ్ ప్రశంసలు



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మపై సహచర ఆటగాడు ట్రావిస్ హెడ్ ప్రశంసలు కురిపించాడు. అభిషేక్ స్పిన్‌ను బాగా ఆడతాడని, స్పిన్ బౌలింగ్‌లో ఇంతకంటే ఎక్కువ విరుచుకుపడే బ్యాటర్‌తో ఎప్పుడూ ఆడి ఉండనని హెడ్ పేర్కొన్నాడు. బుధవారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 'ట్రావిషేక్' సిక్స్‌లు, ఫోర్లతో చెలరేగిపోయారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 52 బంతుల్లోనే 129 పరుగులు జోడించి జట్టు విజయానికి గట్టిపునాది వేసింది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ గెలిచిన అనంతరం స్టార్ స్పోర్ట్స్‌తో హెడ్ మాట్లాడాడు. 'స్పిన్నర్లు బౌలింగ్ వస్తే అభిషేక్‌కే స్ట్రైక్ ఇవ్వడానికి ఇష్టపడతాను. బహుశా నేను ఇప్పటివరకు ఇంతకంటే బాగా స్పిన్‌ను ఆడగలిగే బ్యాటర్‌తో ఆడి ఉండను. స్పిన్నర్ల బౌలింగ్‌ను తుత్తునియలు చేయడంలో నేను చూసిన అత్యుత్తముల్లో అభిషేక్ ఒకడు. అతను దూకుడుగా ఆడుతూ జట్లపై ఒత్తిడిని పెంచుతాడు. ఇది ఒక గొప్ప భాగస్వామ్యం. మేము ఎక్కువగా మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు' అని హెడ్ పేర్కొన్నాడు.
ఈ సీజన్ మొదటి భాగంలో కాస్త వెనుకబడిన ట్రావిస్.. తిరిగి ఫామ్ అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేశాడు. 'జట్టు విజయానికి తోడ్పడటం సంతోషంగా ఉంది. ఐపీఎల్‌లో వరుసగా ఐదు విజయాలు సాధించడమనేది చాలా తక్కువసార్లు జరుగుతుంది.
ప్రస్తుతం జట్టు గొప్ప మానసిక స్థితిలో ఉంది. ఈ టోర్నమెంట్‌లో పోటీతత్వం ఎక్కువ. ప్రతిసారి భారీ స్కోర్లు చేసి అన్ని మ్యాచ్‌లు గెలవలేం. ఒక్కరిద్దరూ కాకుండా జట్టంతా సమష్టిగా ఆడి మరో రెండు, మూడు మ్యాచ్‌లు గెలిస్తే ఏడెనిమిది విజయాలతో ప్లే ఆఫ్స్‌కు చేరినట్లే' అని ట్రావిస్ హెడ్ వివరించాడు.

# అతడూ మనిషే..: ముంబయి కోచ్



ఎనిమిది మ్యాచులు.. 180 బంతులు.. కేవలం రెండే వికెట్లు.. ఇవేవో కొత్తగా వచ్చిన బౌలర్ గణాంకాలు కావు. టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 2026 ఐపీఎల్ సీజన్‌లో నమోదు చేసిన స్టాట్స్. వికెట్లు తీయలేకపోవడంతోపాటు భారీగా పరుగులు సమర్పించడం గమనార్హం. పిచ్‌తో సంబంధం లేకుండా రన్స్ నియంత్రించడం లేదా కీలక సమయంలో వికెట్ అందించడం చేసేవాడు. కానీ, ఈసారి అలా జరగడం లేదు. అయితే, బుమ్రా బౌలింగ్ వైఫల్యంపై ముంబయి కోచ్ కీరన్ పొలార్డ్ స్పందించాడు. తమ జట్టు అతడికి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశాడు. ''ఎవరైనా క్రికెటర్ సరిగా ప్రదర్శన చేయలేకపోతే.. వెంటనే ప్రతి చిన్న విషయాన్ని పరిశీలించడం మొదలుపెడతాం. ఎందుకు అతడు సరిగా ఆడలేకపోతున్నాడనే దానిపై విశ్లేషణలు చేసేస్తుంటాం. ఇందుకు జస్‌ప్రీత్ బుమ్రా కూడా మినహాయింపేమీ కాదు. గత కొన్నేళ్లుగా అతడు ఏం చేశాడో మనం చూశాం. అతడు కూడా మనిషే కదా.. బుమ్రా కూడా మిస్టేక్స్ చేసేందుకు ఆస్కారం ఉంటుంది. మంచి రోజు కాకపోవచ్చు.. మంచి సీజన్ కాకపోవచ్చు.. కొన్ని నెలలు కలిసి రాకపోవచ్చు.. ఇలాంటప్పుడే గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. అదే సమయంలో వర్తమానంలో ఉండేందుకు ప్రయత్నించాలి. బుమ్రా తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. అయినా, ఇప్పటికీ అతడు ప్రపంచంలోనే నంబర్‌వన్ బౌలర్. ముంబయి ఇండియన్స్‌కూ కీలక బౌలర్'' అని పొలార్డ్ తెలిపాడు. ''ఈ సీజన్‌లో జట్టుగా మేం నిలకడ ప్రదర్శించలేకపోయాం. ఫలితాలే అందుకు తార్కాణం. ఈ విషయంలో మేం సిగ్గుపడాల్సిన అవసరం లేదు. జట్టుగా మేం ఇంకాస్త మెరుగ్గా ఆడాల్సిందే. మ్యాచ్ గెలవాలంటే ఆసాంతం ఆధిపత్యం ప్రదర్శించాలి. అలా జరగకపోతే విజయం సాధించడం కష్టం. మా డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం ఎప్పుడూ ఉత్సాహంగానే ఉంటుంది.

కేవలం 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ బౌలర్లపై చేయించారా? బ్యాట్‌తో అద్భుతాలు చేయడానికే వచ్చాడా?' అని అడిగా (నవ్వుతూ). కానీ, అతడు నిజంగానే మనిషి. వైభవ్ చాలా బ్రిలియంట్. ప్రతిఒక్కరూ సీరియస్‌గా దృష్టిపెట్టాల్సిన క్రికెటర్. తప్పకుండా అతడిని ఈ సమ్మర్‌కు ఇంగ్లాండ్‌లో చూస్తామని అనుకుంటున్నా'' అని స్టువర్ట్ బ్రాడ్‌తో బట్లర్ అన్నాడు. ప్రపంచంలోనే అత్యంత ఉత్తమ పేసర్లుగా పేరొందిన జస్‌ప్రీత్ బుమ్రా, హేజిల్‌వుడ్, కమిన్స్ బౌలింగ్‌లో తొలిబంతిని వైభవ్ సూర్యవంశీ బౌండరీగా మలచడం గమనార్హం. దానిని బట్లర్ గుర్తుచేసుకుంటూ.. ''ఐపీఎల్‌లో మ్యాచ్ లేనప్పుడు గదిలోనే ఉంటూ ఫోన్ చూస్తూ గడుపుతుంటాను. నేను ఇన్‌స్టాగ్రామ్‌లో అలా స్క్రోల్ చేస్తూ ఉంటే రాజస్థాన్ - సన్‌రైజర్స్ మ్యాచ్ అనంతరం ఓ ప్రెజెంటేషన్ వీడియో నా కంట పడింది. పాట్ కమిన్స్ ఆడిన తొలి మ్యాచ్ అదే.

# అతడు మనిషా.. ఏఐ క్రియేషనా?:

## వైభవ్‌పై బట్లర్ ప్రశంసలు



ఆధిపత్యం ప్రదర్శిస్తోన్న వైభవ్ సూర్యవంశీపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సీజన్‌లో అప్పుడే 400 పరుగుల మార్క్‌ను టచ్ చేశాడు. ఈ క్రమంలో అతడిని ఉద్దేశించి పాక్‌కు చెందిన క్రికెట్ అనలిస్ట్ ఒకరు 'ఏఐ' చిప్ ఉన్న బ్యాట్‌ను వాడుతున్నాడంటూ ఆరోపణలు చేశాడు. దానికి మన దగ్గర నుంచి గట్టిగానే కౌంటర్ పడింది. ఇప్పుడు తాజాగా వైభవ్‌ను ఏఐతో ఏమైనా తయారుచేశారా? అంటూ స్టార్ క్రికెటర్ ఒకరు సరదాగా వ్యాఖ్యానించడం గమనార్హం. రాజస్థాన్ రాయల్స్ బౌలర్ జోఫ్రా ఆర్చర్‌కు సందేశం పంపినట్లు గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ జోస్ బట్లర్ తెలిపాడు. వీరిద్దరూ ఇంగ్లాండ్ జట్టు సహచరులు. ''నేను జోఫ్రాకు సరదాగా ఓ టెక్ట్స్ మెసేజ్ చేశా. 'వైభవ్ ఏమైనా ఏఐనా? ఎలాన్ మస్క్ ప్రత్యేకంగా తయారు

# ప్రేక్షకులకు బోర్ కొడితే

## ఇక అంతే: ముత్తయ్య

గత ఐదు సీజన్ల నుంచి 200+ స్కోర్లు అలవోకగా నమోదవుతున్నాయి. ఇక భారీ లక్ష్యాలనూ కాపాడుకోవడంలో బౌలర్లు చేతులెత్తేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 30 సార్లకు పైగా రెండొందల స్కోర్లు నమోదైన సంగతి తెలిసిందే. ఇక 264, 244 పరుగుల టార్గెట్‌నూ ప్రత్యర్థి జట్లు ఛేదించాయి. దీంతో బౌలర్లకు మరీ కష్టం కావడంపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది. క్రికెట్



వృద్ధి కంటే అభిమానులను ఎంటర్‌టైన్‌మెంట్ చేయడం, స్పాన్సర్లు, వ్యూయర్స్ ఆసక్తే కీలక పాత్ర పోషిస్తుందనే వాదనా ఉంది. దీనిపై సన్‌రైజర్స్ హైదరాబాద్ స్పిన్ బౌలింగ్ కోచ్ ముత్తయ్య మురళీధరన్ స్పందించాడు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడటమూ ఓ ప్రధాన కారణమని ముత్తయ్య అభిప్రాయపడ్డాడు. ''ఇది కచ్చితంగా పిచ్ వల్లే జరుగుతోంది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు వేగంగా పరుగులు రాబడుతున్నారు. బౌలర్లకు అంతగా సహకారం లభించడం లేదు. మరోవైపు బౌండరీ సైజ్ కూడా చిన్నది కావడం బౌలర్లకు కష్టంగా మారింది. అ ఇటు బౌలింగ్‌కూ సహకరించేలా పిచ్‌ను రెడీ చేస్తే.. ప్రేక్షకులు బోర్ కొడుతుంద చెప్పే ప్రమాదం లేకపోలేదు. ఐపీఎల్ స్ట్రక్చర్ అలానే ఉంది. ఈ విషయంలో బౌలర్లను తప్పు పట్టాల్సిన అవసరం లేదు. 2020 నుంచి మ్యాచులు చూసేవార ఇందులో ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఎక్కువగా ఆశిస్తారు. అందుకే ఫోర్లు, సిక్స్‌లు చూడాలని కోరుకుంటారు. అలాంటి వారికోసం ఐపీఎల్‌లో చాలా మార్పులు చేశారు. ఇంపాక్ట్ రూల్‌తో అదనంగా బ్యాటర్ రావడం వల్ల.. స్కోరుబోర్డుపై కనీసం 200 మార్క్ కనిపిస్తోంది. ఈ మెగా లీగ్ ఆవిర్భావం వెనక చాలా అంశాలు ఉంటాయి. క్రికెట్‌ను అభివృద్ధి చేస్తున్నారా? లేదా అనేది ఇక్కడ విషయమే కాదు. క్రికెటర్లకు అవకాశాలు వస్తున్నాయి. అభిమానులకు ఎంటర్‌టైన్‌మెంట్ దొరుకుతుంది. ప్రస్తుతం ఇది పెద్ద వ్యాపారం. స్పాన్సర్లు కీలకం. ఆట విసుగు తెప్పిస్తే.. ప్రజలు లీగ్‌కు దూరమవుతారు. అప్పుడు స్పానర్లతోపాటు వ్యూయర్స్‌నూ కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుంది'' అని ముత్తయ్య విశ్లేషించాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## డాక్టర్ కీర్తి ఎంబీబీఎస్ ఎంఎస్ టీజర్

**వుదయం సినిమా :** గోపాలకృష్ణ దొండపాటి సమర్పణలో స్వర్ణ క్రియేషన్స్ బ్యానర్ పై మలయాళ స్టార్ హీరోయిన్ భావన ప్రధాన పాత్రలో నటించిన మలయాళ చిత్రం హంట్ తెలుగులో "డాక్టర్ కీర్తి", ఎంబీబీఎస్ ఎంఎస్ అనే పేరుతో అనువాదమవుతోంది. మలయాళ దర్శకుడు షాజీ కైలాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ సంచలనం సృష్టించిన కలకత్తాలోని జరిగిన డాక్టర్ రేప్ మర్డర్ నేపధ్యం గా తెరకెక్కించారు. మలయాళంలో సూపర్ హిట్ అయిన ఈ చిత్రాన్ని స్వర్ణ క్రియేషన్స్ రెండు తెలుగు రాష్ట్రాల్లో పీవీఆర్ సినిమాస్ తో భారీ ఎత్తున మే 8న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు నిర్మాతలు స్వర్ణకుమారి దొండపాటి, ఎం విశ్వనాథ్ రెడ్డి. ఈ రోజు ఈ చిత్ర టీజర్ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు.



## పెద్ది రిలీజ్ డేట్‌పై గుడ్ న్యూస్



**వుదయం సినిమా :** మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న చిత్రం పెద్ది. బుచ్చిబాబు సనా డైరెక్షన్‌లో వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రాన్ని జూన్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామి బుచ్చిబాబు ఇటీవలే ఓ ఈవెంట్‌లో ప్రకటించారు. ఓ ఐటమ్ సాంగ్ షూట్ పెండింగ్‌లో ఉండగా.. దాదాపు అది కూడా ఈ రోజుతో పూర్తయింది. దీంతో మూవీ టీమ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్నారు. అయితే పెద్ది మూవీ కాస్తా త్వరగానే ప్రేక్షకుల ముందుకు రానుందని నెట్టింట టాక్ వినిపిస్తోంది. జూన్ 4 రిలీజ్ చేయాలని మేకర్స్ ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఎందుకంటే ఆ రోజు విడుదల కావాల్సిన యశ్ టాక్సిక్ ఊహించినట్లే వాయిదా పడింది. దీంతో పెద్దిని 4 వ తేదీని రిలీజ్ చేసే ప్లాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మెగా ఫ్యాన్స్‌కు పండగే. అనుకున్న టైమ్ కంటే ముందుగానే పెద్దిని బిగ్ స్క్రీన్‌పై చూసే అవకాశం రానుంది. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## శ్రీనివాసకావ్యాణం

### తిరుమలలో ఘనంగా జరిగిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కావ్య వివాహం





**వుదయం సినిమా :** ఆధ్యాత్మికతతో కూడిన పవిత్ర తిరుమలలో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య వివాహ బంధంలో అడుగుపెట్టారు. కర్ణాటక భవన్‌లో జరిగిన ఈ వేడుక సంప్రదాయం, ప్రేమ, కుటుంబ అనుబంధాలతో ఓ అద్భుతమైన వేడుకగా నిలిచింది. బెల్లంకొండ శ్రీనివాస్ – కావ్య వివాహ కార్యక్రమాలు సనాతన ధర్మాన్ని అనుసరించి, అన్ని సంప్రదాయ క్రతువులతో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇరువురు కుటుంబ సభ్యులు ప్రతి ఆచారంలో పాల్గొంటూ ఈ వేడుకకు ప్రత్యేకతను తీసుకువచ్చారు. ఇది సంప్రదాయాల గౌరవం, ఆధునికత కలిసిన ఓ అందమైన వేడుకగా నిలిచింది. వేదికను ఆలయ వాతావరణాన్ని ప్రతిబింబించేలా అద్భుతంగా అలంకరించారు. పూల అలంకరణలు, స్వర్ణ వర్ణ అలంకారాలు, సంప్రదాయ అలంకరణ కలిసి ఒక పవిత్రమైన దృశ్యంగా నిలిచాయి. ఈ వేడుకలో సంప్రదాయాలకు ఇచ్చిన గౌరవం స్పష్టంగా కనిపించింది. వధూవరుల కోసం ప్రత్యేకంగా డిజైనర్ శ్రవణ్ కుమార్ రూపొందించిన వస్త్రాలు వేడుకకు మరింత అందాన్ని తెచ్చాయి. కావ్య అందమైన పట్టు చీరలో, నాజూకైన ఆభరణాలతో మెరిశారు, సాయి శ్రీనివాస్ సంప్రదాయ వేషధారణలో క్లాసిక్‌గా కనిపించారు. వారి ఆనందం, అనుబంధం ప్రతి క్షణాన్ని మరింత మధురంగా మార్చింది. సన్నిహిత కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో జరిగిన ఈ వివాహం ఎంతో ఆత్మీయంగా సాగింది. ఆశీర్వాదాలు, సంప్రదాయాలు, వైభవం అన్నీ కలిసి ఈ వేడుకని మరింత ప్రత్యేకంగా నిలిపాయి. రేపు హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించనున్నారు. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, స్నేహితులు, ఆత్మీయులు పాల్గొనే ఈ కార్యక్రమం మరింత వైభవంగా జరగనుంది. ఈ ఆనంద క్షణాలకు మరో అందమైన అధ్యాయంగా రిసెప్షన్ నిలవనుంది.









## వైల్డ్ ఫస్ట్ లుక్




**వుదయం సినిమా :** వెర్సటైల్ యాక్టర్ రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో "వైల్డ్" అనే సినిమా రాబోతోంది. వయోలెంట్ సైకో థ్రిల్లర్ గా ఈ చిత్రాన్ని టాలెంటెడ్ డైరెక్టర్ సాయిరాం దాసరి రూపొందించనున్నారు. ఈ చిత్రాన్ని ఓవా ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రవి పీట్ల నిర్మించనున్నారు. త్వరలో "వైల్డ్" మూవీ లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకుని రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఈ రోజు ఈ చిత్ర అనౌన్స్ మెంట్ తో పాటు ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. "వైల్డ్" మూవీ మోషన్ పోస్టర్ లో రక్తంతో తడిసిపోయిన వయలెంట్ లుక్ లో రాజా రవీంద్ర కనిపించడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమా గురించి మరిన్ని వివరాలు త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

## మే 7న రాక్షసపురం



**వుదయం సినిమా :** ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ చిత్రాన్ని మే 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాత కేఎస్ రామారావు అధికారికంగా ప్రకటించారు. విభిన్నమైన నటనతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజ్ బి శెట్టి ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఇన్ స్పెక్టర్ పాత్రలో నటించారు. డాక్టర్ రవి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఒక ఉత్కంఠభరితమైన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇన్వెస్టిగేషన్ డ్రామా నేపథ్యంలో సాగే కథనం ప్రేక్షకులను అడుగడుగునా థ్రిల్‌కు గురి చేస్తుంది. విడుదల తేదీ మార్పుపై నిర్మాత కేఎస్ రామారావు స్పందిస్తూ.. "ఈ సినిమాలోని మేకింగ్ విలువలు, సస్పెన్స్ ఎలిమెంట్స్ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. అందుకే ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నాం. సినిమాను మే 1న విడుదల చేయాలని ముందుగా అనుకున్నప్పటికీ, మరిన్ని మెరుగైన థియేటర్లు, గరిష్ట స్థాయిలో ప్రేక్షకులకు చేరువయ్యేలా చేసేందుకు వీలుగా మే 7న విడుదల చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా ఈ తేదీ సినిమాకు కలిసి వస్తుందని భావిస్తున్నాం." అని ఆయన తెలిపారు.

## అగధలో ప్రముఖ నటి మంజుల మనవరాలు





**వుదయం సినిమా :** తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఒకప్పుడు అగ్ర కథానాయిక గా వెలుగొందారు మంజుల. ఎన్టీఆర్ తో మనుషులంతా ఒక్కటే, మగాడు, నేరం నాది కాదు ఆకలిది, ఏయన్నార్ తో దొరబాబు, బంగారు బొమ్మలు, మహాకవి క్షేత్రయ్య, కృష్ణ తో మాయదారి మల్లిగాడు, రక్తసంబంధాలు, శోభన్‌బాబు తో మంచి మనుషులు, పిచ్చిమారాజు వంటి ఎన్నో సూపర్ హిట్స్ లో నటించారు. మంజుల కూతురు వనిత ను 'దేవి' తో నటిగా పరిచయం చేశారు ఎంఎస్ రాజు. ఇప్పుడు మంజుల మనవరాలు, వనిత కుమార్తె జోవికా విజయ్ కుమార్‌ను 'అగధ' తో నటిగా పరిచయం చేస్తున్నారు ఎంఎస్ రాజు. ఇందులో ఆమె పాత్ర పేరు 'హరిణి'. ఆమె క్యారెక్టర్ పోస్టర్ ని నేడు విడుదల చేశారు.

## డబ్బు కోసం ఇదేం పని..?



**వుదయం సినిమా :** బాలీవుడ్ నటి నేహా శర్మ సోషల్‌మీడియాలో విమర్శలు ఎదుర్కొంటుంది. రామ్ చరణ్ మొదటి సినిమా చిరుతతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తర్వాత కుర్రాడు మూవీ మాత్రమే తెలుగులో చేసింది. ఆ తర్వాత హిందీ పరిశ్రమలో బిజీ అయిపోయింది. అయితే, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన కంటెంట్ కోసం సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. దీంతో యూత్‌ను తప్పుదోవ పట్టిస్తోందని ఆమెపై విమర్శలు వచ్చాయి. నేహా శర్మను సుమారు 20 లక్షల మంది ఫాలో అవుతున్నారు. కానీ, ఆమె ప్రత్యేకంగా షేర్ చేసే కంటెంట్‌ను పొందేందుకు మాత్రం 10వేల వరకు వినియోగదారులు సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నారు. అందుకోసం నెలకు రూ. 299 చెల్లిస్తున్నారు. అంటే నెలకు రూ. 30 లక్షల వరకు ఆమె సంపాధిస్తుంది. అయితే, ఆమె అభిమానుల్లో కొందరు విమర్శించగా.. మరికొందరు సమర్థించారు.

## జెట్లీ ట్రైలర్ విడుదల



**వుదయం సినిమా :** టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. యూనిక్ కథలతో, అన్‌ప్రెడిక్టబుల్ హ్యూమర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ద్వయం, ఈసారి మరింత పెద్ద స్థాయిలో, మరింత వినోదంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైయ్యారు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలతో మంచి బజ్ సృష్టించిన ఈ చిత్రం, తాజాగా రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

## అప్పడే నేను ప్రశాంతంగా ఉంటా

**వుదయం సినిమా :** ఇటీవల సెంటర్ ఆఫ్ ది మీడియాగా మారిన నటి త్రిష.. చిత్ర పరిశ్రమలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ హాట్‌టాపిక్‌గా మారారు. దీంతో ఆమె సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో కొనసాగుతుంది. రెండు దశాబ్దాలకు పైగా దక్షిణాది ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గా రాణిస్తున్న త్రిష.. కోలీవుడ్‌లోని అతి కొద్దిమంది మోస్ట్ బ్యాచిలర్ నటీమణుల్లో ఒకరు. ఈ విషయం కూడా ఈమెను వార్తల్లో నిలబెట్టడానికి ఒక కారణం కావచ్చు. నటుడు, తమిళగ వెట్రికళగం పార్టీ అధ్యక్షుడు విజయ్ ఫ్రెండ్ కావడంతో ఈమె రాజకీయాల్లోనూ ఎక్కువగా నానుతున్నారు. దీంతో త్రిష రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధం అవుతున్నారని, సినిమాలకు గుడ్‌బై చెప్పబోతున్నారని ప్రచారం జోరుగా సాగింది. అయితే నటనకు స్వస్తి చెప్పడం లేదని చెప్పే విధంగా ఇటీవలే ఒక తెలుగు చిత్రంలో నటించడానికి కమిట్ అయ్యారు. ఈమె మిత్రులతో కలిసి ఎంజాయ్ చేసే ఫొటోలు తరచూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంటాయి. త్రిష రాత్రి వేళ మేలుకుని ఉంటారనే ప్రచారం ఉంది.



## భోగి ఫస్ట్ లుక్



**వుదయం సినిమా :** చార్మింగ్ స్టార్ శర్వా, మాస్ మేవరిక్ సంపత్ నందితో కలిసి చేస్తున్న భారీ పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ సాగా 'భోగి'. ప్రతిష్టాత్మక శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. శర్వా కెరీర్‌లో అత్యంత భారీ స్థాయి ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే ఆకట్టుకునే ఫస్ట్‌లుక్ పోస్టర్, శర్వా పుట్టినరోజు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. వీటికి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా మేకర్స్ అనుపమ పరమేశ్వరన్ పాత్రను పరిచయం చేస్తూ 'కందుల సులోచన రాణి'గా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అనుపమ పల్లెటూరి యువతిగా సహజసిద్ధమైన లుక్‌లో కనిపిస్తుంది. దుమ్ముతో నిండిన గ్రామీణ మార్గంలో కాలిబాటగా నడుస్తూ, తలపై ఆకులతో నిండిన పెద్ద బుట్టను మోస్తూ, చేతిలో మరికొన్ని ఆకులు, టిఫిన్ డబ్బాతో కనిపించడం ఆకట్టుకుంది. హాఫ్ శారీ, ఫేడెడ్ బ్లౌజ్‌తో ఆమె లుక్ పూర్తిగా రస్టిక్ ఫీల్‌ను ఇస్తోంది. ఆమె లుక్ లో ఇంటన్సిటీ పాత్ర బలాన్ని సూచిస్తోంది. బ్యాక్‌డ్రాప్‌లో కనిపించే మట్టి ఇళ్లు, కంచెలు, పశువులు అసలైన గ్రామీణ వాతావరణాన్ని అందంగా చూపిస్తున్నాయి.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.